ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

అందరికీ స్వాగతం... సుస్వాగతం


బుధవారం | 12-6-2024 | పేజీలు: 14 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 57 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 7.17 తదుపరి సప్తమి; నక్షత్రం: మఖ రా. 2.12 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ. 12.55-2.41; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.41; అమృతఘడియలు: రా. 11.32-1.19; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం





ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల సాకారానికి శుభారంభం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్డీయే శాసనసభాపక్ష నేత

శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ప్రమాణ స్వీకార మహోత్సవం

తేదీ & సమయం

జూన్ 12, 2024 (బుధవారం), ఉదయం గం. 11:27 ని.లకు

స్థలం

కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద, గన్నవరం, కృష్ణా జిల్లా

ముఖ్య అతిథులు

భారత ప్రధాని **శ్రీ నరేంద్ర మోదీ గారు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ **శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ గారు**

భారత హోమ్ శాఖామాత్యులు **శ్రీ అమిత్ షా గారు**

విశిష్ట అతిథులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు **శ్రీమతి పురందేశ్వరి గారు**

జనసేన అధినేత **శ్రీ పవన్ కళ్యాణ్ గారు**

అందరికీ స్వాగతం... సుస్వాగతం

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


నిజమైన నాయకుడు...
విజనున్న అధినాయకుడు...
విభజితాంధ్రప్రదేశ్‌ని విజయపథాన
నడిపించగల ఏకైక దార్శనికుడు...
అంధకారమలముకున్న ఆంధ్రగడ్డకు వెలుగులద్ది
పునఃనిర్మించగల ఒకే ఒక్కడు...
మహానేత శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
చేస్తున్న శుభసందర్భంగా శుభాకాంక్షలు...
ఆంధ్రదేశానికి అభినందనలు...
కూటమి ప్రభుత్వానికి విజయ హారతులు...
మీ...
దామచర్ల సత్యనారాయణ(సత్య)
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి,
టీడీపీ ఉత్తరాంధ్ర (జోన్ 1) ఇన్‌చార్జి,
కొండపి నియోజకవర్గం, ప్రకాశం జిల్లా

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI



బుధవారం | 12-6-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-6-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ

పరీక్ష పవిత్రత దెబ్బతింది!

'నీట్'పై మీ సమాధానం చెప్పండి



కేంద్రం, ఎన్టీఏకు సుప్రీం నోటీసులు.. తక్షణమే జవాబు ఇవ్వాలని ఆదేశం

నీట్ కౌన్సెలింగ్‌పై స్టేకు నిరాకరణ.. తదుపరి విచారణ జూలై 8న

పరీక్ష, ఫలితాలను అనుమానిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు

వాటిపై ఇంకా స్పందించని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ

6





టీడీపీ కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో చంద్రబాబు, పవన్ ఆత్మీయ ఆలింగనం

టీడీపీ కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో శిరస్సు వంచి నమస్కరిస్తున్న చంద్రబాబు, వేదికపై పురందేశ్వరి, పవన్ కల్యాణ్

నవ శకానికి నాంది!

మరో శకానికి నాంది నేడే!
నవ్యాంధ్ర చరిత్ర మేలి మలుపు తిరిగేది నేడే!
ఐదేళ్ల విధ్వంస పాలన స్థానంలో... అమరావతి, పోలవరం, సంక్షేమం, సమగ్రాభివృద్ధే మంత్రాలుగా పని చేస్తామంటున్న కొత్త ప్రభుత్వం కొలువు తీరేది నేడే!
సార్వత్రిక ఎన్నికల్లో కనీవినీ ఎరుగని రీతిలో.. 164 స్థానాల్లో విజయ దుందుభి మోగించిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సర్కారు అధికారికంగా ఏర్పడేది నేడే!
ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార ముహూర్తం.. బుధవారం ఉదయం 11.27 గంటలు!
వేదిక.. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి!
అతిథులు, ఆహ్వానితులు.. అతిరథ మహారథుల నుంచి సామాన్య కార్యకర్తలు, అభిమానుల దాకా!

'కూటమి' కొలువు తీరేది నేడే

ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం

మంత్రివర్గ సహచరులు కూడా!

గన్నవరం సమీపంలో వేదిక సిద్ధం

విజయవాడ చేరుకున్న అమిత్‌షా, నడ్డా

నేడు ప్రధాని నరేంద్ర మోదీ రాక

దేశ, విదేశీ ప్రముఖులకు ఆహ్వానం

ప్రమాణ స్వీకారాలకే కార్యక్రమం పరిమితం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'కూటమి' కొలువు తీరేందుకు సర్వం సిద్ధమైంది. నవ్యాంధ్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఆయన కొత్త మంత్రివర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గన్నవరం విమానాశ్రయానికి సమీపంలో ఎంపిక చేసిన మైదానంలో భారీ జన సందోహం నడుమ ఈ ప్రమాణ స్వీకార

మిగతా 8వ పేజీలో...

తొలి సంతకాలు

రేపు సీఎం హోదాలో సచివాలయానికి బాబు

డీఎస్సీ, పింఛను పెంపు ఫైళ్లకు తొలిగా ఓకే

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకూ ఆమోదం!





6

ఒడిసా సీఎంగా మోహన్ చరణ్ మాఝీ

గిరిజన నేతకు అవకాశమిచ్చిన బీజేపీ

భువనేశ్వర్‌లో నేడు ప్రమాణ స్వీకారం

4సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాఝీ

డిప్యూటీలుగా కేవీ సింగ్‌దేవ్, ప్రవతీ



6

ఏడాదికి 2సార్లు ప్రవేశాలు!

ఉన్నత విద్యా సంస్థల్లో రెగ్యులర్ కోర్సుల విద్యార్థులకు చక్కటి చాన్స్

వర్సిటీలు, కాలేజీలకు అనుమతి

ఈ ఏడాది నుంచే అమలు: యూజీసీ



6

మూల వేతనంలో 50% పింఛను!

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్డీయే సర్కారు ఆఫర్

కమిటీ సిఫారసులపై దృష్టి

అమలుకు గడువు పెట్టని కమిటీ

24 మందితో కేబినెట్

బీసీలకే పెద్దపీట.. అచ్చెన్న, కొల్లు సహా 8 మందికి మంత్రి పదవులు

ముగ్గురు మహిళలకు చోటు.. అనిత, సవిత, సంధ్యారాణికి అవకాశం

పవన్, దుర్గేశ్, కొండపల్లి సహా 8 మంది కొత్త ఎమ్మెల్యేలకు చోటు

పాత తరం ఆనం, కొలుసు, నారాయణ, లోకేశ్, ఫరూక్, కేశవ్‌కూ..

టీడీపీ	20
జనసేన	3
బీజేపీ	1

నేటి నుంచే ప్రజాపాలన

ప్రతి అడుగూ ప్రజల కోసమే

కూల్చివేతలు, నరికివేతలు ఉండవు

తెలుగు జాతిని నంబర్ వన్ చేద్దాం

అమరావతే రాజధాని.. ఆర్థిక రాజధానిగా విశాఖ.. కర్నూలును అభివృద్ధి చేస్తాం

పవన్ కల్యాణ్ స్ఫూర్తి భేష్: బాబు

7



మంచి రోజులొచ్చాయి

రాష్ట్రానికి చంద్రబాబు అవసరం

పగ, ప్రతీకారాలకు సమయం కాదు

అభివృద్ధి కోసమే అడుగులు: పవన్

8

డేటా ఎత్తేసిన దొంగ తోడేళ్లు



హోటల్ నుంచి 'మైనింగ్' ఆపరేషన్

డైరెక్టరేట్ కంప్యూటర్లలోకి చొరబాటు

ఆఫీసులు సీజ్‌తో హోటల్‌లో కూర్చుని ఆన్‌లైన్ ద్వారా లాగ్‌డేటా డిలీట్

ఓ ఐటీ ఇంజనీర్ సాయంతో వ్యవహారం

ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌టాప్‌లూ ఫార్మాట్

రికవరీకి సాధ్యంకాని విధంగా మాయం

గనుల శాఖలో తోడేళ్ల సరికొత్త పన్నాగం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖలో నిధుల దారి మళ్లింపు వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టడంతో దొంగ తోడేళ్లు అప్రమత్తమయ్యాయి. తమ అవినీతి, అక్రమాల లోగుట్టు బయటపడటం ఖాయమని గుర్తించిన దొంగలు తమ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు మంగళవారం సరికొత్త ఎత్తుగడ వేశారు. మంగళగిరిలోని ఓ పెద్ద హోటల్ రూమ్ తీసుకొని అక్కడి నుంచే మంత్రాంగాన్ని నడిపారు. నిధుల దుర్వినియోగం కేసులో పోలీసులకు

మిగతా 2వ పేజీలో...


ఇంజనీరింగ్‌లో అబ్బాయిలు అదుర్స్

టాప్ టెన్ ర్యాంకులూ వారివే.. సంఖ్యాపరంగా అమ్మాయిలే ఎక్కువ

అగ్రిలో తెలంగాణ విద్యార్థికి టాప్ ర్యాంక్.. 4 ర్యాంకులు కొట్టిన అమ్మాయిలు

ఈఏపీసెట్‌లో 78.26% మందికి అర్హత.. త్వరలో ఇంజనీరింగ్ అడ్మిషన్లు

9





లక్ష గెలిచారు!



'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతల లక్కీ డ్రా తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావు. చిత్రంలో.. 'ఆంధ్రజ్యోతి' ఎడిటోరియల్, సర్క్యులేషన్, అడ్వర్టైజ్‌మెంట్ సిబ్బంది.

- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' డ్రా
- పార్కింగ్ స్టాండ్ ఉద్యోగికి తొలి బహుమతి
- కర్నూలు గృహిణికి రూ.50 వేలు
- మరో ఐదుగురికీ బహుమతులు
- కూటమి, వైసీపీకి దక్కే సీట్లపై ఖచ్చితమైన అంచనా

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'కూటమికి 164 సీట్లు వస్తాయి. వైసీపీ 11 స్థానాలతో సరిపెట్టుకుంటుంది' అని ఎన్నికల ఫలితాలను అత్యంత కచ్చితత్వంతో అంచనా వేసిన 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు బహుమతుల పంట పండింది. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పోటీలో విజేతలను మంగళవారం విజయవాడ 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంలో డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగింది. మొత్తం 13 మంది కచ్చితమైన అంచనా వేయగా... డ్రాలో తొలి బహుమతి విజయవాడకు చెందిన వీరపనేని ముసలయ్యకు లభించింది. ఆయనకు రూ.లక్ష బహుమతి అందించడం జరుగుతుంది. ముసలయ్య విజయవాడ ఆర్టీసీ బస్టాండులో పార్కింగ్ స్టాండ్‌లో ఉద్యోగి. 'డ్రా'లో రెండో బహుమతి రూ.50వేలు కర్నూలు నగరం కల్లూరుకు చెందిన గృహిణి ఎస్.మహేశ్వరికి దక్కింది. ఇక.. ఎ.సాంబశివరావు (ఒంగోలు), ఏసీ బాలన్న (కడప), మామిడి వేదవర్ష (గాజువాక, విశాఖపట్నం), వజ్జా శిరీష (నందిగామ, శ్రీకాకుళం) పుల్లూరు మాధవ్ (మట్టపల్లె, చిత్తూరు)కు రూ.10వేల చొప్పున బహుమతి లభించింది. ఈ 'డ్రా' కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావుతోపాటు ఎడిటోరియల్, సర్క్యులేషన్, అడ్వర్టైజింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాలపై ఆసక్తివల్లే..



నేను 'ఆంధ్రజ్యోతి' అభిమానిని. 20 ఏళ్లుగా ఆ పత్రిక చదువుతున్నా. రాజకీయాలపై ఆసక్తి బాగా ఎక్కువ. రాజకీయ వార్తలన్నీ చదువుతూ అందరితో చర్చిస్తూ ఉంటాను. నాకున్న అవగాహనతో కూటమికి, వైసీపీకి వచ్చే సీట్లను అంచనా వేసి కూపన్ పంపించాను. అదే నిజమైంది, అదృష్టం వరించింది. ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు!

- వీరపనేని ముసలయ్య

వ్యతిరేకత పసిగట్టాను..

ప్రతిరోజూ ఆంధ్రజ్యోతి దినపత్రిక చదువుతాను. పత్రికలో వచ్చే కథనాలపై ప్రజల్లో బాగా చర్చ జరిగేది. ఎక్కడకు వెళ్లినా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు గురించే మాట్లాడుకునేవాళ్లు. రోడ్లు శిథిలమయ్యాయి. వైసీపీ పాలనపై ప్రజలు విసిగి పోయారని గ్రహించాను. కూటమి భారీ విజయం తథ్యమని అంచనా వేశాను. నా ఊహ నిజమైంది. రెండో బహుమతి గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉంది.

- మహేశ్వరి, గృహిణి, కర్నూలు

డేటా ఎత్తేసిన దొంగ తోడేళ్లు

(మొదటిపేజీ తరువాయి)

వాంటెడ్‌గా ఉన్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను పిలిపించుకొని అతని ద్వారా గనుల శాఖ డైరెక్టరేట్‌లోని కంప్యూటర్లలోకి ఆన్‌లైన్‌ద్వారా చొరబడేందుకు, సర్వర్లలో ఉన్న డేటాను పూర్తిగా తొలగించేందుకు(ఎరేజ్) విశ్వప్రయత్నాలు చేశారు. మరోవైపు ప్రభుత్వం తమకు ఇచ్చిన ల్యాప్‌టాప్‌ల్లో ఉన్న డేటాను పూర్తిగా తొలగించి వాటిని రికవరీకి సాధ్యంకాని రీతిలో ఫార్మాట్ చేసినట్లు తెలిసింది. పెద్ద అవినీతి తోడేలుకు అండదండలందించి ప్రభుత్వ సొమ్మును కాజేసిన మరో ముగ్గురు సీనియర్లు ఈ మంత్రాంగంలో పాల్గొన్నట్లు తెలిసింది. గనుల శాఖ డైరెక్టరేట్ పరిధిలో ఓ కాంట్రాక్టర్ సెక్యూరిటీ డిపాజిట్ సొమ్మును కొందరు ఉన్నతాధికారులు.....చిరుద్యోగుల సహకారంతో కాజేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' తాజాగా వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. పోలీసులపై ఒత్తిళ్లు తీసుకొచ్చి కేసు పెద్ద అధికారులపై రాకుండా కేవలం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపైనే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే, నిధుల దారిమళ్లింపు పెద్ద అధికారులకు తెలిసే జరిగిందనేలా సాంకేతిక అంశాలను 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. నిధుల విడుదల ఫైళ్లను ఆమోదించే సమయంలో మూడు స్థాయుల్లో అధికారుల డాంగిల్స్ వాడారు. దాంతోపాటు వారి వేలిముద్రలు కూడా ఇచ్చారు. ఇవన్నీ కంప్యూటర్ రికార్డుల్లో, గనుల శాఖ డైరెక్టరేట్ ఈ-ఫైలింగ్ సర్వర్లలో నిక్షిప్తమై ఉన్నాయి. తమకు సంబంధం లేదని పెద్ద అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నా, ఆఫీసు ఫైళ్లు వారి బండారాన్ని బయటపెట్టేలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గనుల శాఖ డైరెక్టరేట్ ఈ-ఆఫీసు సర్వర్లలో ఉన్న డేటాను తొలగించాలని నిధుల దుర్వినియోగం దందాలో భాగస్వాములైన ముగ్గురు పెద్ద అధికారులు నిర్ణయించారు.

ప్రస్తుతం రెండు ఆఫీసులను ప్రభుత్వం సీజ్ చేయడంతో భౌతికంగా ఆఫీసులకు వెళ్లడం సాధ్యం కాదు. దీంతో ఇంటర్నెట్ సేవలను ఉపయోగించుకొని డైరెక్టరేట్ సర్వర్‌ను హ్యాక్‌చేసి డేటాను, దాంతోపాటు డేటా లాగ్స్‌ను తొలగించాలని పన్నాగం పన్నారు. అయితే, ఈ పని అక్రమాల్లో భాగస్వాములైన ఆ ముగ్గురి అధికారులతోనే సాధ్యమయ్యేది కాదు. దీంతో డైరెక్టరేట్‌లోని ఐటీ విభాగంలో పనిచేస్తున్న ఓ ఐటీ ఇంజనీరుతో ఈ పని చేయించాలనుకున్నారు. ఇందుకు మంగళగిరిలోని ఓ ప్రముఖ హోటల్‌ను ఎంచుకున్నారు. మూడో అంతస్తులోని ఓ రూమ్ కేంద్రంగా ఆన్‌లైన్ ఆపరేషన్ చేశారు. రిమోట్ ఐపీ అడ్రస్ ఆధారంగా సర్వర్లలోకి చొరబడే ప్రయత్నం చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు ముగ్గురు అధికారులకు సంబంధించి ఫైల్ డేటా లాగ్స్‌ను తొలగించినట్లుగా తెలిసింది. దీంతోపాటు ఆ ముగ్గురికి ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌టాప్‌లను కూడా ఫార్మాట్ చేసినట్లు సమాచారం. నిధుల దుర్వినియోగం కేసులో విచారణ మలుపుతిరిగి వీరిని విచారిస్తే ల్యాప్‌టాప్ డేటా కీలకం కానుంది. దీంతో ఒకవేళ రికవరీ చేసినా ఒక్క ఫైల్ కూడా తిరిగిరాకుండా వాటిని ఫార్మాట్ చేశారు.

విద్యా కానుక అస్తవ్యస్తం

- సకాలంలో సరఫరా చేయని కాంట్రాక్టర్లు
- యూనిఫాంలు వచ్చింది 17 శాతమే
- బ్యాగులు 39 శాతం, బూట్లు 32 శాతం
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కవడంతో ఈ దుస్థితి



అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే విద్యా కానుక అస్తవ్యస్తంగా మారింది. పాత కాంట్రాక్టర్లతో వైసీపీ పెద్దలు, పాఠశాల విద్యాశాఖ అధికారులు కుమ్మక్కు కావడంతో చివరికి సకాలంలో కిట్లు సరఫరాకాని దుస్థితి నెలకొంది. ఈ ఏడాది టెండర్లు లేకుండానే గతేడాది కిట్లు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు అధికారులు అప్పనంగా కాంట్రాక్టు కట్టబెట్టారు. ఇలా కావాల్సిన కాంట్రాక్టర్లను ఎంపిక చేయడంతో సకాలంలో కిట్లు సరఫరా చేయడంలో వారు చేతులెత్తేశారు. 13న బడులు తెరిచే రోజు నుంచే కిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఒక్క వస్తువు కూడా నూరు శాతం రాష్ట్రానికి రాలేదు. బ్యాగులు కేవలం 39 శాతం, యూనిఫాం క్లాత్‌లు 17 శాతం, బెల్టులు 72 శాతం, బూట్లు 32 శాతం, ఒకటో తరగతి విద్యార్థులకు ఇచ్చే డిక్షనరీలు 5 శాతం, ఆరో తరగతి విద్యార్థులకు ఇచ్చే డిక్షనరీలు 80 శాతం, నోట్ పుస్తకాలు 82 శాతం వచ్చాయి. బుధవారం నుంచి ఈ వస్తువులన్నీ పాఠశాలలకు రవాణా కావాలి. ఇలా అరకొరగా కిట్లు రావడంతో ఏ పాఠశాలలకు పంపాలనే అంశంపై గందరగోళం ఏర్పడనుంది. అయితే ఇదంతా అస్మదీయ కాంట్రాక్టర్ల కారణంగానే అని స్పష్టమవుతోంది. ఈ ఏడాది రూ.630 కోట్లతో 36.5 లక్షల కిట్లు కొనుగోలు చేస్తున్నారు. అంత పెద్ద కాంట్రాక్టును టెండర్లు లేకుండా నేరుగా అప్పగించేశారు. అయినా పాత బకాయిలు చెల్లించకపోతే కిట్లు ఇవ్వబోమని ఆ కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని బెదిరించారు. తొలుత 50 శాతం బకాయిలు చెల్లించాలని కండిషన్ పెట్టడంతో సమగ్రశిక్ష అధికారులు రూ.300 కోట్లు ఇచ్చారు. ఆ తర్వాత కొంతకాలానికి మరో 40శాతం ఇవ్వకపోతే కిట్లు ఇవ్వబోమని కాంట్రాక్టర్లు మళ్లీ అడ్డం తిరిగారు. దీంతో మొత్తం 90 శాతం బకాయిలు చెల్లించేశారు. అయినా కూడా ఇప్పటికీ రాబోయే విద్యా సంవత్సరానికి కిట్లు సక్రమంగా సరఫరా చేయలేదు. అయితే కాంట్రాక్టర్లు బెదిరించడం ప్రభుత్వ పెద్దల ప్లాన్‌లో భాగమేనని తర్వాత అర్థమైంది. డబ్బులిస్తేనే కిట్లు సరఫరా చేస్తామని షరతు పెట్టాలని ప్రభుత్వంలోనే కొందరు వారికి సూచించారు. అలా రెండుసార్లు వారు కోరిన విధంగా డబ్బులు చెల్లించారు. తద్వారా ప్రభుత్వ పెద్దలు, కొందరు అధికారులకు కమీషన్లు దక్కాయి. అయితే ఇంత చేసినా ఇప్పుడు మళ్లీ మధ్యలో కిట్లు ఆపేయాలని కాంట్రాక్టర్లు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పుడు సరఫరా చేస్తున్న కిట్లకు కూడా డబ్బులిస్తేనే మొత్తం సరఫరా పూర్తిచేస్తామని కాంట్రాక్టర్లు అంటున్నట్టు తెలిసింది. ప్రభుత్వం మారినందున కొత్త ప్రభుత్వం వైసీపీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో ఆలస్యం చేస్తుందేమోననే భయంతో ఇలా చేస్తున్నట్టు తెలిసింది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో ఇద్దరు అధికారులు చక్రం తిప్పారు. వారి నిర్వాకంతో విద్యా కానుక గందరగోళంగా మారింది.

విద్యాకానుక ఇకపై 'స్టూడెంట్ కిట్'

పాఠశాల విద్యార్థులకు ఇచ్చే బ్యాగులు, బూట్లు, బెల్టులు, పుస్తకాల కిట్ పేరును పాఠశాల విద్యాశాఖ మార్చింది. ఇప్పటివరకూ జగనన్న విద్యా కానుక పేరుతో ఈ వస్తువులను విద్యార్థులకు అందిస్తున్నారు. ఇంకా నూతన ప్రభుత్వం ఏర్పాటుకానందున ప్రస్తుతానికి స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చింది. ఈ మేరకు స్టూడెంట్ కిట్ల పంపిణీపై సమగ్రశిక్ష ఎస్పీడీ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకూ విద్యాకానుక పేరుతో కిట్లు పంపిణీ చేసిన జగన్ ప్రభుత్వం రాజకీయ ప్రచారం చేసుకుంది. బ్యాగులు, బెల్టులు, నోట్ పుస్తకాలపై జగన్ ఫొటోలు, పేర్లు వేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇప్పుడు పంపిణీ చేయబోయే కిట్లపై ఎలాంటి పేర్లు ముద్రించలేదు.

భోగాపురంలో
70 ఎకరాలకు జవహర్ ఎసరు

- 300 కోట్ల రూపాయల కుంభకోణం
- జనసేన నేత మూర్తియాదవ్



విశాఖపట్నం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి రూ.వందల కోట్ల విలువైన భూముల కబ్జాకు పాల్పడ్డారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా భోగాపురం మండలం బసవపాలెంలో 70 ఎకరాల భూమికి జవహర్ రెడ్డి ఎసరు పెట్టారని తెలిపారు. దీనిలో 50 ఎకరాలు డి.పట్టా కాగా మరో 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ 70 ఎకరాల విలువ సుమారు రూ.300 కోట్లు ఉంటుందన్నారు. చంద్రబాబు హయాంలో 2018లో భోగాపురం మండలం బసవపాలెం సర్వే నంబరు 22 నుంచి 24, 79 నుంచి 83లో మొత్తం 70 ఎకరాలు మెగా ఫుడ్ పార్కు ఏర్పాటుకు కేటాయించారన్నారు. దీనిలో 50 ఎకరాలు డి.పట్టా భూములు, మరో 20 ఎకరాలు ప్రభుత్వానికి చెందినవిగా రెవెన్యూ అధికారులు గుర్తించి ఏపీఐఐసీకి బదలాయించారని తెలిపారు. ఈ 70 ఎకరాల్లో మెగా ఫుడ్ పార్కు కోసం 2019 ఫిబ్రవరి 13 జీవో 139 జారీ చేశారన్నారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ఫుడ్‌పార్కుకు ప్రోత్సాహం లేకపోవడంతో కంపెనీ ప్రారంభించలేని పరిస్థితి వచ్చిందన్నారు. డి.పట్టా భూములను రెగ్యులర్ చేయడానికి గత ఏడాది జూలైలో గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేశారని తెలిపారు. దీంతో జవహర్‌రెడ్డి, ఆయన బినామీ త్రిలోక్ విశాఖ, విజయనగరం జిల్లాల్లో డి.పట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేయించుకున్నారని ఆరోపించారు. ఏపీఐఐసీ కేటాయించిన 70 ఎకరాలపై కన్నేసిన జవహర్‌రెడ్డి తన అధికారం ఉపయోగించుకుని పావులు కదిపారన్నారు. ఏపీఐఐసీ సేకరించిన భూమిలో 50 ఎకరాలకు సంబంధించి గత ఏడాది డిసెంబరు 18నే ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చెందిన 20 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు చేయించారని అన్నారు.

గుప్పిట్లో 70 ఎకరాలు

బసవపాలెంలో 70 ఎకరాలు జవహర్‌రెడ్డి గుప్పిట్లోనే ఉందని మూర్తి యాదవ్ ఆరోపించారు.ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు జారీ చేసిన వ్యవహారంలో విజయనగరం కలెక్టర్, ఆర్డీవో, భోగాపురం తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలన్నారు. జవహర్‌రెడ్డి భూముల కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

NATIONAL INSTITUTE FOR MICRO, SMALL AND MEDIUM ENTERPRISES (ni-msme)
(An Organization of the Ministry of MSME, GoI & ISO 9001:2015 Certified)
Yousufguda, Hyderabad-500045, Telangana State.
Ph.No.040-23633213/210, E-mail: nimsme-admn@nimsme.org

RECRUITMENT NOTIFICATION
Advertisement No.ni-msme/vacancies/CFI/2024/01, Date 07.06.2024

S. No.	Name of the Post	No.of Post	Age on 01.01.2024	Monthly Remuneration	Important Information
1	Vertical Heads - Research & Publications; Capacity Building & Consultancy	02	40-58 years	Rs.1,00,000/-	1) For all details, please visit the official website. www.nimsme.org
2	Subject Matter Experts – Research & Publications; Capacity Building & Consultancy	02	35-58 years	Rs.50,000/-	2) Last date for submission of application is 23.06.2024
3	Young Professional	02	Up to 30 years	Rs.25,000/-	3) Filled Application send to: cfirecruitment@nimsme.org

Sd/- Admin. & Accounts Officer

APGVB ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK
HEAD OFFICE :: WARANGAL

NOTICE INVITING ONLINE E-TENDERS
(Refer Tender Notice No's 2 & 3, Dated: 11-06-2024)
We invite online applications for the following Tenders as under.

Tender No's	Description	Last Date of Submission
Tender No.2	PROPOSED CONSTRUCTION OF BANKS OWN BUILDING BRANCH CONSISTING OF (GROUND FLOOR) COMPRISING OF CIVIL, SANITRAY, WATER SUPPLY, OF ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK IN SY NO 285P, PLOT NOS 183,184,196 SITUATED IN RAJAPUR VILLAGE BALANAGAR MANDAL MAHABUBNAGAR DISTRICT TELANGANA, IN TWO BIDS THROUGH E- TENDERING PROCESS	02-07-2024 up to 2pm
Tender No.3	PROPOSED CONSTRUCTION OF BANKS OWN BUILDING BRANCH CONSISTING OF (GROUND FLOOR) COMPRISING CIVIL, SANITARAY, WATER SUPPLY, OF ANDHRA GRAMEENA VIKAS BANK IN H.NO 1-44 &1-45 SITUATED AKUTHOTAPALLY VILLAGE AMANGAL MANDAL RANGA REDDY DISTRICT TELANGANA, IN TWO BIDS THROUGH E- TENDERING PROCESS.	02-07-2024 up to 2pm

IN TWO BID THROUGH E-TENDERING PROCESS.
For details, see tender Documents placed in our Banks' website: www.apgvbank.in & https://etenders.sbi. Contact Sudhakar Meda: 9493126209, P. Rajasekhar : 9490157451.
General Manager (Operations)

కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహకాలు


- కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ



భీమవరం టౌన్, జూన్ 11: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాక పోగా, ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోయిన పరిస్థితిని చూశామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. అమర్ రాజా బ్యాటరీనే ఇందుకు ఉదాహరణ అన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిగా ప్రమాణం చేసిన ఆయన.. తండ్రి సూర్య నారాయణరాజు అస్వస్థతకు గురయ్యారని తెలిసి మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి తిరిగి వచ్చారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని చూసి కన్నీరుపెట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల రాష్ట్రంలో ఉద్యోగులు నిరుద్యోగులుగా మారే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొత్తగా చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడబోతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, సోమవారం కేంద్రమంత్రి కుమారస్వామితో కూడా ఇదే అంశంపై మాట్లాడానని తెలిపారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహం ఇస్తామన్నారు. నిబంధనలు సులభతరం చేయడం, అనుమతులు ఇవ్వడం, త్వరితగతిన భూముల కేటాయింపు తదితర అంశాలపై భరోసా ఇచ్చినప్పుడే పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తారన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారానే రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వర్మ హామీ ఇచ్చారు. రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గ ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసి వారి రుణం తీర్చుకుంటానన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ, కూటమి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర మంత్రి పదవుల్లోనూ రాష్ట్రానికి అన్యాయమే: సీపీఐ

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న ప్రధాని మోదీ తాజాగా కేంద్ర మంత్రివర్గంలో శాఖల కేటాయింపులో కూడా ఏపీకి అన్యాయమే చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఏపీకి ఒకే ఒక్క పూర్తిస్థాయి మంత్రి పదవి ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, ఇద్దరికి సహాయ మంత్రి పదవులు కేటాయించినప్పటికీ అవి అలంకార ప్రాయమేనని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏమాత్రం ప్రయోజనం లేని పౌర విమానయాన శాఖను ఏపీకి కేటాయించడం విచారకరమన్నారు.



SAINIK SCHOOL KALIKIRI, ANNAMAYYA DIST(AP)
(Under the aegis of Sainik Schools Society, Ministry of Defence)

WALK IN INTERVIEW - PGT ENGLISH (PURELY TEMPORARY BASIS)
Walk in interview is scheduled at Sainik School Kalikiri on 25 June, 2024 for the following vacancy **PURELY ON TEMPORARY BASIS** not exceeding 179 days.

S. No	Post	No. of Vacancies	Qualifications, Age & Consolidated Remuneration	Time of Reporting
1.	PGT (English)	One Vacancy (Temporary Post for a short period not exceeding 179 days)(UR)	Age: 21-40 years as on 25 June, 2024 For Qualification and remuneration, please visit School Website https://sskal.ac.in	25 Jun 2024 0930 Hrs Friday

Please visit the School Website https://sskal.ac.in for detailed notification. The appointment will be purely on temporary basis for a very short period. Candidates arriving 30 Mins after the reporting time will not be allowed for the interview. No TA/DA is admissible for the interview. Candidates should be present along with the original documents as per the essential qualifications mentioned in school website. No correspondence through post will be made in this regard. **The school administration reserves the right to cancel the vacancy due to administrative reasons.**


Sd/- Principal


కోర్టు ఆదేశాలతోనే ప్రిన్సిపాల్స్‌గా ప్రమోషన్లు

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం నేత సుధాకర్

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యాశాఖలో ప్రిన్సిపాల్స్ ప్రమోషన్లు కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే ఇచ్చారని డైరెక్ట్ రిక్రూటెడ్ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ తెలిపారు. దీనిపై చట్టపరమైన, న్యాయపరమైన సమీక్షలకైనా సిద్ధంగా ఉన్నామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.







స్పోర్ట్స్

విజయవాడ ● బుధవారం 12 జూన్ 2024

పారిస్ ఒలింపిక్స్‌కు ఇషా సింగ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల భారత షూటింగ్ జట్టును జాతీయ షూటింగ్ సమాఖ్య ప్రకటించింది. మంగళవారం విడుదల చేసిన ఈ జాబితాలో హైదరాబాద్ యువ షూటర్ ఇషాసింగ్‌కు స్థానం లభించింది. సెలెక్షన్ ట్రయల్స్‌లో ఇషా సత్తా చాటడంతో 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో బెర్త్ దక్కించుకుంది. పిస్టల్, రైఫిల్ విభాగంలో తలపడే షూటర్ల జాబితాను వెల్లడించగా, షాట్‌గన్ షూటర్ల పేర్లను ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ అనంతరం ప్రకటించనుంది.

ఇదే జట్టు: సందీప్ సింగ్, అర్జున్ బబూటా, శరబ్‌జోత్ సింగ్, అర్జున్ సింగ్ చీమా, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, స్వప్నిల్ కుసలె, అనీష్, విజయ్‌వీర్ సిద్ధు...ఇక మహిళల్లో ఎలవెనిల్ వలరివాన్, రమిత, సిఫ్ట్ కౌర్ సమ్రా, అంజుమ్ మౌద్గిల్, మను భాకర్, రిథమ్ సంగ్వాన్, ఇషా సింగ్

భారత్‌లో జూ. హాకీ వరల్డ్‌కప్

లోజాన్ (స్విట్జర్లాండ్): పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ మెగా ఈవెంట్ వచ్చేఏడాది భారత్ వేదికగా డిసెంబరులో జరగనుందని అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఐహెచ్ఎఫ్) మంగళవారం ప్రకటించింది. కాగా ఈసారి అత్యధికంగా 24 జట్లు పోటీపడనున్నట్టు ఐహెచ్ఎఫ్ తెలిపింది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	2	2	0	0	4	1.455
అమెరికా	2	2	0	0	4	0.626
పాకిస్థాన్	3	1	2	0	2	0.191
కెనడా	3	1	2	0	2	-0.493
ఐర్లాండ్	2	0	2	0	0	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

భారత్ VS మినీ భారత్



గెలిస్తే సూపర్-8కు..

యూఎస్‌తో రోహిత్ సేన పోరు నేడు

జోష్‌లో ఇరు జట్లు



న్యూయార్క్: అది పేరుకే అమెరికా జట్టు.. అందులో సగం మంది భారత మూలాలున్న ఆటగాళ్లే. బ్లూ జెర్సీ వేసుకోవాలనే కల.. కలగానే మిగలడంతో దేశం వదిలి వెళ్లిన భారత ఆటగాళ్లు ఇప్పుడు అమెరికా జట్టు తరఫున తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అందుకే భారత్ వర్సెస్ మినీ భారత్‌గా మారిన ఈ మ్యాచ్‌పై అందరికీ ఆసక్తి నెలకొంది. అలాగే గ్రూప్ 'ఎ'లో రోహిత్ సేనకు సమవుజ్జీగా ఉన్నది కూడా యూఎస్ జట్టేననే విషయం మరువరాదు. ఇక పాకిస్థాన్‌పై స్వల్ప లక్ష్యాన్ని భారత్ కాపాడుకుని విజయం సాధించగా.. అటు అదే పాక్ జట్టుతో మ్యాచ్‌ను యూఎస్ సూపర్ ఓవర్ వరకు తీసుకెళ్లి మరీ గెలిచింది. దీంతో ఇరు జట్లు కూడా ప్రస్తుతం రెండేసి విజయాలతో నాలుగు పాయింట్లతో ఉన్నాయి. ఎవరు గెలిచినా సూపర్-8కి వెళ్లే అవకాశం ఉంటుంది. పసికూనే కదా అని తేలిగ్గా తీసుకుంటే.. ఫలితం మరోలా ఉంటుంది కాబట్టి టీమిండియా జాగ్రత్తగా ఆడాల్సిందే. ఈ టీమ్‌లో ఆరోన్ జోన్స్, గౌస్ భారీ హిట్టింగ్‌తో అదరగొడుతుండగా, కోరే అండర్సన్ అనుభవం ఉపయోగపడగలదు. సూర్యకుమార్‌తో కలిసి దేశవాళీల్లో ముంబైకి ఆడిన యూఎస్ పేసర్ నేత్రావల్కర్‌పై అందరి దృష్టీ నెలకొంది.

పిచ్, వాతావరణం

నసౌ కౌంటీ పిచ్ పేసర్లకు స్వర్గధామంగా మారింది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ బ్యాటర్లకు కష్టకాలమే. 120 స్కోరును ఛేదించడం కూడా అసాధ్యంగా మారుతోంది. టాస్ గెలిచిన జట్టు ఎప్పటిలాగే ఫీల్డింగ్‌కే మొగ్గుచూపవచ్చు. వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉండనుంది. వర్షం నుంచి ముప్పు లేదు.

శాంసన్‌ను ఆడిస్తారా?

ఇప్పటిదాకా జరిగిన రెండు మ్యాచ్‌ల్లో భారత బ్యాటర్లు ఆకట్టుకోలేకపోయారు. కీపర్ పంత్ మాత్రమే స్వేచ్ఛగా ఆడుతున్నాడు. ఓపెనర్‌గా వస్తున్న విరాట్‌తో పాటు టీ20ల్లో నెంబర్‌వన్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ పేలవ షాట్లతో నిరాశపరిచారు. రోహిత్ కూడా త్వరగానే నిష్క్రమిస్తున్నాడు. అపార అనుభవం కలిగిన వీరు పిచ్‌ను అర్థం చేసుకుంటూ క్రీజులో కుదురుకోవాలి. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించి.. జట్టులో చోటు దక్కించుకున్న శివమ్ దూబే ఆత్మవిశ్వాసంతో కనిపించడం లేదు. స్పిన్నర్లను కూడా సరిగ్గా ఎదుర్కోలేకపోతున్నాడు. దీంతో ఈ మ్యాచ్‌లో శాంసన్‌ను ఆడిస్తారా? లేక దూబేకు మరో అవకాశం ఇస్తారా? అనేది చూడాల్సిందే. స్పిన్నర్లు అక్షర్, జడేజా ఇప్పటిదాకా ప్రభావం చూపలేదు. పేస్ త్రయం బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్‌తో పాటు అదనపు బౌలర్‌గా హార్దిక్ కొనసాగనున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్, పంత్, సూర్యకుమార్, దూబే/శాంసన్, హార్దిక్, జడేజా, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్.

యూఎస్ఏ: స్టీవెన్ టేలర్, మోనంక్ (కెప్టెన్), గౌస్, జోన్స్, నితీశ్ కుమార్, అండర్సన్, హర్మీత్, జస్దీప్, కెంజిగె, నేత్రావల్కర్, అలీ ఖాన్.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

శ్రీలంక x నేపాల్ (ఉ.5. గం.)
ఆస్ట్రేలియా x నమీబియా (ఉ.6. గం.)
భారత్ x అమెరికా (రాత్రి 8. గం.)

సిక్కులకు అక్మల్ క్షమాపణ



కరాచీ: పాకిస్థాన్‌తో మ్యాచ్ సందర్భంగా ఆ దేశ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. తీరా అది వివాదాస్పదం కావడంతో క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఆ మ్యాచ్‌లో చివరి ఓవర్‌ను అర్ష్‌దీప్ వేయగా.. పాక్ విజయానికి 18 పరుగులు అవసరమయ్యాయి. అయితే స్థానిక టీవీ డిబేట్‌లో పాల్గొన్న కమ్రాన్ అక్మల్ మాట్లాడుతూ.. 'అర్ష్‌దీప్ ఓవర్ కాబట్టి మ్యాచ్‌లో ఏదైనా జరగొచ్చు. ఎందుకంటే రాత్రి 12 గంటలైంది కదా' అంటూ సర్దార్జీలపై ఉండే జోక్‌లనుద్దేశిస్తూ ఎద్దేవా చేశాడు. అటు ఈ కామెంట్స్‌ను మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రంగా తప్పుపట్టాడు. 'అనుచితంగా మాట్లాడే ముందు సిక్కుల చరిత్ర తెలుసుకో. ఆక్రమణదారులు మీ తల్లులను, సోదరీమణులను ఎత్తుకెళ్లినప్పుడు వారిని కాపాడింది సిక్కులే. అప్పుడు సమయం రాత్రి 12 గంటలే అయ్యింది. నిన్ను చూస్తే సిగ్గుగా ఉంది' అంటూ సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించాడు. ఈనేపథ్యంలో కమ్రాన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నాడు. 'నా కామెంట్స్‌పై విచారం వ్యక్తం చేస్తూ హర్భజన్‌తో పాటు సిక్కు సమాజానికి క్షమాపణలు చెబుతున్నాను. నేనలా మాట్లాడాల్సిందికాదు' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.

బోణీ కొట్టిన పాక్

- రిజ్వాన్ అర్ధ శతకం
- 7 వికెట్లతో కెనడా చిత్తు
- జాన్సన్ పోరాటం వృథా



న్యూయార్క్: గత రెండు మ్యాచ్‌ల్లో ఓటములతో డీలాపడ్డ పాకిస్థాన్.. టీ20 వరల్డ్‌కప్‌లో ఎట్టకేలకు బోణీ చేసింది. గ్రూప్-ఎలో మంగళవారం పసికూన కెనడాతో జరిగిన మ్యాచ్‌లో పాక్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. కెనడా నిర్దేశించిన 107 పరుగుల లక్ష్యాన్ని పాక్ 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రిజ్వాన్ (53 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్), కెప్టెన్ బాబర్ ఆజమ్ (33) రెండో వికెట్‌కు 62 బంతుల్లో 63 పరుగుల భాగస్వామ్యంతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్ ఛేదనలో ఓపెనర్లు రిజ్వాన్, సైమ్ అయుబ్ (6) ఆరంభం నుంచి ఆచితూచి ఆడడంతో పవర్‌ప్లే పేలవంగా సాగింది. ఐదో ఓవర్‌లో అయుబ్‌ను డిలాన్ క్యాచవుట్ చేసి దెబ్బ కొట్టాడు. కాగా, ఆరో ఓవర్‌లో రిజ్వాన్ తొలి బౌండ్రీ సాధించడంతో.. పవర్‌ప్లేలో పాక్ 28/1 స్కోరు చేసింది. ఎక్కువగా స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించిన బాబర్.. 10వ ఓవర్‌లో జునైద్ బౌలింగ్‌లో సిక్స్‌తో మ్యాచ్‌లో ఊపుతెచ్చే ప్రయత్నం చేశాడు. అయితే, విజయానికి 32 బంతుల్లో 24 పరుగులు కావాల్సి ఉండగా.. బాబర్‌ను డిలాన్ పెవిలియన్ చేర్చాడు. ఫఖర్ జమాన్ (4)ను గోర్డన్ వెనక్కి పంపాడు. కానీ, తుదికంటా క్రీజులో నిలిచిన రిజ్వాన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. పాక్ మరో 15 బంతులు మిగిలుండగానే నెగ్గింది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 106/7 స్కోరు చేసింది. ఓపెనర్ ఆరన్ జాన్సన్ (44 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52) అర్ధ శతకంతో పోరాడినా.. మిగతా వారి నుంచి అతడికి కనీస సహకారం కరువైంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఆమెర్, రౌఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో విజయంతో సూపర్-8 అవకాశాలను పాక్ సజీవంగా నిలబెట్టుకొంది.

సంక్షిప్త స్కోర్లు

కెనడా: 20 ఓవర్లలో 106/7 (జాన్సన్ 52; ఆమెర్ 2/13, రౌఫ్ 2/26).
పాకిస్థాన్: 17.3 ఓవర్లలో 107/3 (రిజ్వాన్ 53 నాటౌట్, బాబర్ 33; డిలాన్ 2/18).

కతార్ చేతిలో భారత్ ఓటమి

ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ నుంచి అవుట్

దోహా: ఫిఫా వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ నుంచి భారత ఫుట్‌బాల్ జట్టు నిష్క్రమించింది. మంగళవారం ఇక్కడ జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత్ 1-2 గోల్స్ తేడాతో కతార్ చేతిలో పరాజయం పాలైంది. తద్వారా తదుపరి రౌండ్ చేరడంలో విఫలమైన భారత్.. క్వాలిఫయర్స్ నుంచి నిరాశగా వెనుదిరిగింది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను లాలియాన్‌జువాల ఛాంగ్తే (37వ) కొట్టగా.. కతార్ జట్టులో యూసుఫ్ యెమన్ (73వ), అహ్మద్ అల్ రవి (85వ) చెరో గోల్ సాధించారు.

సాత్విక్ జోడీ చేజారిన నెం.1

న్యూఢిల్లీ: భారత డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్‌ను కోల్పోయింది. సింగపూర్, ఆస్ట్రేలియా ఓపెన్‌లలో నాకౌట్‌కు చేరలేకపోవడం ఈ జోడీ ర్యాంకింగ్‌ను దెబ్బతీసింది. బీడబ్ల్యూఎఫ్ మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సాత్విక్ ద్వయం మూడో స్థానానికి దిగజారింది. లియాంగ్-వాంగ్ (చైనా), ఆస్ట్రప్-అండర్స్ (డెన్మార్క్) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. సింగిల్స్‌లో ప్రణయ్ (10), లక్ష్యసేన్ (14) తమ ర్యాంకుల్ని నిలబెట్టుకున్నారు. ఇక కిడాంబి శ్రీకాంత్ 4 స్థానాలు దిగజారి 32వ ర్యాంక్‌కు చేరగా, ప్రియాన్షు రజావత్ 34, కిరణ్ జార్జ్ 35వ స్థానంలో ఉన్నారు. సింధు 10వ ర్యాంక్‌లోనే ఉంది. డబుల్స్‌లో తనీషా-అశ్విని ఒక స్థానం మెరుగై 19వ ర్యాంక్, గాయత్రి-ట్రీసా జాలీ ద్వయం ఒక స్థానం ఎగబాకి 24వ స్థానానికి చేరింది.

బాధ్యతలు స్వీకరించిన క్రీడామంత్రి మన్సుఖ్



న్యూఢిల్లీ: కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా మన్సుఖ్ మాండవ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 52 ఏళ్ల మాండవ్య గుజరాత్‌లోని పోర్‌బందర్ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆయన గత ప్రభుత్వంలో ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా క్రీడా శాఖ సహాయ మంత్రిగా రక్షా ఖడ్సే కూడా బాధ్యతలు చేపట్టారు.

బిజినెస్

హైదరాబాద్‌లో ఓపెన్‌టెక్స్ కొత్త సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సమాచార సాంకేతిక పరిజ్ఞానంలోని ఓపెన్‌టెక్స్ మంగళవారం హైదరాబాద్‌లో కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఫినిక్స్ టెక్ జోన్‌లో నాలుగు అంతస్తుల్లో దీన్ని ఏర్పాటు చేశారు. తమ ఇంజనీరింగ్ కార్యకలాపాలకు ఇది హబ్‌గా ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ కేంద్రంలోని ఇంజనీర్లు అనేక ఓపెన్‌టెక్స్ బిజినెస్ క్లౌడ్స్‌కు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్లోబల్ ఏఐ ఇన్నోవేషన్స్‌లో ఈ సెంటర్ కీలక పాత్ర పోషించనుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ ముహి మజీద్ అన్నారు. ఓపెన్‌టెక్స్ ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల్లో సెంటర్లను నిర్వహిస్తోంది.

పెరగనున్న నియామకాల జోరు

మ్యాన్‌పవర్ గ్రూప్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో దేశంలో నికర నియామకాల జోరు పెరగనుంది. జూన్ త్రైమాసికంతో పోలిస్తే ఇది 30 శాతం ఎక్కువగా ఉంటుందని సిబ్బంది నియామకాల కన్సల్టెన్సీ సంస్థ మ్యాన్‌పవర్ గ్రూప్ అంచనా వేసింది. నికర నియామకాల వృద్ధి రేటు పరంగా చూస్తే ఈ త్రైమాసికంలో భారత్ ప్రపంచంలో ఆరో స్థానంలో ఉందని తన 'ఇండియాస్ నెట్ ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్' నివేదికలో తెలిపింది. అయితే గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే నికర నియామకాలు ఈ ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో ఆరు శాతం తగ్గుతాయని తెలిపింది.

ఏపీ, తెలంగాణల్లో హ్యుండయ్ డిజిటల్ ఫ్లోట్ కార్యక్రమం



హైదరాబాద్: కొరియా కార్ల తయారీ దిగ్గజం హ్యుండయ్ మోటార్ ఇండియా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిజిటల్ ఫ్లోట్ కార్యక్రమం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల కస్టమర్ల ముంగిటిలోనే తమ ఉత్పత్తుల అనుభూతిని కలిగించడం ఈ కార్యక్రమం లక్ష్యం. 4 డిజిటల్ ఫ్లోట్లను ప్రవేశపెట్టడం ద్వారా రెండు రాష్ట్రాల్లోని 75కి పైగా గ్రామీణ ప్రాంతాలను కవర్ చేయాలని కంపెనీ భావిస్తోంది. ఇందులో భాగంగా గ్రాండ్ ఐ10 నియోస్, ఎక్స్‌టర్, వెన్యూలను నేరుగా వినియోగదారుల ముంగిటికే తరలించి వాటి అనుభూతి కస్టమర్‌కు కలిగేలా చేస్తారు. కంపెనీ ఆర్ఎస్‌హెచ్ రామ్‌కుమార్, ఆర్‌పిఎస్‌హెచ్ స్వప్నిల్ చౌదరి, ఇతర అధికారులు ఇందుకు సంబంధించి డిజిటల్ వ్యాన్లను ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలకు 45 నిమిషాల్లో రుణం

10 సెకన్లలోనే రుణ దరఖాస్తుపై నిర్ణయం
ఎస్ఎంఈ డిజిటల్ లోన్స్ పేరుతో ప్రత్యేక పథకం

ఎస్‌బీఐ వెల్లడి


ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా

ముంబై: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీల (ఎంఎస్ఎంఈ) రుణ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్ణయించింది. వచ్చే ఐదేళ్లు బ్యాంకు రుణాల వృద్ధి, లాభాలకు ఈ సంస్థలే కీలకమని భావిస్తున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా అన్నారు. అంతేకాకుండా ఈ సంస్థల రుణ అవసరాలను వేగంగా మదింపు చేసి, రుణాలు మంజూరు చేసేందుకు 'ఎస్ఎంఈ డిజిటల్ బిజినెస్ లోన్స్' పేరుతో ప్రత్యేక పథకం ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా 10 సెకన్లలో ఎంఎస్ఎంఈల రుణ అర్హతను మదింపు చేసి, 45 నిమిషాల్లోనే రుణాలు మంజూరు చేయనున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది.

ఇవే ఆధారం: జీఎస్‌టీ రిటర్న్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఆదాయ పన్ను (ఐటీ) శాఖకు సమర్పించే ఐటీఆర్‌లలోని వివరాల ఆధారంగా ఎస్‌బీఐ ఈ పథకం కింద ఎంఎస్ఎంఈల రుణ అర్హతను మదింపు చేస్తుంది. దీంతో ఎంఎస్ఎంఈల రుణ మార్కెట్లో తమ స్థానం మరింత పటిష్ఠమవుతుందని భావిస్తోంది. ప్రస్తుతం దాదాపు అన్ని బ్యాంకులు ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న ఎంఎస్ఎంఈల రుణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. కొద్దిపాటి రిస్క్ ఉన్నా ఈ సంస్థలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు జంకడం లేదు. గత ఆర్థిక సంవత్సరం ఎస్‌బీఐ ఈ సంస్థలకు రూ.4.33 లక్షల లక్షల కోట్ల రుణాలు ఇచ్చింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 20 శాతం ఎక్కువ. ఈ ఆర్థిక సంవత్సరం ఈ రుణ పోర్టుఫోలియోను మరింత పెంచుకోవాలని ఎస్‌బీఐ భావిస్తోంది.

రూ.25,000 కోట్ల సమీకరణకు సన్నాహాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణ పత్రాల జారీ ద్వారా 300 కోట్ల డాలర్లు (సుమారు రూ.25,000 కోట్లు) సమీకరించాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. డాలర్లు లేదా ఇంకో విదేశీ కరెన్సీ రూపంలో ఈ రుణ పత్రాల నిధుల సమీకరించేందుకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదం తెలిపింది. మార్కెట్ పరిస్థితిని బట్టి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతల్లో ఈ నిధులు సమీకరిస్తారు. ఏ అవసరం కోసం ఈ రుణ పత్రాలు జారీ చేస్తోందీ ఎస్‌బీఐ వెల్లడించలేదు. ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) కూడా రూ.10,000 కోట్లు సమీకరించనుంది. ఇందులో రూ.6,000 కోట్లు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా, మిగతా రూ.4,000 కోట్లు రుణ పత్రాల జారీ ద్వారా సమీకరించనుంది.

బీపీసీఎల్ ప్రైవేటీకరణకు ఫుల్‌స్టాప్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రైవేటీకరణను మోదీ సర్కార్ ప్రస్తుతానికి పక్కన పెట్టింది. వరుసగా రెండోసారి కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన హర్‌దీప్ సింగ్ పురి ఈ విషయం వెల్లడించారు. అధిక ఆదాయం, మంచి లాభాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థలు వేటినీ ప్రైవేటీకరించే యోచన లేదన్నారు. ఎన్‌డీఏ 2.0 హయాంలో బీపీసీఎల్ ఈక్విటీలో ప్రభుత్వానికి ఉన్న 52.9 శాతం వాటాను అమ్మకానికి పెట్టిన విషయం తెలిసిందే. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుతో మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత వస్తుందనే భయంతోనే మోదీ సర్కార్ ఈ విషయంలో వెనక్కి తగ్గినట్టు భావిస్తున్నారు. కాగా కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని కేజీ-డీడబ్ల్యూఎన్-98/2 బ్లాక్ నుంచి త్వరలో రోజువారీ చమురు ఉత్పత్తి 45,000 బ్యారళ్లకు చేరుతుందని పురి చెప్పారు. ఈ ప్రాంతంలో త్వరలో గ్యాస్ ఉత్పత్తి కూడా ప్రారంభం కానుందన్నారు. దిగుమతుల భారం తగ్గించేందుకు, దేశీయంగా చమురు, గ్యాస్ ఉత్పత్తి పెంచేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. చెన్నైలో ఐఓసీ కొత్తగా నిర్మిస్తున్న రిఫైనరీకి చేరువలో బీపీసీఎల్ కూడా త్వరలో కొత్త రిఫైనరీ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు.

రాబోయే మూడేళ్లూ భారత్ దూకుడే : ప్రపంచ బ్యాంక్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా రాబోయే మూడు సంవత్సరాలూ భారత్ 6.7 శాతం నిలకడ వృద్ధితో ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. అయితే ప్రపంచ వృద్ధి 2024 సంవత్సరంలో 2.6 శాతంగా ఉండి 2025-26లో 2.7 శాతం అవుతుందని తాజా నివేదికలో పేర్కొంది. కొవిడ్-19కి ముందు దశాబ్ది కాలంలో నమోదైన 3.1 శాతం సగటు వృద్ధి కన్నా ఇది తక్కువే. కాగా ఈ ఏడాది ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో ప్రైవేట్ వినియోగంలో వృద్ధి పెరగనున్నట్టు పేర్కొంది.

పత్రాల కోసం క్లెయిమ్‌ను తిరస్కరించొద్దు..

- సాధారణ బీమా కంపెనీలకు

మాస్టర్ సర్క్యులర్ జారీ చేసిన ఐఆర్‌డీఏఐ



న్యూఢిల్లీ: సాధారణ బీమా కంపెనీలు పత్రాల కోసం బీమా క్లెయిమ్‌ను తిరస్కరించరాదని భారత బీమా అభివృద్ధి, నియంత్రణ ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) స్పష్టం చేసింది. సాధారణ బీమా సేవల సంస్కరణలో భాగంగా విడుదల చేసిన మాస్టర్ సర్క్యులర్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. "పత్రాల కోసం పాలసీదారులకు సంబంధించిన ఎటువంటి దావానూ తిరస్కరించడానికి వీల్లేదు. అవసరమైన పత్రాలను పాలసీ అండర్ రైటింగ్ సమయంలోనే కోరాలి. అలాగే, పాలసీదారు నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ సంబంధిత, అవసరమైన పత్రాలను మాత్రమే కోరాలి. అదీ, క్యాష్‌లెస్ వసతి అందుబాటులో లేకపోతేనే" అని సర్క్యులర్‌లో పేర్కొంది. మరిన్ని విషయాలు..

- పాలసీదారు ఏ సమయంలోనైనా బీమా కంపెనీకి సమాచారం అందించి పాలసీని రద్దు చేసుకోవచ్చు. బీమా కంపెనీ మాత్రం పాలసీదారు మోసానికి పాల్పడినట్లు నిరూపించాకే పాలసీని రద్దు చేసే వీలుంటుంది. పాలసీ రద్దు సందర్భంలో, పాలసీదారుకు ప్రీమియాన్ని దామాషా పద్ధతిలో రిఫండ్ చేయాల్సి ఉంటుంది.
- క్లెయిమ్ సెటిల్‌మెంట్స్‌కు సంబంధించి సర్వేయర్ నియామకం, వారి రిపోర్టుల సమర్పణ సహా మిగతా అంశాలకు సంబంధించి ఐఆర్‌డీఏఐ కఠిన కాలక్రమాన్ని నిర్దేశించింది. సకాలంలో సర్వేయర్ నుంచి నివేదికలు పొందడం బీమా సంస్థ విధి అని నియంత్రణ మండలి స్పష్టం చేసింది.
- వాహన బీమా విషయంలో పే యాజ్ యూ డ్రైవ్/ పే యాజ్ యూ గో ఆప్షన్లను కస్టమర్లకు మొదటి ఎంపికగా అందించాలి.
- గృహ యజమానులకు అగ్ని ప్రమాద బీమా పాలసీలో వరదలు, తుఫాను, భూకంపాలు, కొండచరియలు విరిగి పడటం, గుట్టలు కూలడం, తీవ్రవాద నష్టాలు వంటి యాడ్ ఆన్ కవరేజీలను ఎంపిక చేసుకునే ఆప్షన్ కూడా కల్పించాలి. అలాగే, అగ్ని ప్రమాదంతో పాటు అనుబంధ ప్రమాదాల సమగ్ర పాలసీ నుంచి ఏదో ఒక కవరేజీ నుంచి వైదొలిగే వెసులుబాటునూ కల్పించాలి.
- బీమా కంపెనీలు పాలసీదారుకు బీమా పథకానికి సంబంధించిన కీలక సమాచారాన్ని సరళంగా, స్పష్టంగా, సంక్షిప్తంగా వివరించే కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ (సీఐఎస్) అందించాల్సి ఉంటుంది.

మ్యాట్రిక్స్ ఫార్మాలో కోటక్ ఆల్టర్నేట్ రూ.1,445 కోట్ల పెట్టుబడి

ముంబై: నిమ్మగడ్డ ప్రసాద్ నేతృత్వంలోని మ్యాట్రిక్స్ ఫార్మా.. దేశీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలను ఆకర్షిస్తోంది. కోటక్ మహీంద్రా గ్రూప్‌లోని ఆల్టర్‌నేటివ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ సంస్థ కోటక్ ఆల్టర్నేట్ అసెట్ మేనేజర్స్ లిమిటెడ్ (కేఏఏఎంఎల్) మ్యాట్రిక్స్ ఫార్మాలో రూ.1,445 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈక్విటీ, రుణాల రూపంలో ఈ పెట్టుబడి పెట్టినట్టు కేఏఏఎంఎల్ తెలిపింది. మ్యాట్రిక్స్ ఫార్మా ఈ నిధులను అమెరికా కేంద్రంగా పనిచేసే వయాట్రిస్ కంపెనీకి చెందిన యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) వ్యాపార కొనుగోలుకు వినియోగిస్తుంది. ఈ కొనుగోలుతో యాంటీరిట్రోవైరల్ (ఏఆర్‌వీ) ఏపీఐల వ్యాపారంలో మ్యాట్రిక్స్ ఫార్మా దేశంలో రెండో అతిపెద్ద కంపెనీగా ఎదగనుంది.

కేఏఏఎంఎల్ ఈ నిధులను కోటక్ స్ట్రాటజిక్ సిట్యుయేషన్స్ ఫండ్-2 ద్వారా సమకూర్చింది. మైలాన్ ఎన్‌వీ- ఫైజర్ కంపెనీకి చెందిన అప్‌జాన్ యూనిట్ల విలీనంతో 2020లో వయాట్రిస్ ఇంక్ కంపెనీ ఏర్పాటైంది. కీలకేతర వ్యాపారాల నుంచి తప్పుకోవాలన్న నిర్ణయంలో భాగంగా వయాట్రిస్ గత ఏడాది అక్టోబరులో భారత్‌లోని తన ఏపీఐ, ఉమెన్స్ హెల్త్‌కేర్ వ్యాపారాలను 120 కోట్ల డాలర్లకు విక్రయించింది. ఇందులో ఏపీఐ వ్యాపారాన్ని నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన మ్యాట్రిక్స్ ల్యాబ్స్ అనుబంధ సంస్థ ఐక్వెస్ట్ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఉమెన్స్ హెల్త్‌కేర్ బిజినెస్‌ను స్పెయిన్‌కు చెందిన ఇన్సుడ్ ఫార్మా చేజిక్కించుకుంది.

ఆద్యంతం ఒడుదుడుకులే..

స్వల్ప నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ ఒక దశలో 370 పాయింట్ల వరకు ఎగిసింది. కానీ, చివరివరకు లాభాలను నిలబెట్టుకోలేకపోయింది. ఆఖరి గంటలో ఇన్వెస్టర్లు పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడటంతో సెన్సెక్స్ 33.49 పాయింట్ల నష్టంతో 76,456.59 వద్దకు జారుకుంది. నిఫ్టీ మాత్రం 5.65 పాయింట్ల లాభంతో 23,264.85 వద్ద స్థిరపడింది.

ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓకు సెబీ ఓకే

విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు సెబీ ఆమోదం తెలిపింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా కంపెనీ రూ.5,500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన రూ.1,750 కోట్ల విలువైన 9.519 కోట్ల షేర్లను విక్రయించే అవకాశం ఉంది. అంటే, ఐపీఓ ద్వారా సంస్థ మొత్తం రూ.7,250 కోట్ల వరకు సమీకరించనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,840 ▲	65,850 ▲	95,000 ▼
ముంబై	71,445 ▲	65,444 ▲	87,708 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	530
వరంగల్	527	గోదావరి	525
చిత్తూరు	593	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	136
వరంగల్	130	గుంటూరు	138
కరీంనగర్	130	ఒంగోలు	138
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	150
కర్నూలు	130	నెల్లూరు	150
విశాఖపట్నం	130	అనంతపురం	136
గోదావరి	136		

రుతుపవనాల విస్తరణలో జాప్యం

- అల్పపీడనం ఏర్పడితేనే పురోగమనం
- కోస్తాలో మళ్లీ ఎండ తీవ్రత, ఉక్కపోత

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దేశ పశ్చిమ తీరంలో చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాలు తూర్పుతీరంలో స్తబ్దుగా మారాయి. నాలుగైదు రోజుల క్రితమే విజయనగరం వరకూ విస్తరించిన రుతుపవనాలు ఆ తరువాత ముందుకు కదలలేదు. కాగా, మంగళవారం అరేబియా సముద్రంలోని అనేక ప్రాంతాలు, మహారాష్ట్ర, గుజరాత్ వరకు రుతుపవనాలు విస్తరించాయి. తూర్పుతీరం వరకు విస్తరణకు సరిపడా బలమైన కరెంట్ అరేబియా సముద్రంలో లేదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రుతుపవనాలు ఈనెల తొలి వారంలోనే ఏపీలో ప్రవేశించడం, ఎండ తీవ్రత, బంగాళాఖాతం నుంచి తేమగాలులు రావడంతో జూన్ నెలలో ఇంతవరకూ మిగులు వర్షాలు కురిశాయి. ఏపీలో ఈనెల ఒకటో తేదీ నుంచి మంగళవారం వరకు 30.4 మిల్లీమీటర్లకు 80.4 మి.మీ.(సాధారణం కంటే 165 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో రుతుపవన కరెంట్ మోస్తరుగా ఉన్నా అల్పపీడనం ఏదీ లేకపోవడం రుతుపవనాల విస్తరణకు కొంత వరకు అడ్డంకిగా మారిందని నిపుణులు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలో గడచిన మూడు రోజుల నుంచి వర్షాలు తగ్గి ఎండ తీవ్రత పెరగడంతోపాటు ఉక్కపోత వాతావరణం నెలకొంది. కాగా, రుతుపవనాలు దేశం తూర్పు ప్రాంతం వైపు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడాల్సి ఉందని నిపుణులు అంటున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే రుతుపవనాలు పురోగమిస్తాయన్నారు.

చెట్టు కొమ్మ విరిగిపడి వృద్ధుడి మృతి..

కోస్తా, రాయలసీమల్లో మంగళవారం అక్కడక్కడ వర్షాలు కురిశాయి. ఈదురు గాలులకు అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలో చెట్టు కొమ్మ విరిగిపడి గ్రామానికి చెందిన రామలింగ(60) మృతిచెందారు. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, 13వ తేదీన కోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

చిక్కీల ప్యాకెట్ మారింది

- వైసీపీ రంగులు... జగన్ ఫొటో మాయం



అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే చిక్కీల కవర్ల రంగు మారింది. ఇప్పటివరకూ వైసీపీ రంగులతో చిక్కీలను పంపిణీ చేయగా ప్రభుత్వం మారిన దృష్ట్యా ఏ పార్టీకి సంబంధం లేని రంగులతో చిక్కీలను మధ్యాహ్న భోజన విభాగం తయారుచేస్తోంది. ఇవి ఇప్పటికే బడులకు చేరాయి. గురువారం నుంచి పాఠశాలలు తెరుచుకుంటున్న నేపథ్యంలో అధికారులు చిక్కీలను సరఫరా చేస్తున్నారు. కాగా ఇప్పటివరకూ వైసీపీ రంగులతో పాటు జగన్ బొమ్మను కూడా ముద్రించి చిక్కీలు పంపిణీ చేశారు. ఈ చిక్కీలు ఇస్తోంది జగన్ అని చిన్న పిల్లలకు కూడా తెలియాలని గత ప్రభుత్వం ఆరాటపడింది. చివరికి రాగిజావ ఇచ్చే స్టీలు గ్లాసులపైనా జగన్ పేరు వేసింది. ఎన్నికలకు ముందు కోడ్ అమల్లోకి వచ్చినప్పుడు ఈ చిక్కీలతో టీచర్లు నానా పాట్లు పడ్డారు. జగన్ బొమ్మ ఉండటంతో కవర్లు తొలగించి చిక్కీలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. వందల సంఖ్యలో కవర్లు తొలగించలేక టీచర్లు ఇబ్బంది పడ్డారు. కవర్లు తొలగించకుండా చిక్కీలు పంపిణీ చేశారనే కారణంతో కొందరు టీచర్లపై చర్యలు కూడా తీసుకున్నారు.

భారత ఆర్మీ కొత్త చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ, జూన్ 11: భారత ఆర్మీకి కొత్త చీఫ్ రానున్నారు. ప్రస్తుత సైన్యాధ్యక్షుడు లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ పాండే ఈ నెల 30న రిటైర్ కానున్న నేపథ్యంలో.. ఆయన స్థానంలో తదుపరి చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిని నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ప్రకటన చేసింది. ఉపేంద్ర ద్వివేది ప్రస్తుతం ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్నారు. వాస్తవానికి మనోజ్ పాండే మే 31వ తేదీనే రిటైర్ కావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని నెల రోజులపాటు పొడిగించింది. దీంతో ఉపేంద్ర ద్వివేదికి సైన్యాధ్యక్షుడిగా అవకాశం ఇచ్చే యోచన లేనందునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్న ప్రచారం జరిగింది. కానీ, ఆయనకే అవకాశం కల్పిస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ తాజాగా నిర్ణయం తీసుకుంది.

24 నుంచి పార్లమెంట్ సమావేశాలు?

న్యూఢిల్లీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనికోసం ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఈ నెల 24 నుంచి జూలై 3వ తేదీ వరకు ప్రత్యేక సమావేశాలు జరుగుతాయని తెలిసింది. ఈ నెల 24, 25 తేదీల్లో ఎంపీల ప్రమాణస్వీకారం, 26న స్పీకర్ ఎన్నిక కార్యక్రమం ఉండే అవకాశం ఉందని సంబంధిత వర్గాల సమాచారం. అయితే ఈసారి స్పీకర్ పదవి ఎవరికి దక్కొచ్చనే చర్చ జోరుగా సాగుతోంది. బీజేపీకి చెందిన వారికే ఆ పదవి ఇస్తారా? లేక ఎన్డీయేలోని మరెవరికైనా అవకాశం కల్పిస్తారా? అనే చర్చ జరుగుతోంది.

రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ

న్యూఢిల్లీ, జూన్ 11: రాజ్యసభలో కొత్తగా పది ఖాళీలు ఏర్పడ్డాయి. ఇటీవలి ఎలక్షన్‌లో పది మంది ఎగువసభ సభ్యులు లోక్‌సభకు ఎన్నిక కావడమే ఇందుకు కారణం. అస్సాం, బీహార్, మహారాష్ట్రల్లో రెండేసి ఖాళీలు, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఏర్పడ్డాయని రాజ్యసభ సెక్రటేరియట్ ప్రకటించింది. లోక్‌సభకు ఎన్నికయిన ప్రముఖుల్లో సర్బానంద్ సోనోవాల్ (అస్సాం), మీసా భారతి (బిహార్), దీపేందర్ సింగ్ హుడా (హరియాణా), జ్యోతిరాదిత్య సింధియా (మధ్యప్రదేశ్), పీయూష్ గోయల్ (మహారాష్ట్ర), కె.సి.వేణుగోపాల్ (రాజస్థాన్), బిప్లబ్ కుమార్ దేవ్ (త్రిపుర) ఉన్నారు.

'మోదీ కా పరివార్' లక్ష్యం నెరవేరింది : మోదీ

న్యూఢిల్లీ, జూన్ 11: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తానిచ్చిన 'మోదీ కా పరివార్' నినాదం లక్ష్యం నెరవేరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తానిచ్చిన పిలుపు మేరకు సోషల్ మీడియా ఖాతా హ్యాండిల్స్ పేరు పక్కన 'మోదీ కా పరివార్' అనే మాటను చేర్చిన వారు ఇక దానిని తొలగించాలని కోరారు. మోదీకి ఓ కుటుంబమంటూ లేదని లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. ఇందుకు బదులుగా తనని అభిమానించే వారంతా తమ సోషల్ మీడియా హ్యాండిల్ పేరు పక్కన మోదీ కా పరివార్(మోదీ కుటుంబం) అనే మాటను చేర్చాలని మోదీ ఎన్నికల ముందు కోరారు.

క్యాబినెట్ కాదు..పరివార్ మండల్: రాహుల్

న్యూఢిల్లీ, రాయబరేలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రధానిగా కొలువుదీరిన నూతన మంత్రివర్గంలో పలువురు మంత్రులు రాజకీయ కుటుంబాలకు చెందినవారే ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్ర మంత్రివర్గాన్ని పరివార్ మండల్‌గా అభివర్ణిస్తూ ఆయన ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. తరతరాల పోరాటం, సేవ, త్యాగాల సంప్రదాయాన్ని బంధుప్రీతిగా అభివర్ణించేవారు తమ అధికారాన్ని మాత్రం 'సర్కారీ పరివార్'(ప్రభుత్వ కుటుంబానికి)కి పంచుతున్నారని విమర్శించారు. మాటలకు, చేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నరేంద్ర మోదీ అంటారని రాహుల్ ఎద్దేవా చేశారు. కాగా రాయబరేలిలో మంగళవారం నిర్వహించిన ఒక బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ... తన సోదరి ప్రియాంక వారాణసీ నుంచి పోటీ చేసి ఉంటే... మోదీ 2, 3 లక్షల ఓట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయేవారని అన్నారు. ఇదిలా ఉండగా, పార్లమెంటు ఎన్నికల్లో లడఖ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన మహ్మద్ హనీఫా కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. తాజా పరిణామంతో లోక్‌సభలో కాంగ్రెస్ బలం 102కు చేరుకోనుంది. కాంగ్రెస్ నుంచి 99 మంది ఎంపీలుగా ఎన్నికవగా సాంగ్లీ ఎంపీ విశాల్‌పాటిల్, పూర్నియా ఎంపీ పప్పూ యాదవ్ ఇప్పటికే కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు.

విమానం కూలి మలావీ ఉపాధ్యక్షుడి మృతి



బ్లాంటైర్, జూన్ 11 : ఆఫ్రికా దేశమైన మలావీలో జరిగిన విమాన ప్రమాదంలో ఆ దేశ ఉపాధ్యక్షుడు సౌలస్ చిలిమా సహా పది మంది మరణించారు. చిలిమా, మరో తొమ్మిది మంది ప్రయాణిస్తున్న ఓ సైనిక విమానం సోమవారం నుంచి కనిపించకుండా పోయింది. గల్లంతైన విమానం కోసం గాలించిన సిబ్బంది 24 గంటల తర్వాత దేశ ఉత్తర ప్రాంతంలోని కొండల్లో విమాన శకలాలను గుర్తించారు. చిలిమా ప్రయాణిస్తున్న విమానం ప్రతికూల వాతావరణం వల్ల కూలిపోయిందని, అందులో ఉన్న వారంతా మరణించారని మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా ప్రకటించారు.

పెద్దారెడ్డి అనుచరుల వాహనాలు సీజ్

తాడిపత్రి టౌన్, జూన్ 11: అనంతపురం జిల్లా తాడిపత్రిలో పర్మిట్లు, ఫిట్‌నెస్ లేకుండా తిప్పుతున్న వైసీపీ తాజా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రధాన అనుచరుల వాహనాలను రవాణా శాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. కేతిరెడ్డి ప్రధాన అనుచరుడు నరసింహారెడ్డికి చెందిన మూడు బస్సులు, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ పేరిట ఉన్న రెండు టిప్పర్లను సీజ్ చేశామని ఆర్టీఏ అధికారులు తెలిపారు. పర్మిట్లు లేకపోవడంతో బస్సులను, ఫిట్‌నెస్, పర్మిట్లు లేకపోవడంతో టిప్పర్లను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆర్టీఏ అధికారులు వీటి గురించి పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.

బెట్టింగ్‌లకు ఇద్దరు బలి

» వైసీపీ గెలుస్తుందని లక్షల్లో పందేలు

యడ్లపాడు, ప్రొద్దుటూరు, జూన్ 11: రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని లక్షల్లో బెట్టింగులు పెట్టి అప్పుల పాలైన కొందరు ఆత్మహత్యలు పాల్పడుతుంటే మరికొందరు ఊర్లు విడిచి పారిపోతున్నారు. తాజాగా గుంటూరు జిల్లాలో ఒకరు, వైఎస్సార్ కడప జిల్లాలో మరొకరు బెట్టింగ్‌ల దెబ్బకు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పల్నాడు జిల్లా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంకు చెందిన వజ్రాల సుబ్బారెడ్డి(43)కి సుమారు 18 ఏళ్ల క్రిందట తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన వరలక్ష్మితో వివాహమైంది. వైసీపీకి వీరాభిమాని అయిన సుబ్బారెడ్డి ఏడేళ్ల క్రితం ఆయన పెదపరిమికి వలస వెళ్లి అక్కడే వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని సుమారు రూ.30 లక్షలకు పైగా పందెం కాశాడు. వైసీపీ ఘోరంగా ఓడిపోవడంతో ఆ డబ్బులు పోయాయి. దీనితో కుటుంబంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆయన మంగళవారం యడ్లపాడు మండలం బోయపాలెం ఈద్గా సమీపంలోని కొండవీడు కొండల వద్ద విగత జీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, కుటుంబ సభ్యుల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు.

కడప వాసి ప్రకాశం బ్యారేజీలో దూకి..


సుబ్బారావు

వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీకి చెందిన సుబ్బారావు అనే వ్యాపారి ఎన్నికల బెట్టింగ్‌లో ఓడిపోయి అప్పులపాలయ్యాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఈ నెల 7న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. 8న కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు త్రీటౌన్ పోలీసు స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇదిలావుండగా మంగళవారం ఉదయం విజయవాడ కృష్ణా బ్యారేజీ దగ్గర నదిలో సుబ్బారావు శవమై తేలాడు. అతని జేబులో ప్రొద్దుటూరులోని అతని స్నేహితులు తాజా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి బావమరిది, మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి పేరుతో పాటు కానిస్టేబుల్ నాగ మరికొందరి ఫోన్ నంబర్లు ఉన్నాయి. వీరికి దయచేసి ఫోన్ చేయండి అని సుబ్బారావు రాసినట్లు ఒక పేపరు ఉంది.

నిజమైన సేవకుడు అహంకారంతో ఉండడు

నేనే చేశానని చెప్పుకోడు

» ప్రజా జీవితంలో మర్యాదలు పాటిస్తాడు
» రాజకీయాల్లో విపక్షాలే తప్ప విరోధి పక్షాలు ఉండవు: మోహన్ భాగవత్



నాగ్‌పూర్, జూన్ 11: కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తరుణంలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ చేసిన పలు హితవచనాలు రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రజాసేవలో నాయకులు వ్యవహరించాల్సిన తీరును, ఎన్నికల ప్రచారంలో పాటించాల్సిన హుందాతనాన్ని ఆయన గుర్తుచేశారు. అల్లర్లతో అతలాకుతలమవుతున్న మణిపూర్ సమస్యను తొలుత పరిష్కరించాలని ప్రభుత్వానికి దిశానిర్దేశం చేశారు. అహంకార రహితంగా ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఉద్బోధించారు. నిజమైన సేవకునికి అహంకారం ఉండదని, ప్రజాజీవితంలో గౌరవ మర్యాదలు పాటిస్తాడని అన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో సోమవారం ఆరెస్సెస్ ట్రైనీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇటీవలి ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మర్యాదలు పాటించలేదని చెబుతూ నిజమైన సేవకుని లక్షణాలను వివరించారు. ఎన్నికలంటే పోటీయే తప్ప యుద్ధం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. రాజకీయాల్లో 'ప్రతి పక్షమే' తప్ప 'విరోధి పక్షం' ఉండదని, అందుకు అనుగుణంగానే పార్టీల వ్యవహార శైలి ఉండాలని చెప్పారు. "ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు అత్యవసరం. రాజకీయ పార్టీల మధ్య పోటీ కూడా ఉంటుంది. పోటీ అంటే ఒకరు ముందుకు వెళ్లడం, మరొకర్ని వెనక్కి లాగడం. ఇదే చేయొద్దు. ప్రజలు ప్రతినిధులను ఎందుకు ఎన్నుకుంటారు? పార్లమెంటులో కూర్చొని ఏకాభిప్రాయం సాధించి దేశాన్ని నడిపిస్తారని..ఏకాభిప్రాయ సాధనే మన సంప్రదాయం. పార్లమెంటుకు వచ్చిన రెండు పక్షాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం కొంత కష్టమే. అందుకే మెజార్టీని పరిగణనలోకి తీసుకుంటారు. పార్టీల మధ్య పోటీ ఉంటుందే తప్ప పరస్పర యుద్ధం కాద"ని అన్నారు. అందువల్ల ఇరు పక్షాల అభిప్రాయాలను తెలుసుకున్న తరువాత చర్చలు జరిపి అంగీకారానికి రావాల్సి ఉంటుందని చెప్పారు. ఇటీవలి ఎన్నికల ప్రచారంలో అదుపుతప్పి విమర్శలు చేసుకున్న వైనాన్ని మోహన్ భాగవత్ ప్రస్తావించారు. దీంట్లోకి ఆరెస్సెస్‌ను కూడా లాగారని విచారం వ్యక్తం చేశారు. "ఒకరిని మరొకరు విమర్శించుకున్న తీరు..ప్రచారంలో వ్యవహరించిన విధానం..సమాజంలో విభేదాలను పెంచుతాయి. సమాజాన్ని రెండు వర్గాలుగా చీల్చుతాయి. పరస్పరం అవిశ్వాసాన్ని కలిగిస్తాయి. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంట్లోకి సంఘ్‌ను కూడా లాగారు. సాంకేతికతను దుర్వినియోగం చేసి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశారు. మొత్తం అబద్ధాలనే చెప్పారు. గౌరవనీయ వ్యక్తులెవరూ ఇలాంటి సాంకేతికను ఉపయోగించరు. ఎన్నికల్లో గౌరవ మర్యాదలు పాటించాలి. దేశ సమస్యలు ఇంకా తీరలేదు కాబట్టి మర్యాదలతో మెగలడం తప్పనిసరి" అని అన్నారు. ఎన్నికల వాతావరణం నుంచి బయటపడి దేశ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని భాగవత్ హితవు చెప్పారు. అత్యంత ప్రాధాన్యమున్న అంశంగా మణిపూర్ అల్లర్లను గుర్తించాలని సూచించారు. "ఏడాది కాలంగా మణిపూర్ శాంతి కోసం ఎదురు చూస్తోంది. గత పదేళ్లుగా ఆ రాష్ట్రంలో శాంతి నెలకొంది. కానీ ఆకస్మికంగా తుపాకీ సంస్కృతి మళ్లీ పెరిగింది. అది ఇంకా మంటల్లో కాలుతునే ఉంది. ఎవరు దీనిపై దృష్టి పెడుతారు? దీన్ని ప్రాధాన్యమైన సమస్యగా గుర్తించి చర్చించాలి. దీన్ని కర్తవ్యంగా భావించాలి" అని తెలిపారు. మోదీ ప్రభుత్వం చాలా రంగాల్లో విశేష ప్రగతి సాధించిందని ప్రశంసిస్తూనే దేశం ఇంకా సవాళ్ల నుంచి విముక్తి పొందలేదని వ్యాఖ్యానించారు.

సలహాలను మోదీ పాటించాలి: విపక్షాలు

భాగవత్ ప్రసంగంపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు స్పందించాయి. ఆయన సలహాలను పాటించాలని ప్రధాని మోదీకి సూచించాయి. ఇప్పటికైనా మణిపూర్ వెళ్లి పరిస్థితులను చక్కదిద్దాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ప్రధానిని ఉద్దేశించి అన్నారు. అసలు సలహాలు వినడం మోదీ డీఎన్ఏలోనే లేదని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల మాటలు వినకపోయినా, కనీసం ఆరెస్సెస్ చీఫ్ సూచనలైనా పట్టించుకోవాలని అన్నారు. ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్ మాట్లాడుతూ 'విస్పష్టంగా కనిపిస్తున్న అహంకారం గురించి భాగవత్ అనుభవపూర్వకంగా చెప్పినట్టుంద'ని వ్యాఖ్యానించారు. ఇంతజరుగుతున్నా మణిపూర్‌పై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని ఎన్సీపీ (పవార్) నాయకురాలు సుప్రియా సూలే విమర్శించారు.

అతివిశ్వాసమే బీజేపీని ముంచింది!

'ఆర్గనైజర్'లో సంఘ్ నేత రతన్ శారద ధ్వజం



న్యూఢిల్లీ, జూన్ 11: మూడోసారీ భారీ మెజారిటీతో గెలిచి తీరతామన్న అతి విశ్వాసమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీసిందా? ఎన్నికల్లో సహకరించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నేతలను, కార్యకర్తలను ఆ పార్టీ నాయకత్వం ఆహ్వానించలేదా..? సంఘ్ పరివార్‌తో దాని సంబంధాలు సజావుగా లేవా.. ఈ ప్రశ్నలకు.. సంఘ్ పత్రిక 'ఆర్గనైజర్'లో వచ్చిన ఓ వ్యాసం కాదనే జవాబిస్తోంది. సంఘ్ జీవిత కాల కార్యకర్త రతన్ శారద రాసిన ఈ వ్యాసంలో చాలా కటువుగా తన అభిప్రాయాలను తెలియజేశారు. అతివిశ్వాసానికి అసలు వాస్తవం ఎన్నికల ఫలితాల ద్వారా చెక్ పెట్టిందన్నారు. నేతలు క్షేత్ర స్థాయికి వెళ్లకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడానికే పరిమితమయ్యారని ఆక్షేపించారు. ఊహాలోకంలో విహరిస్తూ క్షేత్ర స్థాయి వాణిని వినిపించుకోలేదన్నారు. 'తామే అసలైన రాజకీయ నేతలమని.. సంఘ్ సోదరులు పల్లెటూరి బైతులన్న అహంకారం బీజేపీ నేతల తలకెక్కింది' అని విమర్శించారు. గత ఎన్నికల్లో 303 ఎంపీ స్థానాలు సొంతగా సాధించిన బీజేపీ.. ఈ దఫా 240 స్థానాలకే పరిమితమై.. సాధారణ మెజారిటీ (272)కి 32 స్థానాల దూరంలో నిలిచింది. దీంతో, 'ఈసారి 400 సీట్లు దాటాలి' అని ప్రధాని మోదీ పెట్టిన లక్ష్యం బీజేపీకేనన్న విషయం ఆ పార్టీ నేతలు గ్రహించలేదంటూ రతన్ మండిపడ్డారు. 'మోదీ ప్రజాకర్షక శక్తి చూసి ఆనందించారు. క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలారు. అంకితభావం కలిగిన వృద్ధ కార్యకర్తలను.. ప్రస్తుత సోషల్ మీడియా 'సెల్ఫీ' కార్యకర్తలు అలక్ష్యం చేశారు. బీజేపీ ఎంపీలు, మంత్రులు జనాలకు అందుబాటులో లేరు' అని విమర్శించారు. బీజేపీ నేతలకు సంఘ్ అవసరం లేదా అని ప్రశ్నించారు. మోదీ మేజిక్‌కు కూడా పరిమితులున్నాయని స్పష్టం చేశారు. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాల్లో ప్రధాని మోదీయే పోరాడుతున్నారన్న ఆలోచననే ఆయన గట్టిగా ఆక్షేపించారు. స్వీయ ఓటమికి కారణమైన ఈ ఆలోచనతోనే అభ్యర్థులను మార్చారని.. స్థానిక నేతలను పక్కపెట్టి బలవంతంగా అభ్యర్థులను రుద్దారని.. ఫిరాయింపుదారులకు ప్రాధాన్యమిచ్చారని.. బాగా పనిచేస్తున్న పార్లమెంటేరియన్లను కాదని చివరి నిమిషంలో పార్టీలో చేరిన వారికి టికెట్లు ఇచ్చారని.. పరాజయానికి ఇవన్నీ కారణాలని రతన్ విశ్లేషించారు. 'బీజేపీ అభ్యర్థుల్లో 25 శాతం మంది వలసవచ్చినవారేనని అంచనా. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి 30 శాతం మంది రెబెల్స్ కారణమన్న షాకింగ్ అనుభవం చూశాక కూడా లోక్‌సభ ఎన్నికల్లో అదే పనిచేశారు. స్థానిక సమస్యలు, అభ్యర్థుల ట్రాక్‌రికార్డు ఎన్నికల్లో విజయానికి గీటురాళ్లు. స్థానిక బీజేపీ కార్యకర్తల నిరాసక్తత కూడా ఓటమికి కారణం' అని తెలిపారు.

అజిత్ పవార్‌ను చేర్చుకోవడం ఎందుకు?

మహారాష్ట్రలో అనవసర రాజకీయం కొంపముంచిందని రతన్ శారద అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పనితీరు దెబ్బతినడానికి ఇది కూడా కారణమన్నారు. 'మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ, షిండే శివసేనకు చాలినంత మెజారిటీ ఉన్నప్పటికీ అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీని చేర్చుకున్నారు. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలె, అజిత్ పవార్ మధ్య అంతర్గత విభేదాలతో ఎన్సీపీ 2-3 ఏళ్లలో అంతరించి పోయేది. ఇలాంటి అక్కరమాలిన చర్య ఎలా చేపట్టారు? ఏళ్ల తరబడి కాంగ్రెస్ సిద్ధాంతాలపై బీజేపీ కార్యకర్తలు పోరాడారు. ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ ఒక్క దెబ్బతో బీజేపీ తన బ్రాండ్ విలువను తగ్గించుకుంది. మహారాష్ట్రలో నంబర్ వన్ పార్టీగా ఎదిగేందుకు ఏళ్లతరబడి పోరాడింది. ఇప్పుడు ఎలాంటి ప్రత్యేకతా లేని మామూలు రాజకీయ పార్టీగా మారిపోయింది' అని ఆవేదన వ్యక్తంచేశారు. 'కాషాయ ఉగ్రవాదం' అన్న పేరుతో హిందువులను వేధించి.. ముంబై 26/11 దాడులను ఆర్ఎస్ఎస్ కుట్రగా అభివర్ణించి.. ఆర్ఎస్ఎస్‌పై ఉగ్రవాద సంస్థగా ముద్ర వేసి.. బీజేపీని హీనంగా చూసిన కాంగ్రెస్ నేతలను బీజేపీలో చేర్చుకోవడాన్ని రతన్ తీవ్రంగా విమర్శించారు. ఇది ఆర్ఎస్ఎస్ సానుభూతిపరులను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా ఆర్ఎస్ఎస్ పనిచేసిందా అన్న అంశంపైనా ఆయన ఘాటుగా స్పందించారు. 'ఒక్క విషయం స్పష్టం చేయదలచుకున్నాను. ఆర్ఎస్ఎస్ శ్రేణులు బీజేపీకి క్షేత్రస్థాయి బలగం కాదు. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ. తనకంటూ సొంత కార్యకర్తలు ఉన్నారు' అని ఎద్దేవాచేశారు. "ఎన్నికల పనిలో సహకారం కోరడానికి తమ సైద్ధాంతిక మిత్రులను బీజేపీ కార్యకర్తలు, స్థానిక నేతలు కోరాలా.. వద్దా? నాకు తెలిసినంతవరకు వారు మా సాయం కోరలేదు" అని కటువుగా తన వ్యాసంలో పేర్కొన్నారు.

ఒడిసా సీఎంగా మోహన్ చరణ్ మాఝీ

» గిరిజన నేతకు అవకాశం కల్పించిన బీజేపీ
» భువనేశ్వర్‌లో నేడు ప్రమాణ స్వీకారం



భువనేశ్వర్, జూన్ 11: తొలిసారి ఒడిసాలో అధికారం దక్కించుకున్న బీజేపీ.. గిరిజన నేతకు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించింది. కియోంజర్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మోహన్ చరణ్ మాఝీ (52)ని సీఎంగా ఎంపిక చేసింది. ప్రవతీ పరిడా, కేవీ సింగ్‌దేవ్‌లకు ఉప ముఖ్యమంత్రులు పదవులు దక్కనున్నాయి. మంగళవారం భువనేశ్వర్‌లో ఒడిసా బీజేపీ శాసనసభా పక్ష సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, భూపేంద్ర యాదవ్ పరిశీలకులుగా హాజరయ్యారు. అనంతరం మాఝీని శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాజ్‌నాథ్ ప్రకటించారు. ఇటీవలి ఎన్నికల్లో మోహన్ చరణ్ 11,577 ఓట్ల ఆధిక్యంతో విజనా మాఝీపై గెలుపొందారు. బుధవారం సాయంత్రం మాఝీ, పలువురు మంత్రులు ప్రమాణం చేయనున్నారు. ప్రభుత్వ ఏర్పాటు ఆహ్వాన తొలి పత్రికను ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలోని జగన్నాథస్వామికి సమర్పించి పూజలు చేయించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన పలువురు ఎమ్మెల్యేలకు అందించారు. ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేడీ అధినేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌ను ఆహ్వానించారు. కాగా, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ సీఎంలు సైతం దీనికి హాజరవనున్నారు. 147 సీట్లున్న ఒడిసాలో ఎన్నికల్లో బీజేపీ 78 గెలుచుకుని తొలిసారిగా అధికారం చేపట్టనుంది. మోహన్ చరణ్ పేరు ఒడిసా దాటి ఎవరికీ తెలియదు. ప్రజా సంబంధాలు, సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తించి పార్టీ సీఎం చేసింది.

అక్కడిలాగే సీనియర్ నేతలను కాదని..

గత ఏడాది చివర్లో ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో సీనియర్ నాయకులు, సీఎంలుగా పనిచేసిన శివరాజ్ చౌహాన్, రమణ్‌సింగ్, వసుంధరా రాజెలను పక్కనపెట్టి కొత్తవారికి అవకాశం ఇచ్చింది బీజేపీ. మధ్యప్రదేశ్‌లో బీసీ మోహన్‌యాదవ్‌ను, రాజస్థాన్‌లో బ్రాహ్మణ వర్గానికి చెందిన భజన్ లాల్ శర్మ, ఛత్తీస్‌లో గిరిజనుడైన విష్ణుదేవ్ సాయ్‌లను సీఎంలుగా చేసింది. ఒడిసాలోనూ ఇదే తరహాలో ఆశ్చర్యకర ఎంపిక ఉంటుందంటూ పలువురు బీజేపీ నేతలు పేర్కొంటూ వచ్చారు. ఇదిలా ఉండగా, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్‌లను అరుణాచల్ ప్రదేశ్ సీఎం ఎంపికకు పరిశీలకులుగా బీజేపీ నియమించింది. వీరు బుధవారం ఇటానగర్ వెళ్లనున్నారు. ప్రస్తుత సీఎం పెమా ఖండూనే మళ్లీ ఎన్నుకునే వీలుంది.

నీట్ పవిత్రత దెబ్బతింది!

మీ సమాధానం చెప్పండి.. కేంద్రం, ఎన్టీఏకు సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)కు ఉన్న పవిత్రత దెబ్బతిన్నదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) స్పందనలు తెలియజేయాలంది. నీట్ యూజీ-2024లో ప్రశ్నపత్రం లీకేజీ, అవకతవకలు జరిగినందున ఆ పరీక్షను రద్దుచేయాలని కోరుతూ 10 మంది నీట్ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్లపై మంగళవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అమనుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ జరిపింది. పరీక్షలో అవకతవకలు జరిగాయని, వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పరీక్షను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని కోరారు. స్పందించిన ధర్మాసనం.. "పరీక్ష పవిత్రత దెబ్బతిన్నది. ఇప్పుడు మాకు సమాధానాలు కావాలి" అని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై సమాధానాలు ఇవ్వాలంటూ కేంద్రం, ఎన్టీఏకు నోటీసులు జారీ చేసింది. అలాగే బిహార్‌లో పరీక్ష నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నోటీసులు ఇచ్చింది. తక్షణమే సమాధానాలు ఇవ్వాలని కేంద్రం, ఎన్టీఏను ఆదేశించింది. ఇక ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల కౌన్సెలింగ్ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. ఈ ఏడాది మే 5న నీట్ యూజీ పరీక్ష జరిగింది. జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం.. పలు అనుమానాలకు దారితీసింది. మరోవైపు, నీట్-పీజీ 2022 జవాబు పత్రాలను బహిర్గతపర్చాలన్న పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఫెయిల్.. నీట్‌లో 705 మార్కులు!

నీట్‌పై సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులు వైరల్‌గా మారుతున్నాయి. ఆర్యన్ ప్రతీక్ అనే 'ఎక్స్' వినియోగదారుడు ఓ విద్యార్థిని ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఫెయిలవగా.. నీట్‌లో మాత్రం 720కి 705 మార్కులు సాధించిందంటూ పోస్ట్ చేశారు. నీట్ మార్కుల స్క్రీన్‌షాట్, ఇంటర్ మార్కుల పత్రం ఫొటోలు కూడా జత చేశారు. ఇదెలా సాధ్యం? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఇక మరో విద్యార్థిని జూన్ 4న వచ్చిన ఫలితాల్లో తన రిజల్ట్ కనిపించకపోవడంతో సర్వర్ సమస్యగా భావించానని.. ఎన్టీఏ మాత్రం ఓఎంఆర్ షీట్ పాడైపోవడం వల్ల ఫలితాలు ప్రకటించలేదని మెయిల్ పంపినట్లు ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. పాడైన ఓఎంఆర్ షీట్‌ను తనకు పంపాలని కోరగా అందులో అన్ని సమాధానాలూ స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడించింది.

ఇక బ్లాక్ కమాండోలు కనిపించరు!

న్యూఢిల్లీ, జూలై 11: వీఐపీలకు వ్యక్తిగత భద్రతను కల్పిస్తున్న ఎన్ఎస్‌జీ బ్లాక్ కమాండోలు, ఐటీబీపీ బలగాలను ఆ బాధ్యతల నుంచి మోదీ సర్కారు తప్పించనుంది. వాటి స్థానంలో సీఆర్పీఎఫ్‌కు ఈ బాధ్యతలను కేటాయించనుంది. తీవ్రవాద, ఉగ్రవాద ముప్పును ఎక్కువగా ఎదుర్కొంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు, తదితర ముఖ్యనేతలను బ్లాక్ క్యాట్ కమాండోలు కంటిరెప్పలా ఇప్పటిదాకా కాపాడుతూ వస్తున్నారు. ఇకపై వారి సేవలను ఇతర పారామిలిటరీ విధులకు వినియోగించుకోనున్నట్టు రక్షణ వర్గాలు తెలిపాయి. ప్రముఖుల వ్యక్తిగత భద్రతను సీఆర్పీఎఫ్ వీఐపీ సెక్యూరిటీ యూనిట్, సీఐఎస్ఎఫ్ వీఐపీ వింగ్ (ఎస్ఎస్‌జీ) ఇక ముందు చూస్తాయి. ఈ విభాగాలు ఇప్పటికే సోనియా కుటుంబానికి, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబాల్ తదితర 200 మందికి భద్రత అందిస్తున్నాయి.

రూ.300 నగ 6 కోట్లకు!

అమెరికన్ మహిళను మోసం చేసిన జైపూర్ వ్యాపారి..పోలీసుల విచారణ

జైపూర్, జూన్ 11 : రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ నగల వ్యాపారి అమెరికన్ మహిళకు రూ.300 నకిలీ నగను ఏకంగా రూ.6 కోట్లకు అమ్మి మోసం చేశాడు. ఆ మహిళ జైపూర్‌లోని జోరి బజార్‌లో కొన్ని నెలల క్రితం ఆ నగను కొన్నారు. నగల దుకాణం యజమాని రాజేంద్ర సోని, అతడి కుమారుడు గౌరవ్ దాని నాణ్యతను నిర్ధారిస్తూ ఓ నకిలీ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. ఆమె ఆ నగను అమెరికా తీసుకువెళ్లి అక్కడ ఓ ఎగ్జిబిషన్‌లో ఉంచబోగా అది నకిలీదని వెల్లడైంది. దీంతో ఆ మహిళ తిరిగి భారత్ కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆ నగల షాపు యజమానే ఆమెపై తప్పుడు కేసు పెట్టాడు. చివరికి అమెరికన్ ఎంబసీ జోక్యంతో జైపూర్ పోలీసులు ఈ ఉదంతంపై విచారణ చేపట్టారు. నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ సర్టిఫికెట్ ఇచ్చిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు జైపూర్‌లో రూ.3 కోట్ల ఫ్లాట్ కొన్నట్లు గుర్తించారు.

ఏడాదికి 2సార్లు అడ్మిషన్లు!

» ఉన్నత విద్యాసంస్థల్లో ఈ ఏడాది నుంచే అమలు

న్యూఢిల్లీ, జూన్ 11: ఉన్నత విద్యా సంస్థల్లో ఏడాదికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకునేందుకు యూజీసీ అనుమతించింది. రెగ్యులర్ విధానంలో కోర్సులు సాగించే యూనివర్సిటీలు, కాలేజీలకు ఈ మేరకు అవకాశం కల్పించింది. జనవరి లేదా ఫిబ్రవరి, జూలై లేదా ఆగస్టు నెలల్లో విద్యార్థుల అడ్మిషన్లకు యూజీసీ విధాన నిర్ణాయక మండలి ద్వైవార్షిక విధానాన్ని ప్రతిపాదించినట్టు కమిషన్ చైర్‌పర్సన్ జగదీశ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నిర్ణయం 2024-25 విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి వస్తుందన్నారు. మే 5న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం యూనివర్సిటీలు, కాలేజీలు ఏటా జూలై-ఆగస్టు మధ్య రెగ్యులర్ విధానంలో విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తున్నాయి. అయితే.. ఈ విధానం వల్ల లక్షల మంది విద్యార్థులు ఒక ఏడాది పాటు ఆయా సంస్థలలో చేరేందుకు నిరీక్షించాల్సి వస్తోందని, దీంతో వారి అమూల్యమైన సమయం వృథా అవుతోందని జగదీశ్ కుమార్ తెలిపారు. గత ఏడాది ఆన్‌లైన్ పద్ధతిలో ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ విధానాలను ద్వైవార్షికంగా చేపట్టినట్టు చెప్పారు. ఇది లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించిందన్నారు.

మూల వేతనంలో 50% పింఛను!

న్యూఢిల్లీ, జూన్ 11: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం.. ఉద్యోగులకు భారీ ఆఫర్ ప్రకటించనుంది. జాతీయ పింఛను పథకం(ఎన్‌పీఎస్)లో భాగంగా ఉద్యోగుల చిట్ట చివరి మూల వేతనం(బేసిక్ పే)లో 50% పింఛనుగా ఖచ్చితంగా ఇవ్వాలని ప్రతిపాదించింది. ఎన్‌పీఎస్‌పై అభ్యంతరాలు, పలు రాష్ట్రాలు తిరిగి పాత పింఛను విధానం వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో 2023లో కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఎన్‌పీఎస్‌ను మరింత ప్రయోజనకరంగా మార్చేందుకు అనుసరించాల్సిన విధానాలపై ఈ కమిటీ అధ్యయనం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం.. ఉద్యోగులకు చిట్ట చివరి మూల వేతనంలో 50% మొత్తాన్ని పింఛనుగా ఇచ్చేందుకు ప్రతిపాదించింది. ఎన్‌పీఎస్‌లో మార్పులు చేయాలని కూడా సోమనాథన్ కమిటీ సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అయితే.. కమిటీ తన సిఫారసులను అమలు చేసేందుకు ఎలాంటి నిర్దిష్ట గడువు విధించలేదు.

లోకం తీరు

ఏపీకి అమరావతే రాజధాని: చంద్రబాబు





కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో లోకేశ్, నిమ్మల రామానాయుడు తదితరులు



ఎమ్మెల్యేల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు, వేదికపై పురందేశ్వరి, పవన్, అచ్చెన్న



కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో అనిత, పరిటాల సునీత తదితరులు

నేటి నుంచే ప్రజాపాలన

ప్రతి అడుగూ ప్రజల కోసమే.. కూల్చివేతలు, నరికివేతలు ఉండవు.. తెలుగు జాతిని నంబర్ వన్ చేద్దాం!

- 3 రాజధానుల ఆటలుండవ్
- అమరావతే రాష్ట్ర రాజధాని
- పవన్ కల్యాణ్ స్ఫూర్తి భేష్
- ప్రజాప్రయోజనాల కోసం బీజేపీతో కలిసి పనిచేశాం
- టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యలు

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): 'మూడు రాజధానులంటూ రాష్ట్ర భవిష్యత్‌తో ఆటలాడుకోవడం ఉండదు. అమరావతే మన రాజధాని, విశాఖను ఆర్థిక రాజధానిగా, ప్రత్యేకమైన సిటీగా తయారుచేసుకుందాం. కర్నూలును అభివృద్ధి చేస్తాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటించారు. మంగళవారం విజయవాడలో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు తనను కూటమి శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్న తర్వాత ఆయన వారినుద్దేశించి ప్రసంగించారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో బుధవారం నుంచే ప్రజా పరిపాలన సాగుతుందన్నారు. ప్రతి అడుగూ ప్రజల కోసమేనని స్పష్టం చేశారు. తాను చాలా ఎన్నికలు చూశానని.. ప్రజలు ఈ సారి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని తీర్పు ఇచ్చారని.. ఈ తీర్పును నిలబెట్టుకునే బాధ్యత మనపై ఉందని తెలిపారు. 'ఈ ఎన్నికల్లో ప్రజలు గెలిచారు, రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ఇక్కడుండే శాసనసభ్యులమైన మనందరిపై ఉందన్నారు. అరాచక పాలన, విధ్వంసకర పాలనకు వ్యతిరేకంగా ఈ మూడు పార్టీల కలయిక అద్భుతం. ఎన్నికల తర్వాత సాధారణంగా ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకునేవారు. ఈ సారి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేశారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రవర్తించారు' అని కొనియాడారు. ధన్యవాదాలు తెలిపారు. ఏ అహంకారంతో విర్రవీగిపోయారో ఆ అహంకారం కూలిపోయిందని వైసీపీ నేతలనుద్దేశించి అన్నారు. ఇంకా ఏమన్నారంటే..

> మనది ప్రజా ప్రభుత్వం. కూల్చివేతలుండవు. గతంలో సీఎం వస్తే చెట్లు కొట్టివేత, షాపుల బంద్ జరిగేవి. పరదాలు కట్టేవారు. నేను మామూలు మనిషిగానే వస్తా. అందరితో కలిసి ఉంటా. మేమందరం సామాన్య వ్యక్తులుగానే ప్రజల ముందుకు వస్తాం. హోదా అనేది సేవ కోసం తప్ప పెత్తనం కోసం కాదు. సీఎం వస్తే ప్రజలకు ఇబ్బంది కలగకూడదని ఆదేశాలిచ్చాను.
>
> నా కుటుంబానికి జరిగిన అవమానంతో.. శాసనసభను కౌరవ సభ చేశారని, ఈ సభను గౌరవ సభను చేసి అడుగుపెడతానని శపథం చేసి వచ్చాను. ఆ శపథాన్ని ప్రజలు గౌరవించారు. ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవలసిన అవసరముంది.
>
> గతంలో ఎన్నికలైన తర్వాత పలు దఫాలు సమీక్ష చేశాను. కానీ ఇలాంటి విజయం, సంతృప్తి ఎప్పుడూ లేవు. ఈ సారి కొన్ని చోట్ల 95 వేల మెజారిటీతో గెలిచారు.
>
> \- చంద్రబాబు

అరుదైన అనుభవం..

1994లో ఏకపక్షంగా ఎన్నికలు జరిగాయి. కానీ ఇప్పుడు 175 సీట్లలో 164 చోట్ల గెలిచి 93 శాతం సీట్లు సాధించాం. దేశ చరిత్రలోనే ఇది అరుదైన అనుభవం. 50 శాతం ఓట్లు అంటేనే ఎక్కువ.. అలాంటిది 57 శాతం వేశారంటే మనపై జనం ఎన్ని ఆశలు పెట్టుకున్నారో అర్థమవుతోంది. చరిత్రలో ఎప్పుడూ గెలవని విధంగా కడప జిల్లాలో 7 సీట్లలో ఐదు సీట్లు గెలిచాం. బీజేపీ పది సీట్లు తీసుకుంటే 8 గెలిచింది. జనసేన 21కి 21 సీట్లూ గెలిచింది. ఇదో చరిత్ర. మీ గెలుపుతో ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, గౌరవం పెరిగాయి. ఎంపిక చేసినప్పుడు ఏ సీటు ఏ పార్టీ, ఏ అభ్యర్థి తీసుకుంటే గెలుస్తారో ఆలోచించాం. సీట్ల ఎంపికలో ఈసారి పెద్దగా సమస్యలు రాలేదు. సీట్లు ఇచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ గౌరవించి గెలిపించారు. వేరే రాష్ట్రాలకు కూలి పనుల కోసం వెళ్లిన వారు సైతం వారి సొంత డబ్బులు పెట్టుకుని వచ్చి ఓటు వేశారు. ఇతర దేశాల్లో ఉండే ఎన్నారైలు లక్షలు ఖర్చు పెట్టుకుని వచ్చి మరీ ఓటేశారు.

వ్యతిరేక ఓటు చీలకూడదన్న పవన్..

పవన్ కల్యాణ్ స్ఫూర్తిని మరచిపోలేను. నేను జైలులో ఉన్నప్పుడు పరామర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని చెబుతూ వచ్చిన పవన్.. ఆ రోజు జైలు నుంచి బయటకు వచ్చి టీడీపీతో జనసేన పొత్తు ఉంటుందని మొట్టమొదటసారిగా చెప్పారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఇద్దరం బీజేపీతో పొత్తు పెట్టుకున్నాం. ఆ రోజు నుంచి ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా పనిచేశాం. ఎందుకు పొత్తు పెట్టుకున్నామో ధర్మవరం నియోజకవర్గ సభలో అమిత్‌షా స్పష్టత ఇవ్వడంతో రాష్ట్ర ప్రజలకు ఈ కూటమిపై నమ్మకం ఏర్పడింది. అనంతరం కూటమి తరపున ప్రధాని మోదీ రాజమండ్రిలో స్పష్టత ఇచ్చారు. విజయవాడ రోడ్‌షో బ్రహ్మాండంగా జరిగిందని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పనిచేయబట్టే ఇంత గెలుపు వచ్చింది. రాష్ట్రానికి కేంద్ర సహకారం అవసరం. కేంద్ర నాయకత్వాన్ని స్పష్టంగా కోరాను. పూర్తిగా సహకరిస్తామని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా హామీ ఇచ్చారు. ఈ రోజు రాష్ట్రంలో చాలా సమస్యలున్నాయి. నా అనుభవంతో మీ అందరి సహకారంతో పవన్ కల్యాణ్ సహకారంతో పేద ప్రజల జీవితాలను మార్చి కృతజ్ఞత చాటుకుందాం.

చట్టపరంగా శిక్షించాలి..

పదవి వస్తే వినయం అవసరం. రేపు అనేది లేకుండా వ్యవహరిస్తే ఇదే జరుగుతుంది. ఇదంతా ఒక కేసు స్టడీగా తీసుకోవాలి. ప్రజలు బూతులు మాట్లాడే నేతలను, అరాచక శక్తులను చూశారు. గత ఐదేళ్ల పరిపాలన చేసిన వ్యక్తిని చూసిన తర్వాత ఇలాంటి వ్యక్తి పాలనకు పనికిరాడని తీర్పు ఇచ్చారు. మనం కూడా కక్ష తీర్చుకోవాలనుకుంటే సమస్యలొస్తాయి. అలాగని తప్పుచేసిన వాడిని క్షమిస్తే కూడా అలవాటుగా మారుతుంది. తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాల్సిన అవసరముంది.

అప్పులు, తాకట్టుపై అధ్యయనం

రాష్ట్రం పూర్తిగా శిథిలమైపోయింది. ప్రభుత్వంలో ఏముందో తెలియదు.. ఎంత అప్పు ఉందో, ఎక్కడెక్కడ తెచ్చారో తెలియదు.. ఏదేది తాకట్టు పెట్టారో అధ్యయనం చేయాలి. ఇరిగేషన్ రంగాన్ని నిర్వీర్యం చేశారు. పోలవరం ముఖ్యమైన ప్రాజెక్టు. మనం ఉన్నప్పుడు కేంద్రం పూర్తిగా సహకారం అందించింది. దానిని పూర్తి చేసే కార్యక్రమం మన ముందు ఉంది. వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో పడింది. ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. పదేళ్ల తర్వాత మన రాజధాని ఏది అంటే చెప్పలేని దుస్థితిలో ఉన్నాం. కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలి. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికి భంగం కలగకూడదు. ప్రజా హితం కోసం పనిచేస్తాం. ప్రతి నిర్ణయం, ప్రతి అడుగు దీరా కోసమే. రాష్ట్రమే మొదట అనే నినాదంతో ముందుకెళ్తాం. ఏవైనా తప్పులు జరిగితే సలహాలు ఇచ్చే విధానాన్ని నెలకొల్పుతాం. రాష్ట్ర పునర్నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా సాగాలి. ప్రపంచ దేశాల్లో భారత్ నంబర్‌వన్‌గా తయారుకావాలి. 2047 నాటికి భారత్ మొదట స్థానంలో ఉంటుంది. ప్రపంచంలో భారతీయులు నంబర్ వన్‌గా ఉండాలి. తెలుగుజాతి ప్రపంచంలో నంబర్‌వన్‌గా ఉండాలి. శాసనసభాపక్ష నేతగా హామీ ఇస్తున్నా. ప్రజా పరిపాలన దిశగా ముందుకెళ్తా.

అందరితో సమానంగానే... పెద్ద కుర్చీ వద్దన్న బాబు..

మూడు పార్టీల ఎమ్మెల్యేల సమావేశ వేదికపై పవన్ కల్యాణ్, అచ్చెన్నాయుడు, చంద్రబాబు, పురందేశ్వరి కోసం కుర్చీలు వేశారు. శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు కోసం ప్రత్యేకంగా పెద్ద కుర్చీ ఏర్పాటు చేశారు. సమావేశం మందిరంలోకి ప్రవేశించిన తర్వాత చంద్రబాబు పెద్ద కుర్చీ చూసి తనకు కూడా అందరితో సమానంగా ఉన్న కుర్చీ వేయాలని, పెద్దది వద్దని సూచించారు. దీంతో సిబ్బంది కుర్చీని మార్చారు.



గవర్నర్‌ను సత్కరించి, వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేస్తున్న చంద్రబాబు

కూటమి నేతగా బాబు

- ఎన్నుకున్న మూడు పార్టీల ఎమ్మెల్యేలు
- పవన్ ప్రతిపాదన.. పురందేశ్వరి సమర్థన
- గవర్నర్‌తో లాంఛనంగా కూటమి నేతల భేటీ
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వాన లేఖను వారికి అందించిన అబ్దుల్ నజీర్

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబును తమ కూటమి శాసనసభాపక్షం నేతగా టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. మంగళవారం విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ హాలులో ఈ కూటమి ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు పేరును జనసేనాని పవన్ కల్యాణ్ ప్రతిపాదించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమర్థించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పురందేశ్వరి రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను లాంఛనంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబును ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తూ రాసిన లేఖను ఆయన వారికి అందజేశారు. ఆయన పిలుపు మేరకు సాయంత్రం చంద్రబాబు రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారిద్దరూ ఏకాంతంగా మాట్లాడుకున్నారు. కూటమి భారీ విజయంతో పాటు మంత్రివర్గం కూర్పుపై చర్చించారు. అంతకుముందు టీడీపీ జాతీయ అధ్యక్షుడైన చంద్రబాబును ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ 'ఏ' కన్వెషన్‌లోనే జరిగిన ఈ భేటీలో అచ్చెన్నాయుడు ఆయన పేరును ప్రతిపాదించగా.. టీడీపీ ఎమ్మెల్యేలంతా లేచి నిలబడి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా అద్భుత విజయం సాధించామని, దీనికి చంద్రబాబు, ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్, పురందేశ్వరి కారకులంటూ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చంద్రబాబు టీడీఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

మీ విజయం ఊహించా!

మరీ ఇంతగా అనుకోలేదు..: గవర్నర్

'టీడీపీ కూటమి విజయం ఊహించిందే. కానీ ఇంత అనూహ్యమైన ఫలితం వస్తుందని మాత్రం ఊహించలేదు' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ కూటమి నేతలతో వ్యాఖ్యానించారు. గతంలో పోలింగ్ సందర్భంగా జరిగిన హింసపై ఫిర్యాదు చేసేందుకు టీడీపీ నేతలు తన వద్దకు వచ్చినప్పుడు.. 'మీరే అధికారంలోకి వస్తున్నారుగా..!' అని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు దానికి కొనసాగింపుగా.. 'మీ గెలుపు ఊహించిందే.. కాకపోతే ఇంత భారీ విజయాన్ని మాత్రం ఊహించలేదు' అని అనడం విశేషం.

మంచి రోజులొచ్చాయి!

- రాష్ట్రానికి చంద్రబాబు అవసరం
- ఆయన దార్శనికుడు, ధైర్యశాలి
- పెట్టుబడులు తెచ్చే సమర్థుడు
- సమష్టి పోరాటంతోనే ఈ విజయం
- ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చాం
- వాటి అమలుకు కలిసి సాగాలి
- పగ, ప్రతీకారాలకు ఇది సమయం కాదు
- అభివృద్ధి కోసమే అడుగులు: పవన్
- బాబు, పవన్ ఆత్మీయ ఆలింగనం

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): "మంచి రోజులు వస్తాయని చెప్పాను! వచ్చాయి" అని జనసేనాని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. దార్శనికుడు, అనుభవజ్ఞుడైన చంద్రబాబు అద్భుతమైన పాలన అందిస్తారని అన్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి శాసనసభ్యుల సమావేశంలో పవన్ ఒకింత భావోద్వేగంతో, ఆలోచింపచేసే రీతిలో ప్రసంగించారు. 'ఈ మాట చంద్రబాబు పక్కన నిలుచుని చెప్పాలి' అని పవన్ అనడంతో... చంద్రబాబు లేచి ఆయన వద్దకువెళ్లారు. పవన్, చంద్రబాబు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. చేతులు కలిపి ఆత్మీయత పంచుకున్నారు. "చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు చూశాను. ఆయన నలిగిపోయి ఉన్నారు. పాపం భువనేశ్వరి బాధను చూశాను. కన్నీళ్లు పెట్టొద్దని, మంచి రోజులు వస్తాయని ఆమెకు చెప్పాను. ఇప్పుడు మంచి రోజులొచ్చాయి. వారికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. చంద్రబాబు అద్భుతమైన పాలన అందించాలి' అని పవన్ పేర్కొన్నారు. అంతకుముందు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జనసేన శాసనసభా పక్ష సమావేశం జరిగింది. తమ పక్ష నేతగా పవన్ పేరును పీఏసీ ఛైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా దీనిని ఆమోదించారు. అక్కడ, ఆ తర్వాత విజయవాడలో జరిగిన కూటమి శాసనసభ్యుల సమావేశంలో పవన్ ప్రసంగించారు. 'చంద్రబాబు దార్శనికుడు.. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం, ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్న నేత.. ఆయన అనుభవం ఈ రాష్ట్రానికి అవసరం. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రజలు నలిగిపోయారు. ఇప్పటికీ నలిగిపోతున్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు అందరికీ తెలుసు. దీనిని మార్చాలని... సమష్టిగా పోరాటం చేసి కలిసికట్టుగా ఉండి అద్భుతమైన మెజారిటీతో విజయం సాధించాం. ఒక్క ఓటు కూడా చీలకుండా అలయెన్స్ అంటే ఏమిటో ఆంధ్రప్రదేశ్ ప్రజలు కలిసికట్టుగా చూపించారు. 2021 మార్చి 14న ఇప్పటం సభలో.. ఆ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వనని చెప్పి మాట మీద నిలబడ్డాను. ప్రజల నమ్మకాన్ని పెంచాం. అత్యంత మెజారిటీతో ప్రభుత్వాన్ని స్థాపిస్తున్నాం" అని తెలిపారు.

> నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపార అవగాహన, పెట్టుబడులు తెచ్చే సమర్థత.. ప్రతిభ, విదేశాల్లో ఉండే నాయకులను, అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించగల చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన ధైర్యశాలి. ఈ రోజున సైబరాబాద్ ఉందంటే ఆయన దార్శనికత వల్లే. కూటమి తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబును జనసేన తరపున బలపరుస్తున్నాం.
>
> విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, తాగునీరు, శాంతిభద్రతలపై బలంగా నిలబడతామని ఎన్నికల్లో చెప్పాం. ఇలాంటి సవాళ్ల సమయంలో సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడు కావాలి.
>
> ఇతర పార్టీ నేతలు వ్యక్తిగతంగా మాట్లాడినా దానిని మనం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొందాం. అంతేగాని ఎదుటి వారు మాట్లాడారని ఎట్టి పరిస్థితుల్లో పరిధి దాటి మాట్లాడొద్దు.
>
> \- పవన్ కల్యాణ్

అభివృద్ధికోసం ముందుకు...

ఇది కక్ష సాధింపులకు, వ్యక్తిగత దూషణలకు సమయం కాదని పవన్ పేర్కొన్నారు. ఐదు కోట్ల ప్రజలు మనమీద నమ్మకం పెట్టుకున్నారని, వారేం కోరుకుంటున్నారో ఆ అభివృద్ధిని అందరం సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. "ప్రజలు అందించిన ఈ ఘన విజయం కక్ష సాధింపు రాజకీయాల కోసం కాదు. పగ, ప్రతీకారాలు తీర్చుకోవడానికి అంతకంటే కాదు. మనల్ని మనస్ఫూర్తిగా నమ్మి అఖండ విజయాన్ని అందించారంటే.. తమకు అత్యుత్తమ పాలన ఇవ్వాలని చెప్పడమే. నేనెప్పుడూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని తప్పి ప్రవర్తించలేదు. గత ప్రభుత్వానికి ఇది అర్థం కాలేదు. ఇప్పుడు మనం అధికారంలో ఉండి ప్రజాస్వామ్యాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించే బాధ్యతను తీసుకుందాం. ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి. నాతో సహా పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలంతా దానిని బాధ్యతగా తీసుకుందాం. పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలంతా మొదట నియోజకవర్గంలో కీలకమైన సమస్యలు, ప్రజల ఇబ్బందులు పడుతున్న విషయాలను గుర్తించాలి. కేంద్రంతో ముడిపడినవి ఉంటే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవి పూర్తయ్యేలా చొరవ తీసుకుందాం. గత ప్రభుత్వంలో శాంతి భద్రతలు అంతంత మాత్రంగా ఉండేవి. ప్రజల భద్రతకు కూటమి ప్రభుత్వంలో పూర్తిస్థాయి భరోసా ఉంటుంది. యువతరం మనల్ని బలంగా నమ్మింది. వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయకపోతే అంతే బలంగా నిలదీస్తారు. ప్రజలు కోపంతో ఒక్కోసారి మాట మాట్లాడినా దానిని వేరుగా తీసుకోవద్దు. వారి ఆగ్రహానికి కారణాలేంటో వెతకండి. వ్యక్తిగతంగా అసలు మాట్లాడకండి. సమయపాలన పూర్తిస్థాయిలో పాటించాలి. ఓ ప్రణాళిక ప్రకారం పాలన ఉండాలి. ఏ పాలసీ మీద అయినా ఉమ్మడిగా కూర్చుని మాట్లాడుకుని నిర్ణయం తీసుకుందాం. ఎన్డీయే పార్టీలతో స్నేహంగా మెలగాలి. కలుపుగోలుగా క్షేత్రస్థాయిలోనూ అన్ని పార్టీలనూ కలుపుకొని వెళ్లాలి. ఇదే స్ఫూర్తిని ఐదేళ్లు కొనసాగించి ప్రజల మన్ననలు పొందేలా పని చేస్తారని ఆకాంక్షిస్తున్నా" అని పవన్ తన పార్టీ నేతలకు సూచించారు.



పవన్ కల్యాణ్‌ను సత్కరిస్తున్న జనసేన ఎమ్మెల్యేలు

ల్యాండ్ టైటిల్.. రద్దుకు సిద్ధం!

- దీనిపైనే చంద్రబాబు రెండో సంతకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రైతు కంటకమైన భూమి యాజమాన్యపు హక్కు (ల్యాండ్ టైటిల్) చట్టం-2023 రద్దయ్యే సమయం ఆసన్నమైంది! రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయనుంది. ఈ మేరకు రద్దు ప్రతిపాదనకు సంబంధించిన ఫైలు భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నుంచి ప్రభుత్వానికి చేరింది. టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో బాధ్యతలు తీసుకోనున్నారు. అనంతరం మెగా డీఎస్సీ ప్రకటన ప్రతిపాదనపై తొలి సంతకం చేయనున్నారు. ఆ తర్వాత ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ఫైలుపై రెండో సంతకం చేయనున్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దుచేస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చారు. ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి ఘన విజయం సాధించింది. చంద్రబాబు హామీ మేరకు ల్యాండ్ టైటిల్ చట్టం రద్దుచేయాలని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ రెవెన్యూ శాఖకు ప్రతిపాదన ఫైలు పంపించారు.

భూముల సర్వే మాటేమిటి..?

ల్యాండ్ టైటిల్ చట్టం అమలు కోసమే జగన్ సర్కారు భూముల సమగ్ర సర్వే చేపట్టింది. 17,360 గ్రామాలకు గాను 8 వేల గ్రామాల్లో భూముల సర్వే పూర్తిచేసినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. సర్వే పేరిట మొత్తం రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌లో ఇప్పటికే రూ.600 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంకా కోట్ల విలువైన పరికరాలు కొంటూనే ఉన్నారు. కానీ రీ సర్వే మాత్రం ఓ పట్టాన ముందుకు సాగడం లేదు. సాంకేతికత సమకూర్చుకునే పేరిట అస్మదీయ కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారు. ఆ కంపెనీలను ఓ మాజీ సలహాదారు తెరమీదకు తీసుకొచ్చారు. ఆ కంపెనీలకే టెండర్లు దక్కేలా, పనులు చేసినా, చేయకున్నా వాటికి సకాలంలో బిల్లులు చెల్లించేలా సర్వే ఉన్నతాధికారి ఒకరు అనేక ప్రయత్నాలు చేశారు. క్షేత్రస్థాయిలో రోవర్లు, ఇతర పరికరాలు పనిచేయకున్నా డ్రోన్ ఇమేజ్‌లతోనే సర్వేచేసినట్లుగా రికార్డులు తయారు చేయాలని సర్వేయర్లు, ఇతర సిబ్బందిని తీవ్రంగా వేధించారు. వారు చేసేదేమీలేక హడావుడిగా రికార్డులు తయారు చేశారు. వాటి నిండా తప్పులే ఉన్నాయి. భూముల కొలతలు, సరిహద్దుల విషయంలో భారీ తేడాలున్నాయి. ప్రభుత్వం అందించిన పాస్‌పుస్తకాలపైనా రైతులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. తమ భూమి పత్రాలపై జగన్ ఫొటోలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. కొందరు రైతులు ఆ పాసుపుస్తకాలను చింపివేస్తున్నారు. అడ్డగోలుగా చేసిన భూముల సర్వేను, వాటి ఆధారంగా ఇచ్చిన పాసుపుస్తకాలను కూడా రద్దుచేయాలని కోరుతున్నారు.

కూటమి విజయం దేశానికి స్ఫూర్తి

- గత ఐదేళ్లలో అభివృద్ధే లేదు.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి
- వారి తీర్పునకు అనుగుణంగా పనిచేయాలి: పురందేశ్వరి



సమావేశంలో పురందేశ్వరికి నమస్కరిస్తున్న లోకేశ్

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మూడు పార్టీలూ కలిసి అనూహ్యమైన విజయం సాధించామని, ఇది దేశానికే స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కూటమి శాసనసభా పక్ష నేతగా చంద్రబాబుకు ఆమె మద్దతు పలికారు. అంతకుముందు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేల భేటీలో మాట్లాడారు. 'గడచిన ఐదేళ్ల కాలంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, విద్వేష, విధ్వంస పాలనను ఎదుర్కొన్నారు. అభివృద్ధి అనే పదానికి అర్థం లేకుండా పోయి.. నిజమైన సంక్షేమమనేది దూరమై.. విసిగి, వేసారిపోయిన ప్రజలు కూడా ఇంత ఘనమైన విజయాన్ని ఊహించలేదు. ప్రజావ్యతిరేక పాలన అంతమొందించాలని జగన్ అనే రాక్షసుడిని ఇంటికి పంపించాలనే భావనతో జనం ఓట్లేశారు. వారు ఓటు మాధ్యమం ద్వారా మనకూ ఒక హెచ్చరిక ఇచ్చారు. మనం గెలిచాం, అధికారంలోకి వచ్చామన్న భావన కన్నా ప్రజాహితమైన పాలన, సుపరిపాలన ఏ విధంగా ప్రజలకు అందించాలన్న విషయంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉంది. బీజేపీ ఆది నుంచీ సబ్‌కా వికాస్ అని.. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడు సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అని.. సమాజంలో పేదవాడికి అన్యాయం జరిగితే గళం విప్పి ప్రశ్నిస్తామని జనసేన ఆవిర్భావం నుంచీ ముందుకొచ్చిన నేపథ్యం. ఈ మూడు పార్టీల ఆవిర్భావం ఒకే దిశలో ఉన్నాయి. వీటికి అనుకూలంగా రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలి' అని కోరారు.

29 ఏళ్ల తర్వాత..

1995లో పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు అప్పట్లో టీడీఎల్పీ నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించగా.. 29 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూటమి శాసనసభపక్ష నేతగా చంద్రబాబుకు మద్దతు పలకడం విశేషం.

బీజేపీలో జోష్

కూటమి విజయంతో రాష్ట్ర బీజేపీలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. 'నోటా సే ఛోటా(నోటా కన్నా తక్కువ)' పార్టీగా పడిన ముద్రను పోగొట్టుకుని కొత్త చరిత్ర సృష్టించింది. ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఏకంగా 8 స్థానాలు గెలుచుకుంది. ఈ ఎమ్మెల్యేలంతా మంగళవారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి రావడంతో దానికి గతంలో ఎప్పుడూ లేనంత కళ వచ్చింది.


మంగళవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయంలో చిరంజీవి దంపతులు

తరలి వస్తున్నారు!

- విజయవాడ చేరుకున్న అమిత్‌షా, నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు
- రజనీకాంత్‌ను తోడ్కొని వచ్చిన రామ్మోహన్ నాయుడు
- పది దేశాల దౌత్యాధికారులు, బడా పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం
- చంద్రబాబు ఫోన్‌కు స్పందించని జగన్

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి అతిరథ మహారథులు హాజరవుతున్నారు. అనేక మంది ప్రముఖులు మంగళవారమే విజయవాడ చేరుకున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో గన్నవరం చేరుకున్నారు. వీరికి విమానాశ్రయంలో లోకేశ్, పురందేశ్వరి, సీఎం రమేశ్ తదితరులు స్వాగతం పలికారు.


గన్నవరం విమానాశ్రయంలో రజనీకాంత్

అమరావతి నిర్మాణం, పెట్టుబడుల పరంగా సహకారం అవసరమైన నేపథ్యంలో... పలు దేశాల కాన్సులేట్ జనరల్స్, హై కమిషనర్లను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించారు. జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, సింగపూర్, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ దౌత్యాధికారులు మంగళవారమే విజయవాడ చేరుకున్నారు. మొత్తం పది దేశాల దౌత్యాధికారులు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కానున్నారు. ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు 'మెగా స్టార్' చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు విజయవాడకు విచ్చేశారు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వయంగా తీసుకొచ్చారు. జాతీయ స్థాయిలో భారీ సంఖ్యలో పారిశ్రామికవేత్తలకు కూడా ఆహ్వానం పలికారు. అమరావతిలో ఏర్పాటైన ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన 'విట్' వైస్ ప్రెసిడెంట్ జీవీ సెల్వమ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ కూడా హాజరు కానున్నారు. బిహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సీఎంలు నితీశ్ కుమార్, ఏక్‌నాథ్ షిండే, మోహన్ యాదవ్‌తోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పలువురు ఎన్డీయే నేతలు, కేంద్ర మంత్రులు ప్రమాణ స్వీకారానికి హాజరుకానున్నారు.

వైసీపీ దూరం...

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉండాలని వైసీపీ నిర్ణయించుకుంది. ఈ కార్యక్రమానికి వైసీపీ అధినేత జగన్‌ను ఆహ్వానించినా ఆయన స్పందించలేదు. జగన్‌ను స్వయంగా ఆహ్వానించేందుకు చంద్రబాబు ప్రయత్నించినప్పటికీ ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదని టీడీపీ వర్గాలు తెలిపాయి. వైసీపీ ఎమ్మెల్యేలకు కూడా ఆహ్వానాలను పంపారు. అయితే, ఈ కార్యక్రమానికి హాజరు కాకూడదని వైసీపీ నేతలు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

ప్రమాణ స్వీకారానికి

సర్వం సిద్ధం



- సర్వాంగ సుందరంగా కేసరపల్లి ముస్తాబు
- 20 ఎకరాల్లో జర్మనీ హ్యాంగర్స్ టెంట్లు నిర్మాణం
- 50 వేలమంది ఆహ్వానితుల కోసం 36 గ్యాలరీలు
- మరో 50 వేల మంది ప్రజలు, కార్యకర్తల రాక
- రాజధానిలో భూములిచ్చిన రైతులకోసం గ్యాలరీ
- భారీగా విచ్చేసిన విదేశీ, జాతీయ అతిథులు
- విజయవాడలోని హోటళ్లన్నీ కిటకిట

గ్యాలరీలు..

ప్రమాణ స్వీకార వేదికకు అభిముఖంగా ఏర్పాటు చేసిన మూడు జర్మనీ హ్యాంగర్స్ టెంట్లలో ప్రత్యేక ఆహ్వానితులు, ఎంవీఐపీలు, వీవీఐపీలు, వీఐపీల కోసం మొత్తంగా 36 గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

గ్యాలరీ - 1 : జాతీయ మీడియా సభ్యులు 250 మందికి, జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు 400 మంది.
గ్యాలరీ - 2 : పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల కోసం 650 సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటు.
గ్యాలరీ - 3 : చంద్రబాబు కుటుంబ సభ్యుల కోసం 300 మందికి సరిపడా ఏర్పాటు.
గ్యాలరీ - 4 : పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యుల కోసం 300 మందికి సరిపడా నిర్మాణం
గ్యాలరీ - 5 : అమరావతి రాజధాని నిర్మాణానికి సహకరించిన దాతలు 300 మంది.
గ్యాలరీ - 6 : న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసు అధికారులు, దౌత్యవేత్తలతో కలిపి 250 మంది..
గ్యాలరీ - 7 : పారిశ్రామికవేత్తల కోసం 200 మందికి సరిపడా ఏర్పాటు.
గ్యాలరీ - 8 : స్థానిక మీడియాకు చెందిన 250 మంది.

ఇంకా... ఒక్కో గ్యాలరీకి వెయ్యి మంది పట్టేలా వీవీఐపీల కోసం ఆరు గ్యాలరీలు, గ్యాలరీకి వెయ్యి మంది చొప్పున వీఐపీల కోసం 24 గ్యాలరీలను కేటాయించారు.

కేసరపల్లిలో ప్రమాణస్వీకార ఏర్పాట్లు



విజయవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారానికి సర్వం సిద్ధమైంది. మరికొద్ది గంటల్లోనే ఆరంభం కానున్న ప్రమాణ స్వీకార వేడుక కోసం కృష్ణాజిల్లా గన్నవరంలోని కేసరపల్లి గ్రామం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇరవై ఎకరాల ప్రాంగణంలో మూడు అత్యంత భారీ జర్మనీ హ్యాంగర్స్ టెంట్లను ఏర్పాటు చేశారు. అర లక్ష మంది వరకు ప్రత్యేక ఆహ్వానితులు, వీవీఐపీలు, వీఐపీలకు ప్రత్యేకంగా పాసులు జారీచేశారు. మరో అర లక్ష మంది పార్టీ కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటం వల్ల ప్రాంగణంలోనూ, ఎన్‌హెచ్ - 65 వెంబడి భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఒక రోజు ముందుగానే సభాస్థలిలో ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ కార్యక్రమానికి విదేశీ,జాతీయస్థాయి అతిథులు తరలి వస్తున్నారు. దాదాపుగా ఆహూతులంతా మంగళవారం రాత్రికి విజయవాడ చేరుకున్నారు. దీంతో ఇక్కడి హోటళ్లన్నీ అతిథులతో కిటకిటలాడుతున్నాయి. ఇక ఏర్పాట్ల విషయానికి వస్తే... ప్రమాణ స్వీకార వేదికపై 60 మంది వరకు కూర్చునే విధంగా ఏర్పాటుచేశారు. దానికి కుడివైపున మ్యూజిక్ బ్యాండ్‌కు ఒక వేదిక, ఎడమ వైపున సాంస్కృతిక కార్యక్రమాల కోసం మరో వేదికను ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఆహ్వానితుల కోసం వేదిక వెనుక భాగంలో గ్రీన్ రూమ్స్ ఏర్పాటు చేశారు. వాటిని ఎవరెవరి కోసం ఏర్పాటు చేశారో వారంతా కేసరపల్లి - వెంకట నరసింహాపురం రోడ్డు మీదుగా వేదిక వెనుక ప్రాంతం నుంచి ఇక్కడికి చేరుకుంటారు. ప్రధానమంత్రి మోదీ కోసం ప్రత్యేకంగా వేదికకు అత్యంత సమీపంలో గ్రీన్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీతో పాటు, హోంమంత్రి అమిత్‌షా, నడ్డా , ఇతర కేంద్ర మంత్రులు కూడా ఈ గ్రీన్ రూమ్‌కు చేరుకుంటారు. ప్రధాని గ్రీన్ రూమ్‌కు వెనుకభాగంలో పీఎంవో సిబ్బంది కోసం మరో రూమ్‌ను ఏర్పాటు చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ కోసం ఒక గ్రీన్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి కోసం ప్రత్యేకంగా గ్రీన్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి గ్రీన్ రూమ్ పక్కనే వీవీఐపీల కోసం ఇంకో గ్రీన్ రూమ్ ఏర్పాటు చేశారు.

12 హెలిప్యాడ్‌లు సిద్ధం

తరలివచ్చిన ప్రజలు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించటానికి వీలుగా ప్రాంగణంలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకారానికి వచ్చే ప్రత్యేక అతిథులు, జాతీయ పారిశ్రామికవేత్తలు, దౌత్యవేత్తలు తదితరులు ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లలో తరలి రానున్నారు. ప్రత్యేక హెలికాప్టర్లలో వచ్చే వారి కోసం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మొత్తం 12 హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. విజయవాడ ఎయిర్‌పోర్టు రన్‌వే మీద అన్ని సందర్భాలలో ల్యాండింగ్ చేయటం వీలు పడదు. కాబట్టి .. ప్రత్యామ్నాయ హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. జ్యూవెల్ కౌంటీ సమీపంలోని ఎలైట్ విస్టాలో ఎంపీలు, ఎంఎల్‌ఏలు, ఎమ్మెల్సీల కుటుంబ సభ్యులకు పార్కింగ్ ప్లేస్ కేటాయించారు. ఇక్కడి నుంచి వీరందరినీ అమరావతి ఏసీ బస్సులలో సభా ప్రాంగణానికి తరలిస్తారు. కేసరపల్లి విల్లా సమీపంలో వీవీఐపీల కోసం పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం వెటర్నరీ కాలేజీలో పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టారు. ఇతరులకు సంబంధించి మేధా ఐటీ టవర్ రోడ్డు వెంబడి ఖాళీ స్థలాన్ని కేటాయించారు. ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులకు కేటాయించిన పార్కింగ్‌లో వాహనాలు నిలిపి అక్కడి నుంచి బస్సులలో సభా వేదిక వద్దకు తీసుకువస్తారు. ప్రతి జిల్లాలో చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ అయ్యే విధంగా ఏర్పాటు చేస్తున్నారు.


ఖమ్మం నుంచి సైకిల్‌పై వెళ్తున్న టీడీపీ అభిమాని

బాబు కోసం ఖమ్మం నుంచి సైకిల్‌పై...

ఖమ్మం, జూన్ 11: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఓ అభిమాని ఖమ్మం నుంచి సైకిల్‌పై తరలివెళ్లాడు. గన్నవరం విమానాశ్రయం సమీపంలో కేసరపల్లి ఐటీపార్క్ వద్ద జరగబోయే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఖమ్మంలోని వేణుగోపాల్‌నగర్‌కి చెందిన తెలుగుదేశం కార్యకర్త లక్ష్మణ్ టీడీపీపై ఉన్న అభిమానంతో ప్రమాణ స్వీకార ప్రాంతానికి సైకిల్‌పై మంగళవారం బయలుదేరాడు. ఖమ్మం టీడీపీ ఆఫీసు నుంచి ఆయన సైకిల్‌పై బయలుదేరాడు. ఆయన యాత్రను టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ జెండా ఊపి ప్రారంభించారు.

నేడు తిరుమలకు చంద్రబాబు

- సీఎం హోదాలో రేపు ఉదయం శ్రీవారి దర్శనం

తిరుమల, అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు రానున్నారు. ఉదయం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆయన కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు చేరుకుంటారు. బుధవారం రాత్రి తిరుమలలోని గాయత్రి నిలయం అతిథిగృహంలో బస చేస్తారు. గురువారం ఉదయం 7.30 గంటలకు సీఎం హోదాలో కుటుంబసమేతంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశిస్తారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకుంటారు. అనంతరం రంగనాయక మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటారు. తిరిగి 8.20 గంటలకు అతిథిగృహానికి చేరుకుని 9 గంటలకు తిరుమల నుంచి అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు. చంద్రబాబు సీఎం హోదాలో తిరుమలకు వస్తున్న నేపథ్యంలో టీటీడీ అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అతిథిగృహం వద్ద స్వాగతం, బస, దర్శన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేసింది. మరోవైపు చంద్రబాబు పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు, టీటీడీ విజిలెన్స్ విభాగాలు కూడా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశాయి. చంద్రబాబు బస చేసే అతిథిగృహం, కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా తనిఖీ చేశాయి.


కొత్త ప్రభుత్వ ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని స్టేట్ గెస్ట్ హౌస్‌కు విద్యుద్దీపాలంకరణ


చంద్రబాబు కారు వెనుక పరుగు తీస్తున్న మహిళ


కారు ఆపి మహిళను పలకరించిన చంద్రబాబు

చంద్రబాబు కాన్వాయ్ వెంట మహిళ పరుగులు

విజయవాడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): చంద్రబాబును చూడాలి... ఆయన కాళ్లు మొక్కాలి అంటూ ఒక మహిళ చంద్రబాబు కాన్వాయ్ వెంట పరుగులు తీసింది. వెంటనే కాన్వాయ్‌ని ఆపించిన చంద్రబాబు ఆ మహిళతో మాట్లాడారు. ఈ సంఘటన మంగళవారం విజయవాడలో చోటు చేసుకుంది. అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన నందిని అనే మహిళ చంద్రబాబును కలవడం కోసం ఏ కన్వెన్షన్ వద్దకు వచ్చి, ఓ పక్కన నిలబడింది. సమావేశం పూర్తయిన తర్వాత చంద్రబాబు కాన్వాయ్ ఏ కన్వెన్షన్ ప్రాంగణం నుంచి నెమ్మదిగా రోడ్డు మీదకు వచ్చింది. అక్కడి నుంచి కాస్తంత వేగం పెరిగింది. వాహనంలో ఉన్న చంద్రబాబును చూసిన నందిని ఆయనను కలవడం కోసం కాన్వాయ్ వెంట పరుగులు తీసింది. దీన్ని గమనించిన చంద్రబాబు వెంటనే వాహనాన్ని నిలుపుదల చేయించారు. ఆయన నందినీని ఆత్మీయంగా పలకరించారు. "మా కష్టం ఫలించింది. మీరు సీఎం అయ్యారు సార్. ఒక్కసారి మీ కాళ్లు మొక్కుతాను" అని చెప్పింది. వెంటనే చంద్రబాబు వద్దని వారించారు. ఆప్యాయంగా పలకరించి ఆమెతో ఫోటో దిగారు. జ్వరం ఉన్నా చూడడానికి మదనపల్లె నుంచి వచ్చానని చెప్పింది. ఆసుపత్రిలో చూపించుకోవాలని, అవసరమైన సాయం చేయాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు.

24 మందితో కేబినెట్

బీసీ నేతలకే పెద్దపీట

- అచ్చెన్న, కొల్లు సహా 8 మందికి మంత్రి పదవులు
- అనిత, సవిత సహా ముగ్గురు మహిళలకు చోటు
- పవన్, దుర్గేశ్, కొండపల్లి సహా 8 మంది కొత్త ఎమ్మెల్యేలకు చోటు
- పాత తరం ఆనం, కొలుసుకూ చోటు
- నారాయణ, లోకేశ్, కేశవ్, ఫరూక్ కూడా
- ప్రతి ఏడుగురు ఎమ్మెల్యేలకు ఓ మంత్రి పదవి
- ఆ లెక్కన జనసేనకు మూడు, బీజేపీకి ఒకటి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తన మంత్రివర్గంలో బీసీలకు, మహిళలకు టీడీపీ కూటమి సారథి చంద్రబాబు అధిక ప్రాధాన్యమిచ్చారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి సహా 8 మంది బీసీ నేతలకు అవకాశమిచ్చారు. అలాగే టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, సీనియర్ నాయకురాలు గుమ్మడి సంధ్యారాణి, కొత్తగా ఎన్నికైన సవితకు కూడా మంత్రి పదవులు లభించాయి. జనసేనాని పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్, సవిత సహా కొత్తగా ఎన్నికైన 8 మంది ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో చోటు కల్పించారు. ఆయనతో పాటు పదవీప్రమాణం చేసే మొత్తం 25 మంది మంత్రుల పేర్లను మంగళవారం అర్ధరాత్రి దాటాక ప్రకటించారు. కాపు, కమ్మ సామాజిక వర్గాలకు చెరి నాలుగు పదవులు దక్కాయి. కాపుల్లో పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు, పవన్, దుర్గేశ్.. కమ్మ వర్గానికి చెందిన లోకేశ్, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్‌కు.. రెడ్డి సామాజిక వర్గంలో సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎం.రాంప్రసాద్‌రెడ్డికి అవకాశం లభించింది. ఎస్సీ కోటాలో అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్టీ కోటాలో గుమ్మడి సంధ్యారాణి, ముస్లింల నుంచి మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఆర్య వైశ్య వర్గం తరఫున టీజీ భరత్ చోటు సంపాదించారు. అసెంబ్లీలో 175 సీట్లు ఉండగా మంత్రివర్గంలో 25 మంది మంత్రులను తీసుకోవడానికి అవకాశం ఉంది. కేబినెట్ కూర్పునకు చంద్రబాబు ఓ ఫార్ములా రూపొందించారు. ప్రతి ఏడుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి కేటాయించారు. ఆ లెక్కన 21 మంది ఎమ్మెల్యేలున్న జనసేనకు మూడు, 8 మంది ఎమ్మెల్యేలున్న బీజేపీకి ఒకటి (సత్యకుమార్).. 135 స్థానాలున్న టీడీపీకి సీఎం సహా 21 మంత్రి పదవులు లభించాయి. పదవులు పొందిన బీసీ నేతల్లో ఇంకా కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్, సత్యకుమార్, సవిత ఉన్నారు. ఉమ్మడి జిల్లాలవారీగా గుంటూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలకు అత్యధికంగా మూడేసి మంత్రిపదవులు దక్కాయి. తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, నెల్లూరు, విజయనగరం, ప్రకాశం జిల్లాలకు రెండేసి లభించాయి. చిత్తూరు జిల్లాలో సీఎం చంద్రబాబుకు తప్ప మరెవరికీ అవకాశం లభించలేదు. శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలనుంచి కూడా ఒక్కొక్కరికే చాన్సు దక్కింది. అలాగే శాసనమండలి నుంచి ఎవరికీ దక్కలేదు.

ఉమ్మడి జిల్లాల వారీగా కేబినెట్‌లో ప్రాతినిధ్యం

చిత్తూరు - 1 (ముఖ్యమంత్రి)
కడప - 1
విశాఖపట్నం - 1
శ్రీకాకుళం - 1
తూర్పు గోదావరి - 2
ప్రకాశం - 2
విజయనగరం - 2
కృష్ణా - 2
నెల్లూరు - 2
పశ్చిమ గోదావరి - 2
గుంటూరు - 3
అనంతపురం - 3
కర్నూలు - 3

తెలుగుదేశం

1. నారా లోకేశ్, మంగళగిరి
2. కింజారపు అచ్చెన్నాయుడు, టెక్కలి
3. కొల్లు రవీంద్ర, బందరు
4. పొంగూరు నారాయణ, నెల్లూరు సిటీ
5. వంగలపూడి అనిత, పాయకరావుపేట
6. నిమ్మల రామానాయుడు, పాలకొల్లు
7. ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల
8. ఆనం రామనారాయణ రెడ్డి, ఆత్మకూరు
9. పయ్యావుల కేశవ్, ఉరవకొండ
10. అనగాని సత్యప్రసాద్, రేపల్లె
11. కొలుసు పార్థసారథి, నూజివీడు
12. డోలా బాల వీరాంజనేయ స్వామి, కొండపి
13. గొట్టిపాటి రవికుమార్, అద్దంకి
14. గుమ్మడి సంధ్యారాణి, సాలూరు
15. బీసీ జనార్దన రెడ్డి, బనగానపల్లి
16. టీజీ భరత్, కర్నూలు
17. ఎస్.సవిత, పెనుకొండ
18. కొండపల్లి శ్రీనివాస్, గజపతినగరం
19. ఎం.రాంప్రసాద్ రెడ్డి, రాయచోటి
20. వాసంశెట్టి సుభాష్, రామచంద్రాపురం

జనసేన

1. పవన్ కల్యాణ్, పిఠాపురం
2. నాదెండ్ల మనోహర్, తెనాలి
3. కందుల దుర్గేశ్, నిడదవోలు

బీజేపీ

1. సత్యకుమార్ యాదవ్, ధర్మవరం


చంద్రబాబు నివాసంలో ఆయన కుటుంబ సభ్యులతో అమిత్ షా, జేపీ నడ్డా

నవ శకానికి నాంది!

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, కొందరు కేంద్ర మంత్రులు, దేశ విదేశాలకు చెందిన ప్రత్యేక ఆహ్వానితులు, కొత్తగా ఎంపికైన శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, తెలుగు తమ్ముళ్లు, అభిమాన సందోహం నడుమ అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

సభాపక్ష నేతగా...

కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన రాజ్యాంగ ప్రక్రియను మంగళవారం పూర్తి చేశారు. మంగళవారం ఉదయం విజయవాడలోని ఏ-కన్వెన్షన్ సమావేశ మందిరంలో కూటమిలోని మూడు పార్టీల ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొదట టీడీపీ శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు నాయుడును ఎన్నుకొన్నారు. ఆ తర్వాత కూటమి తరఫున శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్వయంగా ప్రతిపాదించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బలపర్చారు. సమావేశానికి హాజరైన మూడు పార్టీల ఎమ్మెల్యేలు హర్షధ్వానాలతో ఈ నిర్ణయాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా మూడు పార్టీల సారథులు ఎమ్మెల్యేలను ఉద్దేశించి ప్రసంగించారు. సుమారు రెండు గంటలపాటు ఈ సమావేశం జరిగింది.

గవర్నర్ నుంచి ఆహ్వానం...

ఈ భేటీ ముగిసిన తర్వాత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. సభా నేతగా చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నట్లు మూడు పార్టీల తరఫున విడివిడిగా లేఖలు సమర్పించారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానిస్తూ గవర్నర్ ఒక లేఖ పంపారు. ఆ తర్వాత మంగళవారం సాయంత్రం చంద్రబాబు రాజ్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆ తర్వాత చంద్రబాబు నివాసంలో కొందరు ఉన్నతాధికారులు ఆయనను కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు.

నేతల రాక...

చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా మంగళవారం రాత్రి విజయవాడకు చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి వారు నేరుగా అమరావతిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ఆయనతో కలిసి రాత్రి భోజనం తర్వాత నోవాటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ రాత్రి బస చేశారు. మంగళవారం సాయంత్రం కొంత విరామం తీసుకొని చంద్రబాబు తన మంత్రివర్గ కూర్పుపై కసరత్తు చేశారు.

నేడు ప్రధాని రాక

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ బుధవారం విజయవాడ రానున్నారు. ప్రమాణ స్వీకార ముహూర్తానికి కొంత ముందు ఆయన రానున్నారు. ఇక్కడ చంద్రబాబు ప్రమాణ స్వీకారం తర్వాత ఆయన భువనేశ్వర్ వెళ్లి ఒడిసా నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారని సమాచారం. కాగా... చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రసంగాలు ఏవీ ఉండవని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రధాని ప్రసంగం కూడా ఉండబోదని అంటున్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత అదే ప్రాంగణంలో కొత్త మంత్రులతో అల్పాహార విందు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి ప్రధానిని కూడా ఆహ్వానించారు.

రేపే 'తొలి సంతకాలు'

- డీఎస్సీ, పింఛను పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు గురువారం తొలి సంతకాలు చేయనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సంబంధించిన ఫైళ్లపై ప్రమాణ స్వీకార వేదికపైనే సంతకం చేయాలని తొలుత భావించారు. కానీ, కొన్ని కారణాల వల్ల ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రమాణ స్వీకారానికి మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించారు. బుధవారం ఉదయం సీఎంగా ప్రమాణం చేసిన అనంతరం ఆయన తిరుమల వెళతారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని, అక్కడి నుంచి బయల్దేరి 10.45 గంటలకు అమరావతి సచివాలయానికి చేరుకుంటారు. సచివాలయ ఉద్యోగుల స్వాగత కార్యక్రమం పూర్తి కాగానే ఒకటో బ్లాకులోని సీఎం కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ... 'డీఎస్సీ నోటిఫికేషన్'పైనే తొలి సంతకం పెడతానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు... సంబంధిత ఫైలుపై సంతకం చేస్తారు. ఆ తర్వాత... సామాజిక పింఛను రూ.4వేలకు పెంపు, నైపుణ్యాభివృద్ధి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతోపాటు మరో ఫైలుపై ఆయన సంతకం చేసే అవకాశముంది.



ర్యాంకులు సాధించిన ఐ.హనీత్, టి.సంజయ్ తేజ, ఎ.రోహన్, సి.రేవంత్

ఏపీఈఏపీ సెట్‌లో విజ్ఞాన్ ప్రభంజనం

గుంటూరు(విద్య), జూన్ 11: ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కాలేజీకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జె.మోహన్‌రావు మాట్లాడుతూ వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన ఐ.హనీత్ (387), టి.సంజయ్ తేజ (494), ఎ.రోహన్ (904), సి.రేవంత్ (957), పి.అమర లోకేష్ (1015), పి.గౌతమ్ (1195), కె.కారుణ్య (1206), ఎం.నాగ సాయి ప్రకాష్ (1219), బి.యోగ విజయ్ కుమార్ (1369), సిహెచ్.వెంకట ఉదయ్ ఆదిత్య (1377), కె.దక్షిణ్ (1777), ఎం.వివేక్ పూజిత్ కుమార్ (1964) ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులతో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.మోహన్‌రావు, వై.వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఏపీఈఏపీసెట్‌లో సత్తా చాటిన భాష్యం

- రాష్ట్రస్థాయిలో నాలుగు ర్యాంకులు కైవసం



ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన జిష్ణుసాయి, సాయియశ్వంత్ రెడ్డిని అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), జూన్ 11: ఏపీఈఏపీ సెట్-2024 ఫలితాల్లో భాష్యం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఎం.జిష్ణు సాయి స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఎం.సాయియశ్వంత్ రెడ్డి 2వ ర్యాంకు, కె.మనీష్ చౌదరి 5వ ర్యాంకు, కె.ప్రభాస్ 10, కె.హర్షిత 16, ఎస్.ప్రణయ్ విక్టర్ 25, ఎం.శ్రీచరిత సాయి 29, టి.మునికార్తీక్ 35, పి.శ్యామ్ 49, కె.చైతన్య 54, ఎం.సాయి జస్వంత్ రెడ్డి 61, ఆర్.రాజ్ శ్రీవర్ధన్ 83 ర్యాంకులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు 100 లోపు 12 స్టేట్ ర్యాంకులతో అగ్రస్థానంలో నిలిచారని వెల్లడించారు. భాష్యం విద్యార్థులు వరుసగా రెండోసారి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడంతో పాటు టాప్ టెన్‌లో నాలుగు ర్యాంకులు కైవసం చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

అమిగోస్ ఆటకట్టు!

- కీలక ఫైల్స్ మాయానికి విఫలయత్నం
- అనంత నుంచి తరలింపునకు వాహనాలు
- అడ్డుకున్న మైనింగ్ అధికారులు
- పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడే అమిగోస్ ఎండీ
- మైనింగ్ కంపెనీల నుంచి రాయల్టీ వసూలు
- కాంట్రాక్టును కట్టబెట్టిన జగన్ ప్రభుత్వం
- 72 చెక్‌పోస్టులు పెట్టి దోచేసిన అమిగోస్..



అనంతపురం నగరంలోని అమిగోస్ కార్యాలయం, అమిగోస్ వాహనంలో తరలించేందుకు సిద్ధం చేసిన ఫైల్స్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 11: జగన్ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అనంతపురం జిల్లాలో ఖనిజ సంపదను దోచుకున్న అమిగోస్ వినరల్స్ ప్రైవేటు సంస్థ, ప్రభుత్వం మారగానే కీలక ఫైళ్లు దాచేసే ప్రయత్నంలో పడింది. అనంతపురం నగరంలోని తమ కార్యాలయంలో నుంచి ముఖ్యమైన డేటాను మాయం చేయాలని చూస్తోంది. ఫైళ్లను కార్యాలయం నుంచి తరలించేందుకు మంగళవారం ప్రయత్నించగా, మైన్స్ అధికారులు అడ్డుకున్నారు. తిరుపతికి చెందిన అమిగోస్ సంస్థ ఎండీ ప్రసాద్ రెడ్డి..మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రధాన అనుచరుడు, వైసీపీ అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి. అనంతపురం జిల్లావ్యాప్తంగా మైనింగ్ కంపెనీలున్నాయి. ఆ కంపెనీల రాయల్టీలు వసూలు చేసి ఏటా ప్రభుత్వానికి రూ.260 కోట్లు వసూలుచేసి పెట్టే కాంట్రాక్టును అమిగోస్‌కు జగన్ సర్కారు కట్టబెట్టింది. అయితే, 72 చెక్‌పోస్టులు పెట్టి పరిమితికిమించి పన్నుల వసూళ్ల ద్వారా అమిగోస్ ప్రతినిధులు గత ప్రభుత్వం కోట్లు వెనుకేసుకున్నారు. ప్రభుత్వం మారగానే ఇప్పుడు చల్లగా సర్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజే అమిగోస్ సంస్థ ఎండీ ప్రసాదరెడ్డి, ముఖ్య అధికారులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ప్రసాద్‌రెడ్డి తమకు అందుబాటులోకి రావడం లేదని మైనింగ్ శాఖ అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో అమిగోస్ కార్యాలయంలోని ముఖ్యమైన ఫైల్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఆ సంస్థ ప్రతినిధులు ప్రయత్నించారు. అయితే, ఏ ఒక్క ఫైల్‌నూ తరలించేందుకు ఒప్పుకొనేది లేదని మైన్స్ అధికారులు హెచ్చరించడంతో, ఆ ప్రయత్నం విరమించుకున్నారు.

ఫైళ్లన్నీ ప్రభుత్వానికి అందజేయాల్సిందే..

"అమిగోస్ కార్యాలయంలోని ఫైళ్లన్నింటినీ ప్రభుత్వానికి అందజేయాల్సిందే. ఏ ఒక్క ఫైల్‌ను కూడా తీసుకెళ్లనీయకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫైల్స్ మాకు ఆ సంస్థ స్వాధీనం చేయాలి. వాటిని ఎక్కడికీ తరలించకుండా మా సిబ్బంది చూసుకుంటారు. ఇందులో ఎవరి జోక్యానికీ తావులేదు"

- రామకృష్ణ ప్రసాద్, మైన్స్ ఇన్‌చార్జి ఏడీ, అనంతపురం

వివేకా హత్య కేసులో కోర్టుకు హాజరైన అవినాశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఇతర నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి (అవినాశ్‌రెడ్డి తండ్రి), దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, దస్తగిరి (అప్రూవర్) కూడా న్యాయస్థానంలో హాజరయ్యారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా చంచల్‌గూడ జైల్లో ఉన్న ఎర్ర గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డిలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపర్చారు. జైల్లో ఉన్న నిందితుల రిమాండ్‌ను సీబీఐ కోర్టు ఈ నెల 21 వరకు పొడిగించింది. తదుపరి విచారణ 21కి వాయిదా పడింది. సీబీఐ ఛార్జిషీట్‌లు, డాక్యుమెంట్లను డిజిటల్‌గా కాకుండా పత్రాల రూపంలో అందజేయాలంటూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది.

కరుణాకర్ రెడ్డి రాజీనామా ఆమోదం

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్‌గా జగన్ హయాంలో నియమించిన భూమన కరుణాకర్‌రెడ్డి రాజీనామాను దేవదాయశాఖ ఆమోదించింది. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చిన మరునాడే కరుణాకర్‌రెడ్డి తన పోస్టుకు రాజీనామా చేశారు. మంగళవారం ఆయన రాజీనామాను ఆమోదిస్తూ దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంజనీరింగ్‌లో అబ్బాయిలు అదుర్స్

ఇంజనీరింగ్ టాప్ 3 ర్యాంకులు | అగ్రి కల్చర్ టాప్ 3 ర్యాంకులు



మాకినేని జిష్ణు సాయి (1వ ర్యాంకు) | ఎం.సాయి యశ్వంత్ రెడ్డి (2వ ర్యాంక్) | సందేశ్ (3వ ర్యాంక్) | వై. శ్రీశాంత్ రెడ్డి (1వ ర్యాంకు) | పూల దివ్య తేజ (2వ ర్యాంకు) | వి.ముఖేశ్ చౌదరి (3వ ర్యాంకు)

- టాప్ టెన్ ర్యాంకులూ వారివే
- సంఖ్యాపరంగా అమ్మాయిలే ఎక్కువ
- అగ్రిలో తెలంగాణ విద్యార్థికి టాప్ ర్యాంక్
- నాలుగు ర్యాంకులు కొట్టిన అమ్మాయిలు
- ఈఏపీసెట్‌లో 78.26% మందికి అర్హత
- త్వరలో ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ
- ఈసారి సీఎస్ఈలోనే లక్ష సీట్లు

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీసెట్‌లో అబ్బాయిలు టాప్ ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో టాప్ టెన్ ర్యాంకులు అబ్బాయిలే కొల్లగొట్టారు. అగ్రికల్చర్ విభాగంలో మాత్రం తొలి 10 మందిలో ఆరుగురు అబ్బాయిలుంటే, నలుగురు అమ్మాయిలున్నారు. కాగా, ఇంజనీరింగ్‌కు అర్హత సాధించిన విద్యార్థుల్లో ఎక్కువ శాతం అమ్మాయిలే ఉన్నారు. అగ్రికల్చర్‌లో స్వల్ప స్థాయిలో ఎక్కువ శాతం అబ్బాయిలు అర్హత సాధించారు. 3,39,140 మంది ఈఏపీసెట్ రాయగా వారిలో 2,65,444 మంది(78.26శాతం) అర్హత సాధించారు. ఈ మేరకు ఈఏపీసెట్ ఫలితాలను ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు మంగళవారం విజయవాడలో విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 2,58,374 మంది పరీక్షలు రాయగా 1,95,092(75.51శాతం) మంది, అగ్రికల్చర్‌లో 80,766 మంది పరీక్షలు రాస్తే 70,352(87.11శాతం) అర్హత సాధించారు. ఈ పరీక్షల్లో ఈఏపీసెట్ పేపరుకు 75శాతం, ఇంటర్ మార్కులకు 25శాతం వెయిటేజీ ఇచ్చారు. ఇంజనీరింగ్‌లో అబ్బాయిలు 73.93శాతం, అమ్మాయిలు 77.65శాతం, అగ్రికల్చర్‌లో అబ్బాయిలు 87.98శాతం , అమ్మాయిలు 86.81శాతం మంది అర్హత సాధించారు. గతేడాది ఇంజనీరింగ్ విభాగంలో 76.32శాతం, అగ్రికల్చర్ లో 89.65శాతం మంది అర్హులయ్యారు.

ఇంజనీరింగ్ టాపర్లు

ఇంజనీరింగ్‌లో గుంటూరు జిల్లాకు చెందిన మాకినేని జిష్ణు సాయి టాప్ ర్యాంకు సాధించాడు. కర్నూలు జిల్లా విద్యార్థి ఎం.ఎస్.యశ్వంత్ రెడ్డి ద్వితీయ ర్యాంకు, అదే జిల్లాకు చెంది భోగలపల్లి సందేశ్ తృతీయ ర్యాంకు సాధించారు. పాలగిరి సతీశ్‌రెడ్డి(అనంతపురం) నాలుగో ర్యాంకు, కోటమనేని మనీశ్‌చౌదరి(గుంటూరు) ఐదో ర్యాంకు, ఇ. లక్ష్మీ నరసింహారెడ్డి(సిద్దిపేట, తెలంగాణ) ఆరో ర్యాంకు, గొల్ల లేఖ హర్ష(కర్నూలు) ఏడో ర్యాంకు, పుట్టి కుశాల్‌కుమార్(అనంతపురం) ఎనిమిదో ర్యాంకు, పి.సుశాంత్(హన్మకొండ, తెలంగాణ) తొమ్మిదో ర్యాంకు, కొమ్మిశెట్టి ప్రభాస్(ప్రకాశం) పదో ర్యాంకు సాధించారు.

అగ్రికల్చర్ టాపర్లు

అగ్రికల్చర్‌లో హైదరాబాద్‌కు చెందిన వై. శ్రీశాంత్ రెడ్డి 1వ ర్యాంకు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పూల దివ్య తేజ ద్వితీయ ర్యాంకు, తిరుపతికి చెందిన వి.ముఖేశ్ చౌదరి తృతీయ ర్యాంకు, పేర సాత్విక్(చిత్తూరు) నాలుగో ర్యాంకు, అలూరు ప్రణీత(అన్నమయ్య) ఐదో ర్యాంకు, గట్టు భాను తేజ సాయి(అనంత) ఆరో ర్యాంకు, పి. నిహారికారెడ్డి(హైదరాబాద్) ఏడో ర్యాంకు, ఎస్. మనో అభిరామ్(విశాఖ) ఎనిమిదో ర్యాంకు, ఎస్. పావని(విశాఖ) తొమ్మిదో ర్యాంకు, ఎస్. రాధాకృష్ణ(పార్వతీపురం) పదో ర్యాంకు సాధించారు.

త్వరలోనే అడ్మిషన్లు

ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియను త్వరలో చేపట్టనున్నట్లు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 24 వేల మంది అదనంగా అర్హత సాధించారని ఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈసారి కంప్యూటర్ సైన్స్(సీఎస్ఈ) సీట్ల సంఖ్య లక్షకు చేరే అవకాశం ఉంది. గతేడాది ఇంజనీరింగ్ సీట్లు 1.6 లక్షలుంటే అందులో 75 వేల వరకు సీఎస్ఈ సీట్లే ఉన్నాయి. ఈ ఏడాది పరిమితి ఎత్తివేయడంతో కాలేజీలన్నీ సీఎస్ఈ సీట్లు భారీగా పెంచుకున్నాయి.

ముంబై ఐఐటీ తొలిప్రాధాన్యం

ఐఐటీలో చదవడమే తన లక్ష్యమని ఎం.జిష్ణుసాయి పేర్కొన్నారు. ఐఐటి జేఈఈ అడ్వాన్స్‌లో ఓపెన్ కేటగిరీలో 62వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌లో ముంబై ఐఐటీలో సీఎస్ఈ బ్రాంచ్‌కు మొదటి ఆప్షన్ ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు జ్యోతి, కృష్ణమోహన్‌ల ప్రోత్సాహంతో ఇంతటి స్థాయిలో ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఐసీఎస్ఈ సిలబస్‌లో పది పూర్తిచేసినట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో 18వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 62వ ర్యాంకు సాధించానని, కాలేజీలో రోజువారీ, వీక్లీ టెస్టులు, అధ్యాపకులు ఇచ్చిన సూచనలు పాటించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా మెరుగైన ర్యాంకు సాధించినట్లు వివరించారు.

- మొదటి ర్యాంకర్ జిష్ణుసాయి

ఒత్తిడిని అధిగమించి పరీక్షలకు సన్నద్ధం

ఒత్తిడి అధిగమించి పరీక్షలకు సన్నదం కావడం వల్లే ఏపీఈఏపీసెట్‌లో 2వర్యాంకు, జేఈఈ అడ్వాన్స్‌లో 50వ ర్యాంకు సాధించినట్లు ఎం సాయియశ్వంత్‌రెడ్డి వెల్లడించారు. ముంబై ఐఐటీలో సీఎస్ఈలో సీటు సాధనే లక్ష్యమని తెలిపారు. స్వస్థలం కర్నూలు, ఇక్కడ భాష్యంలో చదువుకున్నాను. తండ్రి రామేశ్వర్‌రెడ్డి స్కూల్ బ్యాగులు కుడతారు. తల్లి అరుణ గృహిణి. 6వ తరగతి నుంచి గుంటూరులోని జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. జేఈఈ మెయిన్స్‌లో 36వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 50వ ర్యాంకు సాధించాను. అయితే అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకు కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో హాజరయ్యాను. కాలేజీలో ఇచ్చిన ప్లానింగ్ ప్రకారం చదువుకుని, డైలీ, వీక్లీటెస్టులతో ముందుకు వెళ్లడం ద్వారా మంచి మార్కులు స్కోర్ చేయవచ్చని తెలిపారు.

- సాయియశ్వంత్‌రెడ్డి 2వ ర్యాంకు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 12-6-2024 | పేజీలు: 14 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 57 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 7.17 తదుపరి సప్తమి; నక్షత్రం: మఖ రా. 2.12 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ. 12.55-2.41; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.41; అమృతఘడియలు: రా. 11.32-1.19; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రవితేజ 75వ సినిమా!

స్వయంకృషితో స్టార్ ఎదిగిన నటుడు రవితేజ. కామెడీ టైమింగ్‌లో, విలక్షణమైన డైలాగ్ డెలివరీతో ఆడియన్స్‌ను ఆకట్టుకొన్న ఆయన కొత్త చిత్రం మంగళవారం ప్రారంభమైంది. ఇది ఆయనకు 75వ సినిమా కావడం విశేషం. సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న శ్రీలీల క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించడం విశేషం. ఈ చిత్రంతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య' చిత్రానికి మాటల రచయితగా, 'సామజవరగమన' సినిమాకు స్ర్కీన్‌ప్లే రచయితగా పని చేసి మంచి గుర్తింపు పొందిన భాను భోగవరపు ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న 109వ చిత్రానికి మాటలు రాస్తున్నారు. ఆ చిత్రం నిర్మాణంలో ఉండగానే ఆయనకు దర్శకుడిగా అవకాశం రావడం గమనార్హం. పలు విజయవంతమైన చిత్రాలను నిర్మిస్తున్న సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినోదంతో కూడిన పూర్తి మాస్ పాత్రలో రవితేజను చూడాలని కోరుకుంటున్న ఆయన అభిమానులకు ఈ సినిమా ఫుల్ జోష్ ఇస్తుందని దర్శకనిర్మాతలు వెల్లడించారు. మంగళవారం నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్.



సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె వివాహం

సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె ఐశ్వర్య వివాహం సోమవారం రాత్రి చెన్నైలో జరిగింది. అర్జున్ నిర్మించిన యోగాంజనేయస్వామి దేవాలయంలోనే ఈ పెళ్లి సంప్రదాయబద్ధంగా జరిగింది. తమిళ హాస్యనటుడు తంబి రామయ్య కుమారుడు ఉమాపతి పెళ్లి కొడుకు. కొన్ని తమిళ చిత్రాల్లో హీరోగా నటించారు. ఉమాపతి, ఐశ్వర్యల నిశ్చితార్థం గత ఏడాది అక్టోబర్‌లో జరిగింది. ఈ పెళ్లికి విశాల్, కార్తి, సముద్రఖని, కె.ఎస్.రవికుమార్, ఎస్.ఆర్.ప్రభు, విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ నెల 14న చెన్నైలో రిసెప్షన్ ఏర్పాటు చేస్తున్నారు.

విశాల్ హీరోగా నటించిన సినిమాతో ఐశ్వర్య హీరోయిన్‌గా పరిచయమైంది. కానీ ఆమె నటిగా సక్సెస్ కాలేకపోయింది.

ఆమెను తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయం చేసే ఉద్దేశంతో స్వీయ దర్శకత్వంలో అర్జున్ కొన్ని నెలల క్రితం ఓ సినిమాను హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభించారు. అయితే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లే లోపే అందులో హీరో విష్వక్‌సేన్ ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో సినిమా ఆగిపోయింది.

రాయన్ రాక ఖాయం




హీరో ఇమేజ్‌ను పక్కనపెట్టి ఎలాంటి పాత్రలో అయినా ఇట్టే ఇమిడిపోయే నటనా చాతుర్యం ధనుశ్ సొంతం. తమిళ చిత్రాలతో మొదలైన ఆయన నట ప్రస్థానం హాలీవుడ్ దాకా చేరింది. కోట్లాది మంది అభిమానుల ఆదరణ సొంతం చేసుకుంది. 'ఇంత సాధించాం ఇక చాల్లే' అనుకోకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఆయన త్వరలో తన 50వ చిత్రం 'రాయన్'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ సినిమాను ధనుశ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సన్‌పిక్చర్స్ నిర్మిస్తోంది. మేకర్స్ మంగళవారం రిలీజ్‌డేట్‌ను ప్రకటించారు. జూలై 26న 'రాయన్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ శక్తిమంతమైన లుక్‌లో కనిపించారు. కాళిదాస్ జయరామ్, ఎస్.జె సూర్య, సెల్వ రాఘవన్, అపర్ణ బాలమురళి, ధుషార విజయన్ ప్రధాన తారాగణం. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాశ్. ఎడిటర్: ప్రసన్న జీకె

యేవమ్ అందరికీ మంచి బ్రేక్ ఇస్తుంది




చాందిని చౌదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి నవదీప్, గోపరాజు నిర్మాతలు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ "నేను బాగా గౌరవం ఇచ్చే కోస్టార్స్‌లో చాందిని ఒకరు. పలువురు మహిళలు ఉన్న ఈ సినిమా టీమ్‌ను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. అందరికీ ఈ చిత్రం మంచి బ్రేక్‌నిస్తుంది" అని అన్నారు. డైరెక్టర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ "ఇదొక డిఫరెంట్ థ్రిల్లర్. ఇంటర్వెల్, పతాక సన్నివేశాలు ఊహించని విధంగా ఉంటాయి" అని చెప్పారు. "మనసుపెట్టి, నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా" అని నిర్మాత నవదీప్ అన్నారు. చిత్ర దర్శకుడు ప్రకాశ్ దంతులూరి మాట్లాడుతూ "ఆసక్తికరంగా ఉండే వినోదాత్మక థ్రిల్లర్ 'యేవమ్'" అని చెప్పారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ "ఇందులో నాది పోలీస్ పాత్ర అనగానే యాక్షన్ ఓరియెంటెడ్‌గా ఉంటుందని అనుకున్నాను. అయితే యాక్షన్‌తో పాటు అన్ని షేడ్స్ నా పాత్రలో ఉన్నాయి" అని చెప్పారు.

రౌడీ రిలీజ్‌కు రెడీ



కేజీఎఫ్ ఫేమ్ యశ్ హీరోగా నటించిన ఓ కన్నడ చిత్రం 'రాజధాని రౌడీ' పేరుతో తెలుగులో విడుదలవుతోంది. షీనా కథానాయిక. కేవీ రాజు దర్శకుడు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలవుతోంది. సంతోష్ ఎంటర్టైన్‌మెంట్స్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మాదక ద్రవ్యాలు, మద్యపానం బారినపడిన నలుగురు యువకులు తమ జీవితాలను ఎలా నాశనం చేసుకున్నారు అనే పాయింట్ చుట్టూ కథ సాగుతుంది. వినోదానికి చక్కటి సందేశాన్ని జోడించి తెరకెక్కించాం' అని తెలిపారు. 'ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్ పోలీస్ ఆఫీసర్‌గా కీలకపాత్రలో నటించారు. ముమైత్‌ఖాన్ పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉంటుంది' అని దర్శకుడు అన్నారు.



మా అమ్మాయి పెళ్లి విషయం నాకు తెలియదు

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా పెళ్లిపై వస్తున్న వార్తలపై ఆమె తండ్రి శత్రుఘ్న సిన్హా స్పందించారు. "సోనాక్షి, జహీర్ ఇక్బాల్ పెళ్లి విషయం నాకు తెలియదు. ఆ విషయాన్ని అందరిలాగే పత్రికల్లో చదివే నేనూ తెలుసుకున్నా. ఒకవేళ ఈ పెళ్లి విషయం నాకు చెపితే.. నేనూ, నా భార్య పూనమ్ కలసి ఆ జంటను దీవించడానికి సిద్ధం. ఈ కాలం పిల్లలు తల్లితండ్రులకి చెప్పి నిర్ణయాలు తీసుకోవట్లేదు. అనుమతులు కోరకుండా.. అనుకున్నది చేయడానికి సమాచారం మాత్రమే ఇస్తున్నారు. నా కూతురు ఎటువంటి తప్పుడు నిర్ణయం తీసుకోదని నాకు తెలుసు. ఆమెకు ఏది తప్పో.. ఏది ఒప్పో తెలుసు. తాను పెళ్లి చేసుకోవాలన్న విషయమే నిజమైతే.. వారి నిర్ణయాన్ని స్వాగతిస్తా" అని చెప్పారు. కాగా, సోనాక్షి సిన్హా తన బాయ్‌ఫ్రెండ్ జహీర్ ఇక్బాల్‌ను ఈ నెల 23న పెళ్లాడుతున్నట్లు కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే.

ప్రియురాలి కోసం హత్య..

సినిమా క్లైమాక్స్‌లో నేరం చేసిన విలన్‌ను హీరో కటకటాల్లోకి నెట్టడం మనం అనేక సినిమాల్లో చూసిందే. అయితే ఈసారి మాత్రం సీన్ రివర్స్ అయింది. వెండితెరపై హీరోగా అభిమానుల ప్రశంసలు అందుకుంటున్న వ్యక్తి కాస్తా హత్యకేసులో ముద్దాయిగా ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. మన పొరుగునే ఉన్న కన్నడ చిత్ర పరిశ్రమలో జరిగిందీ ఘటన.



కన్నడ హీరో దర్శన్ అరెస్ట్

ప్రియురాలి కోసం ఓ వ్యక్తిని హత్య చేయించారన్న ఆరోపణలతో ప్రముఖ కన్నడ హీరో దర్శన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నటి పవిత్ర గౌడతో దర్శన్ సన్నిహితంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో పవిత్రకు అసభ్యకర సందేశాలు పంపిన రేణుకాస్వామి (33) దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య కన్నడ ఇండస్ట్రీని కుదిపేసింది. దర్శన్ సూచనల మేరకే ఈ హత్య జరిగినట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మైసూర్‌లో దర్శన్‌ను, ఆయన ప్రియురాలు పవిత్ర గౌడను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దీంతో ఇప్పటివరకు రేణుకాస్వామి హత్య కేసులో సంబంధం ఉన్న మొత్తం 13 మందిని అరెస్టు చేసినట్టు మంగళవారం ప్రకటించారు. రేణుకాస్వామి ఓ మెడికల్ షాపులో పనిచేసేవాడు. ఆయన ఇటీవల పవిత్రగౌడపై సోషల్ మీడియాలో అసభ్య సందేశాలు పోస్టు చేశారని ఆరోపణలున్నాయి. ఇదే విషయాన్ని ఆమె నటుడు దర్శన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చిత్రదుర్గలోని దర్శన్ అభిమాన సంఘం ముఖ్యుడు రాఘవేంద్రకు సమాచారం ఇచ్చి, రేణుకాస్వామిని బెంగళూరుకు రప్పించారు. కామాక్షిపాళ్యలోని దర్శన్ అనుచరుడికి చెందిన కారు షెడ్‌లో ఈ నెల 8న రేణుకాస్వామిపై దాడి చేసి చంపేశారు. అనంతరం ఆ మృతదేహాన్ని కారు షెడ్ సమీపంలోని ఓ మురుగు కాలువలో పడేశారు. దాడి సమయంలో దర్శన్ కూడా అక్కడే ఉన్నట్లు తెలిసింది. ఈ నెల 9న స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. అక్కడి అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ గార్డు కామాక్షిపాళ్య పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు తొలుత ఆత్మహత్యగా భావించారు. కానీ, శరీరంపై ఉన్న గాయాల ఆధారంగా హత్యగా అనుమానించి.. ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలతో మృతుడిని రేణుకాస్వామిగా గుర్తించారు. ఈ నేపథ్యంలో గిరినగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు కామాక్షిపాళ్య పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. ఆర్థిక లావాదేవీల కారణంగా హత్య చేశామని పోలీసులకు తెలిపారు. పోలీసులు సోమవారం తమదైన శైలిలో విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పవిత్రగౌడకు రేణుకా స్వామి అశ్లీల మెసేజ్‌లు పంపించాడని, నటుడు దర్శన్ సూచనల మేరకు అతనిపై దాడి చేశామని తెలిపారు. తదుపరి దర్యాప్తులో 11 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ హత్యతో సంబంధం ఉన్న దర్శన్, పవిత్రలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పవిత్రగౌడ ఏ1 కాగా, దర్శన్ ఏ2గా ఉన్నారు. వారిని మంగళవారం సాయంత్రం 24వ ఏసీఎంఎం కోర్టు ముందు హాజరు పరిచారు. కాగా, అరెస్టు తర్వాత దర్శన్ మీడియాతో మాట్లాడుతూ.. తాను ఎటువంటి తప్పు చేయలేదని, రేణుకాస్వామిని హెచ్చరించి వెళ్లిపోయానని అన్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదన్నారు.

– బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

కథ కాదు... అలరించే అనుభవం



జగదీశ్ కేకే దర్శకత్వంలో శ్రీపాద క్రియేషన్స్ బేనర్‌పై రూపొందుతోన్న రెండో చిత్రానికి 'తుఫాను హెచ్చరిక' అనే టైటిల్ ఖరారైంది. డాక్టర్ శ్రీనివాస్ కిషన్, డాక్టర్ రజనీకాంత్, సన్నీ బన్సల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం మేకర్స్ టైటిల్‌ను ప్రకటించి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ కేకే మాట్లాడుతూ 'ఈ చిత్రం ఒక కథ కాదు... అలరించే అనుభవం. హిల్ స్టేషన్‌లో జీవించే సాధారణ యువకుడి జీవితంలో తుఫాను లాంటి విధ్వంసం జరిగితే, ఆ పరిస్థితుల నుంచి అతను ఎలా బయటపడ్డాడు అనే అంశం చుట్టూ కథ నడుస్తుంది. వర్షంలో కీలక సన్నివేశాలను తెరకెక్కించడంలో మా సాంకేతిక నిపుణులు, నటీనటులు చక్కని సమన్వయంతో పనిచేసి, మంచి అవుట్‌పుట్ రాబట్టారు. ఏడాది కష్టం ఈ సినిమా. త్వరలో వెండితెరపై చూడబోతున్నారు' అన్నారు. ఈ ఉత్కంఠభరిత చిత్రంలో ప్రతి మలుపు ప్రేక్షకులను అలరిస్తుంది అని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి ఆర్ కే నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

క్లైమాక్స్ ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది



'సెహరి' సినిమాతో దర్శకుడిగా తొలి చిత్రంతోనే ప్రేక్షకుల దగ్గర మంచి మార్కులు కొట్టేశారు జ్ఞానసాగర్ ద్వారక. ఆయన దర్శకత్వం వహించిన రెండో సినిమా 'హరోం హర'. సుధీర్‌బాబు నటించిన ఈ చిత్రాన్ని సుమంత్.జి.నాయుడు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక మీడియాతో ముచ్చటించారు. "యాక్షన్ సినిమాలు చేయడమంటే నాకు చాలా ఇష్టం. 'హరోంహర' ఒక న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా. 1990ల నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ చిత్రంలో చాలా మాస్ ఎలిమెంట్స్, ఎలివేషన్స్ ఉంటాయి. వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ కథను రాసుకున్నాను. ఇందులో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేసే కథానాయకుడు.. గన్ మేకింగ్ మొదలుపెట్టి పవర్‌ఫుల్ సుబ్రమణ్యంగా ఎలా మారాడన్నది సినిమా కథ. లవ్, యాక్షన్, ఎమోషన్, సెంటిమెంట్‌తో పాటు ఆధ్యాత్మిక అంశాలు కూడా ఉంటాయి. సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది. కుప్పం యాసలో ఆయన ఇరగదీశారు. సినిమాకు మ్యూజిక్, విజువల్స్ బాగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో చూస్తున్న ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తుంది. క్లైమాక్స్ అయితే ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని చెప్పారు.

షూటింగ్ ముగిసింది



అశోక్‌గల్లా కథానాయకుడిగా నటిస్తున్న రెండో చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. ఇందులో ఆయన మాస్ పాత్రలో కనిపించనున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రానికి అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసినట్లు యూనిట్ మంగళవారం తెలిపింది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తామని చెప్పారు. ఈ చిత్రానికి సాయి మాధవ్ బుర్రా సంభాషణలు, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రసూల్ ఎల్లోర్, ప్రసాద్ మూరెళ్ల

సీతాకోక చిలుకై ఎగిరింది



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నేను కీర్తన'. రిషిత, మేఘన కథానాయికలు. సీ లక్ష్మీకుమారి నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం నుంచి 'సీతాకోక చిలుకై ఎగిరింది మనసే' అంటూ సాగే యుగళ గీతాన్ని నిర్మాత సాయి రాజేశ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ 'ఫస్ట్‌కాపీ సిద్ధమైంది. పాటలు, ఫైట్స్ మా చిత్రానికి ప్రత్యేకాకర్షణ. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. సంధ్య, జీవా, జబర్దస్త్ అప్పారావు కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎల్ రాజా, సినిమాటోగ్రఫీ: కె. రమణ

ఒకే రోజు రెండు సినిమాలు



దిలీప్‌కుమార్ రాథోడ్, అరవింద అగర్వాల్, షణ్ను హీరోహీరోయిన్లుగా నటించే 'సన్నాఫ్ సునామీ', 'బాల తేజం' చిత్రాల షూటింగ్ మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. చిత్తజల్లు ప్రసాద్ దర్శకుడు. చిత్ర నిర్మాత కృష్ణప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మా బేనరులో ఒకే రోజు రెండు సినిమాలు ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఇవి కాకుండా మరో రెండు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమాలు నిర్మిస్తున్నాం' అని తెలిపారు. నాలుగు చిత్రాల్లో వరుసగా నటించే అవకాశం కల్పించిన నిర్మాతకు హీరో దిలీప్‌కుమార్ రాథోడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రానికి పాటలు: గడ్డ సీతారామ చౌదరి, సంగీతం: లక్ష్మణ్ సాయి, ఫొటోగ్రఫీ: నితీశ్, సహ నిర్మాత: చెన్నై బ్రహ్మ.

సీతా కల్యాణ వైభోగమే



సుమన్ తేజ్, గరీమ చౌహాన్ జంటగా నటించిన 'సీతా కల్యాణ వైభోగమే' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. సతీశ్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను 'బలగం' చిత్రనిర్మాత హర్షిత్‌రెడ్డి ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. దర్శకుడు సతీశ్ పరమవేద మాట్లాడుతూ 'హర్షిత్‌రెడ్డి కజిన్ సుమన్ తేజ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నాం. నిర్మాత యుగంధర్‌కు సినిమా అంటే ఎంతో ప్యాషన్. కుటుంబసమేతంగా చూసే విధంగా మా చిత్రం ఉంటుంది' అని చెప్పారు. సినిమాను ఆదరించాలని నిర్మాత యుగంధర్ కోరారు. అందరినీ అలరించే చిత్రమిదని సుమన్ తేజ్ చెప్పారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-6-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

పాఠశాలలకు సెలవు

రేపటి నుంచి తెరవాలని కలెక్టర్ ఆదేశం

కృష్ణలంక, జూన్ 11 : చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా ఉండేందుకు విజయవాడ సిటీ, విజయవాడ రూరల్ పరిధిలోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర సెంట్రల్ బోర్డు ప్రైవేట్ విద్యాసంస్థలతో సహా అన్ని ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ సూచనలు పాటించాలని కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి జూన్ 12కి బదులుగా అన్ని పాఠశాలలు జూన్ 13 నుంచి తెరవాలని పాఠశాల విద్యాశాఖకు కూడా మెమో ఇచ్చినట్టు తెలిపారు.

నేడే చంద్రాభిషేకం

సర్వం సిద్ధం చేసిన అధికారులు

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి సిద్ధమైన కేసరపల్లి

- అర లక్ష మంది కూర్చునేలా ఏర్పాట్లు
- ప్రాంగణంలో మరో అర లక్ష మంది వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్లు
- 36 గ్యాలరీల్లో ప్రత్యేక ఆహ్వానితులకు ప్రవేశం
- వీవీఐపీల కోసం విమానాశ్రయంలో 12 హెలీప్యాడ్లు


సిద్ధమైన ప్రమాణస్వీకార వేదిక


బొకేలు సిద్ధం చేస్తున్న సిబ్బంది


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసులు

ఐదేళ్లపాటు అవమానాలు తట్టుకుని.. దూషణలు.. దాడులు.. కేసులను ఎదుర్కొని.. అభివృద్ధిలేక కునారిల్లుతున్న ఆంధ్రాను గాడిలో పెట్టేందుకు నేనున్నానంటూ ఏడు పదుల వయసులో పడిలేచిన కెరటంగా దూసుకొచ్చిన జననేత ఆయన. రాష్ట్రాన్ని అభివృద్ధివైపు పరుగులు పెట్టించే నాయకుడిగా భావించిన ప్రజలు చరిత్రలో కనీవినీ ఎరుగని తీరిలో అఖండ విజయాన్ని అందించి సీఎం సింహాసనం వేశారు. ఆ మహారాజు చంద్రబాబు నాయుడికి పట్టాభిషేకం చేసే రోజురానే వచ్చింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవానికి గన్నవరం దగ్గర కేసరపల్లి ఐటీ పార్క్ సమీప ప్రాంగణం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. మరికొద్ది గంటల్లోనే తన రాజకీయ జీవితంలో నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు పట్టాభిషిక్తుడు కానున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ /గన్నవరం

డయాస్‌పై 60 మందికి వీలుగా..

చంద్రబాబు ప్రమాణ స్వీకార డయాస్‌పై 60 మంది వరకు కూర్చునే విధంగా ఏర్పాటు చేశారు. డయాస్‌కు అభిముఖంగా 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న 3 జర్మనీ హ్యాంగర్స్ టెంట్లు వేశారు. డయాస్‌కు ముందు భాగాన జర్మనీ హ్యాంగర్స్ టెంట్లలో 50 వేల మంది కూర్చోవటానికి వీలుగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. టెంట్లు కాకుండా ప్రాంగణంలో ఓపెన్‌గా కూడా భారీగా ప్రజలు వచ్చే అవకాశం ఉండటంతో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఓపెన్‌గా మరో 50 వేల మంది ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పది దేశాల నుంచి రాయబారులు వస్తున్నారు.

మూడు మెగా వేదికలు.. 36 గ్యాలరీలు

ప్రమాణ స్వీకారోత్సవానికి మూడు మెగా వేదికలను ఏర్పాటు చేశారు. ఈ మూడు వేదికల్లో ప్రత్యేక ఆహ్వానితులు, ఎంవీఐపీలు, వీవీఐపీలు, వీఐపీల కోసం మొత్తంగా 36 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకార డయాస్‌కు ఎడమవైపు వేదిక ముందు వరసన జాతీయ మీడియా సభ్యులు 250 మందికి, జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు 400 మందికి కలిపి మొదటి గ్యాలరీని కేటాయించారు. మొదటి వేదికలోని రెండో గ్యాలరీని పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల కోసం 650 సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. డయాస్‌కు అభిముఖంగా ఉండే మధ్య వేదికలో 3వ గ్యాలరీని చంద్రబాబు కుటుంబ సభ్యుల కోసం 300 మందికి సరిపడా ఒక గ్యాలరీని ఏర్పాటు చేశారు. దీనికి పక్కనే పవన్‌కల్యాణ్ కుటుంబ సభ్యుల కోసం 300 మందికి సరిపడా 4వ గ్యాలరీని ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్యాలరీల మధ్య ఉండే ఖాళీలో 300 మందికి సరిపడా అమరావతి రాజధాని నిర్మాణానికి సహకరించిన దాతల కోసం గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ గ్యాలరీ వెనుక మీడియా పాయింట్ కోసం ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేశారు. మిగతా 2లో

పార్కింగ్ ఏర్పాట్లు ఇలా

జ్యూవెల్ కౌంటీ సమీపంలోని ఎలైట్ విస్తాలో ఎంపీలు, ఎంఎల్ఏలు, ఎమ్మెల్సీల కుటుంబ సభ్యులకు పార్కింగ్ ప్లేస్ కేటాయించారు. ఇక్కడి నుంచి వీరందరినీ అమరావతి ఏసీ బస్సులలో సభా ప్రాంగణానికి తరలిస్తారు. కేసరపల్లి విల్లా సమీపంలో వీవీఐపీల కోసం పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం వెటరినరీ కాలేజీలో పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టారు. ఇతరులకు సంబంధించి మేధా ఐటీ టవర్ రోడ్డు వెంబడి ఖాళీ స్థలాన్ని కేటాయించారు. ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులకు కేటాయించిన పార్కింగ్‌లో వాహనాలు నిలిపి అక్కడి నుంచి బస్సుల్లో సభా వేదిక వద్దకు తీసుకువస్తారు. ప్రధాని, ఇతర రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు విమానాశ్రయం నుంచి నేరుగా స్టేజీ వెనుక నుంచి లోపలికి వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి జిల్లాలో చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ అయ్యే విధంగా ఏర్పాటు చేస్తున్నారు.

సిద్ధం చేసి ఉన్న వీఐపీ పార్కింగ్ స్థలం



ఎంవీఐపీలు, వీవీఐపీల కోసం ఎయిర్‌పోర్టులో 12 హెలీప్యాడ్లు

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వచ్చే ప్రత్యేక అతిథులు, జాతీయ పారిశ్రామికవేత్తలు, దౌత్యవేత్తలు తదితరులు ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లలో తరలిరానున్నారు. ప్రత్యేక హెలీకాప్టర్లలో వచ్చే వారి కోసం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మొత్తం 12 హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు. విజయవాడ ఎయిర్‌పోర్టు రన్‌వే మీద అన్ని సందర్భాల్లో ల్యాండింగ్ చేయటం వీలు పడదు కాబట్టి ప్రత్యామ్నాయంగా 12 హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు.

రోడ్డుకు ఇరువైపులా టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు





ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ కేశినేని శివనాథ్

బాబు ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు పూర్తి

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, జూన్ 11 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్న ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చెప్పారు. చంద్రబాబు పట్టాభిషేకానికి సర్వం సిద్ధమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మేధ టవర్స్ పక్కన 17 ఎకరాలలో జరుగుతున్న ఏర్పాట్లను, వేదికను ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజుతో కలిసి ఆయన పరిశీలించారు. వీవీఐపీ, వీఐపీ గ్యాలరీల వద్ద ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ప్రాంగణంలో మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ తదితరాలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రొటోకాల్ పరంగా ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్ ఉన్నతాధికారులకు సూచించారు. చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని పార్టీశ్రేణులు, అధికారులకు సూచించారు. ఎక్కడ ఏ విధమైన లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు.

సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక 'విద్యుత్' ఏర్పాట్లు



విజయవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం కేసరపల్లి వద్ద బుధవారం జరిగే చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి విద్యుత్ అంతరాయం లేకుండా సీపీడీసీఎల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు దేశ విదేశాల నుంచి ప్రతినిధులు వస్తుండటంతో విద్యుత్ సరఫరాతోపాటు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సభా ప్రాంగణం వద్ద 315 కేవీఏ సామర్థ్యం కలిగిన ఐదు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద 25 కేవీఏ సామర్థ్యం కలిగిన నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. అదేవిధంగా ఎల్‌ఈడీ ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లలో దేనిలో అయినా సాంకేతిక సమస్య వస్తే ప్రత్యామ్నాయంగా 125 కేవీఏ సామర్థ్యం కలిగిన పది జనరేటర్లను అందుబాటులో ఉంచారు. ఈ ఏర్పాట్లను సీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు మంగళవారం పర్యవేక్షించారు.

విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

గన్నవరం, జూన్ 11 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ప్రధాని మోదీ గన్నవరం పర్యటన నేపథ్యంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎస్పీజీ ఐజీ నవనీత్‌కుమార్ మెహతా అధికారులకు సూచించారు. మంగళవారం గన్నవరం విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లపై ఏఎస్ఎల్ నిర్వహించారు. విమానాశ్రయం నుంచి మేధా టవర్స్ ప్రక్కన ప్రమాణస్వీకార సభా ప్రాంగణం వరకూ ట్రయల్ రన్ నిర్వహించారు. కాన్వాయ్ రాకపోకలపై రూట్ మ్యాప్ పరిశీలించి కాన్వాయ్‌కు అడ్డంకులు లేకుండా చూడాలని చెప్పారు. ప్రత్యేకాధికారులు హరికిరణ్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అదనపు ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రయాణికులకు ముందస్తు జాగ్రత్తలు

చంద్రబాబు ప్రమాణస్వీకారం నేపథ్యంలో విమాన ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గన్నవరం విమానాశ్రయ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విమానాశ్రయ సమీపంలోనే ప్రమాణస్వీకార ప్రాంగణం ఉన్నందున, ప్రధాని మోదీతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని, భద్రత కారణాల రీత్యా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించే అవకాశం ఉందన్నారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకూ షెడ్యూల్ చేయబడిన విమానాల్లో ప్రయాణికులు ఉదయం 9.30 గంటలలోపు విమానాశ్రయానికి చేరుకోవాలని సూచించారు. ప్రయాణికులు, వారిని దించడానికి, తీసుకెళడానికి వాహనాలతో వచ్చేవారు కూడా ఉదయమే విమానాశ్రయానికి చేరుకోవాలని కోరారు.

10వేల మందితో భారీ బందోబస్తు

కృష్ణా జిల్లా నుంచి 7వేల మంది.. పోలీసు కమిషనరేట్ నుంచి 3వేలమంది

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 10వేల మందిని దీనికోసం ఉపయోగిస్తున్నారు. కృష్ణా జిల్లా నుంచి 7వేల మంది, పోలీసు కమిషనరేట్ నుంచి 3వేల మందిని బందోబస్తు విధులకు కేటాయించారు. సభా ప్రాంగణం నుంచి 25 కిలోమీటర్ల మేర బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆహ్వానాలు అందుకున్న ప్రతినిధులు మంగళవారం సాయంత్రానికే విజయవాడకు చేరుకున్నారు. ప్రముఖులు బసచేసే స్టార్ హోటళ్ల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. వివిధ దేశాల కాన్సులేట్ కార్యాలయాల నుంచి వచ్చే ప్రతినిధుల బస చేసే హోటళ్ల వద్ద నిఘాను కట్టుదిట్టం చేశారు. విజయవాడ నుంచే ప్రతినిధులు బుధవారం సభా ప్రాంగణానికి చేరుకుంటారు. వాళ్లందరికీ పోలీసులు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేయబోతున్నారు. కేసరపల్లిలో నిర్వహించే సభకు వెళ్లే ప్రతినిధులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా నగరంలోని ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే ఆంక్షలు అమలు చేయనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలవరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. రామవరప్పాడు రింగ్ వద్ద చెక్‌పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ పాసులు ఉన్న వాహనాలను తనిఖీ చేసి కేసరపల్లి వైపునకు పంపుతారు.

పాస్‌లు ఉన్న వాహనాలకే అనుమతి

విజయవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి పాస్‌లు ఉన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తామని పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ మంగళవారం వెల్లడించారు. గన్నవరం వైపునకు వెళ్లే వాహనాలను తనిఖీ చేయడానికి రామవరప్పాడు జంక్షన్ వద్ద చెక్‌పాయింట్ ఏర్పాటు చేశారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరుతోపాటు ఎన్టీఆర్ జిల్లాల నుంచి గన్నవరం వెళ్లే వాహనాలను ఇక్కడ తనిఖీ చేస్తారు. పాస్‌లు ఉన్న బస్సులు, వాహనాలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ● విజయవాడ నుంచి ఏలూరు వైపునకు వెళ్లే బస్సులు, ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు, కారులను తెల్లవారుజామున ఐదు గంటల నుంచి మార్గం మళ్లిస్తారు. ఈ వాహనాలను బెంజ్‌సర్కిల్, కంకిపాడు, పామర్రు, హనుమాన్ జంక్షన్ మీదుగా మళ్లిస్తారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ మళ్లింపులు ఉంటాయి. ● వాహనాలు పీసీఆర్ జంక్షన్, ఏలూరు రోడ్డు, స్వర్ణప్యాలెస్, రామవరప్పాడు రింగ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా హనుమాన్ జంక్షన్‌కు వెళ్లవచ్చు. ● గొల్లపూడిలోని ఔటర్ రింగ్ రోడ్డు నుంచి గన్నవరం, హనుమాన్ జంక్షన్ వరకు వెళ్లవచ్చు.

చంద్రబాబుకు ఎంపీ కేశినేని చిన్ని శుభాకాంక్షలు



వన్‌టౌన్ : విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగిన ఎన్డీఏ కూటమి శాసనసభాపక్ష నేత చంద్రబాబునాయుడుకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా విచ్ఛిన్నమైన రాష్ట్రాన్ని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా తిరిగి గాడిలో పెడతారని పేర్కొన్నారు.



ఇంద్రకీలాద్రిపై మొక్కులు తీర్చుకున్న సారిపల్లి వినయ్, దేవర కల్యాణ్

మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

వన్‌టౌన్, జూన్ 11 : ఎన్డీఏ అధికారం అధికారం చేపట్టిన సందర్భంగా టీడీపీ నేతలు సారిపల్లి వినయ్, దేవర కల్యాణ్‌లు మంగళవారం కనకదుర్గమ్మవారికి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), ఈగల సాంబ, సుకాశి కిరణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతోనే రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిందని, సుజనా చౌదరి భారీ మెజారిటీతో గెలిచారని చెప్పారు.

ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్



గన్నవరం, జూన్ 11 : చంద్రబాబు ప్రమాణస్వీకారం ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పరిశీలించారు. ప్రధాన వేదిక, ప్రాంగణం సుందరీకరణ, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం, పటిష్ట భద్రత, 36 గ్యాలరీలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలని సూచించారు. ట్రిపుల్ ఏ కేటగిరిలో ఉన్న గ్యాలరీలలో ప్రత్యేక ఏర్పాట్లు పరిశీలించారు. విమానాశ్రయం రన్‌వే నుంచి నేరుగా ప్రధాని, ఇతర ప్రముఖులు వచ్చే మార్గాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు సీఎస్ వెంట ఉన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం

» బెజవాడలో 20 ప్రాంతాలో ఏర్పాట్లు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, జూన్ 11 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణం కార్యక్రమాన్ని వీక్షించేందుకు విజయవాడ నగరంలో 20 ప్రాంతాలలో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రసారానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లను ఆయన పరిశీలించారు. ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం, స్వరాజ్యమైదానం, అంబేడ్కర్ స్మృతివనం, పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, రైల్వేస్టేషన్, లెనిన్ సెంటర్, పటమట జడ్పీ హైస్కూల్, రైతుబజార్, సింగ్‌నగర్ ఎంబీపీ స్టేడియం, జింఖానా గ్రౌండ్, విద్యాధరపురం స్టేడియం, పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్, ప్రసాదంపాడు అన్నపూర్ణరైస్ మిల్, సూర్యగోడౌన్, ఎస్ఆర్‌కే ఇంజనీరింగ్ కాలేజీ, అను మై బేబీ ఆసుపత్రి, నిడమానూరు బ్లూ బజ్ గ్రౌండ్స్ కేకేఆర్ గౌతం స్కూల్, సవారిగూడెం- కేసరపల్లి మధ్య బహిరంగ ప్రదేశం, కృష్ణలంకరాణిగారితోట మైదానంలో స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించాలన్నారు.

గన్నవరం విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి..

గన్నవరం : చంద్రబాబు ప్రమాణస్వీకారంలో పాల్గొనేందుకు పలువురు ప్రముఖులు, విదేశీ ప్రతినిధులు మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక విమానంలో వచ్చారు. అమిత్‌షాకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఎన్డీఏ నేతలు స్వాగతం పలికారు. కేంద్ర విమానాయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, కొరియా కన్సల్‌టెంట్ జనరల్ చాంగ్ న్యూయం కిమ్, ఆస్ట్రేలియా కన్సల్‌టెంట్ జనరల్ సిలైజాకి, సింగపూర్ కన్సల్‌టెంట్ జనరల్ ఈడ్‌గర్ పాంగ్, నెదర్లాండ్ కన్సల్‌టెంట్ జనరల్ ఎవౌట్ డెవిట్, యూఎస్ కన్సల్‌టెంట్ జనరల్ జెన్నిఫర్, తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం, ఎంపీలు వీరేంద్ర ప్రసాద్, ఫణి భూషణ్ చౌదరి, సీఎం రమేశ్, బండి సంజయ్, నందమూరి బాలకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ, సినీ ప్రముఖుడు నాగబాబు తదితరులు విచ్చేశారు. వీరికి అధికారులు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు


ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు దర్శించుకున్నారు. తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం, ద్విశతావధాని మాడుగుల నాగఫణిశర్మదంపతులు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు సుచరితా రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కొత్తపేట ఎమ్మెల్యే బి.సత్యానందరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చంద్రబాబు హయాంలోనే పారిశ్రామిక అభివృద్ధి : బాయన వెంకట్రావు

ఆటోనగర్(పెనమలూరు) : చంద్రబాబు హయాంలోనే రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి జరిగిందని ఏపీ ఎంఎస్ఎంఈఐఏ గౌరవాధ్యక్షుడు బాయన వెంకట్రావు పేర్కొన్నారు. మంగళవారం ఆటోనగర్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో కుంటుపడిన నూతన పరిశ్రమల స్థాపన, సమర్థత ఒక్క చంద్రబాబుకే సాధ్యమని పేర్కొన్నారు. ఐటీ రంగ అభివృద్ధితో ఆర్థిక స్వావలంబన సాధించి చిన్న కుటుంబాల యువతకు ఉద్యోగాల బాధ్యతను చంద్రబాబు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. రాయితీలను విడుదల చేసి పరిశ్రమలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఎంఈఐఏ కార్యదర్శి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అభినందనలు..

ధర్నాచౌక్ : ముఖ్యమంత్రిగా బాధ్యతల స్వీకరించనున్న చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం అభినందనలు తెలిపింది. మంగళవారం ప్రెస్‌మీట్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మాట్లాడారు. పోలీస్ సిబ్బంది ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులు కల్పించి వారి హృదయాల్లో సుస్థిరస్థానాన్ని చంద్రబాబు సంపాదించుకున్నారన్నారు.



నేడే చంద్రాభిషేకం

(1వ పేజీ తరువాయి)

దయాస్‌కు కుడివైపున ఏర్పాటు చేసిన వేదికలో న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసు అధికారులు, పారిశ్రామికవేత్తలు, దౌత్యవేత్తలు, తదితరుల కోసం 250 మందికి అలాగే పారిశ్రామికవేత్తల కోసం 200 మందికి 5వ నెంబర్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. ఇదే వేదికలో ఆరో నెంబర్ గ్యాలరీని స్థానిక పారిశ్రామికవేత్తలు 250 మంది, స్థానిక మీడియా 250 మంది కోసం ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకార దయాస్‌కు అభిముఖంగా ఏర్పాటు చేసిన మూడు వేదికల్లో వీవీఐపీల కోసం 6 గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్యాలరీ 1000 మంది కూర్చునే సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. వీవీఐపీ గ్యాలరీల దిగువున మూడు వేదికల్లో కూడా వీఐపీల కోసం మొత్తం 24 గ్యాలరీలను కేటాయించారు. ఈ 24 గ్యాలరీల్లో మొదటి ఆరు గ్యాలరీల్లో గ్యాలరీకి 1000 మంది చొప్పున 6 వేలమందికి, తర్వాత 12 గ్యాలరీల్లో గ్యాలరీకి 1285 మంది చొప్పున మొత్తం 15,420 మందికి, చివరి ఆరు గ్యాలరీల్లో ఒక్కో గ్యాలరీకి 2130 మంది చొప్పున మొత్తం 12,780 మంది కూర్చునే సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. తరలివచ్చిన ప్రజలు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించటానికి వీలుగా ప్రాంగణలో ఎల్ఈడీ స్క్రీన్లు కూడా ఏర్పాటు చేశారు.

గ్యాలరీల్లో ప్రత్యేక ఏర్పాట్లు

సభా స్టేజీ ముందు భాగంలో ఏర్పాటు చేసిన 36 గ్యాలరీల్లో కూర్చున్నవారికి ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రతి గ్యాలరీకి డిప్యూటీ కలెక్టర్‌స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. వాటర్, శానిటేషన్, మెడికల్ టీమ్‌లు ఉండే విధంగా చర్యలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ప్రత్యేక అతిథులు, వీవీఐపీలు, వీఐపీలు, మీడియా ప్రతినిధులకు సంబంధించి గ్యాలరీలు కూడా సిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక అతిథుల కోసం గ్రీన్ రూమ్స్

ప్రమాణ స్వీకారానికి విచ్చేస్తున్న ప్రత్యేక ఆహ్వానితుల కోసం దయాస్ వెనుక భాగంలో గ్రీన్ రూమ్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి మోదీ కోసం ప్రత్యేకంగా స్టేజీకి అత్యంత సమీపంలో గ్రీన్ రూమ్ ఏర్పాటు చేశారు. హోంమంత్రి అమిత్‌షా ఈ గ్రీన్ రూమ్‌కు ముందుగా చేరుకుంటారు. పీఎంఓ సిబ్బంది కోసం మరో రూమ్‌ను ఏర్పాటు చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ కోసం, ముఖ్యమంత్రి కోసం ప్రత్యేకంగా గ్రీన్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఈ గ్రీన్ రూమ్ పక్కనే వీవీఐపీల కోసం ఇంకో గ్రీన్ రూమ్ ఏర్పాటు చేశారు.

కల్చరల్, బ్యాండ్‌ల కోసం మినీ దయాస్‌లు

ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఆహుతుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వీటిని ప్రదర్శనకు మినీ దయాస్‌ను ఏర్పాటు చేశారు.

వీరాభిమానం..



బాబును ముఖ్యమంత్రిగా చూడాలని..



విశాలమైన వీఐపీ గ్యాలరీలు



గన్నవరం ఎయిర్‌పోర్టు వద్ద భారీ ఫ్లెక్సీ



రంగు రంగు పూలతో సభా వేదిక అలంకరణ



ప్రధాని కాన్వాయ్ ట్రయల్ రన్





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తలశిల రఘురాం అక్రమాలపై

విచారణ జరపాలి

» అధికారమదంతో అందరినీ వేధించారు.. వారిలో నేనూ బాధితుడినే

» రూ.వందల కోట్ల విలువైన ఆస్తులు కబ్జా చేశారు

» టీడీపీ సీనియర్ నేత కళ్లే నాగేశ్వరరావు

విజయవాడ/కృష్ణలంక, జూన్ 11 : జగన్ టూర్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ పదవులను అడ్డం పెట్టుకుని ఐదేళ్లపాటు తలశిల రఘురాం పలువురు టీడీపీ నాయకులను తీవ్ర వేధింపులకు గురి చేశారని. తాను కూడా ఆయన బాధితుడినేనని టీడీపీ సీనియర్ నేత కళ్లే నాగేశ్వరరావు ఆరోపించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నమ్మిన వారిని నట్టేట ముంచడం, తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం తలశిల రఘురాంకు అలవాటేనని నాగేశ్వరరావు ఆరోపించారు. సొంత పార్టీ నేతలే ఆయనపై ఆరోపణలు చేస్తున్నారంటే ఆయన నైజం అర్థమవుతుందన్నారు. తాను ఉత్తరాంధ్ర టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న బుద్ధ వెంకన్నతో కలిసి తిరుగుతున్నానన్న కారణంతో ఐదేళ్లపాటు వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. తొలినుంచి టీడీపీ కార్యకర్తగా ఉన్న తాను 2014లో సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమ కార్యాలయ ఇన్‌చార్జిగా, 2017-18లో టీడీపీ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జిగా పనిచేశానని తెలిపారు. తనపై వ్యక్తిగతంగా కక్ష పెంచుకున్న తలశిల రఘురాం గొల్లపూడి వై జంక్షన్‌లో తాను సుమారు రూ.70 లక్షలు పెట్టి హోటల్ పెట్టుకోగా, దానిని బలవంతంగా మూసివేయించారని, తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగా ఉన్న క్యాంటిన్‌ను సైతం మూయించేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో తన భార్య పేరుతో మెడికల్ షాపులు తీసుకుంటే అధికారులపై ఒత్తిడి తెచ్చి దానినీ మూయించేయాలనుకున్నారని విమర్శించారు. కేన్సర్ వ్యాధితో చావు బతుకుల మధ్య ఉన్న తన భార్య నుంచి ఆ షాపును బలవంతంగా లాక్కుని వైసీపీ కార్యకర్తలకు ఇచ్చే ప్రయత్నం చేసిన తలశిల రఘురాం వేధింపులకు ఎదురొడ్డి కోర్టుకు వెళ్లి పోరాడానన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన తలశిలకు ఒకప్పుడు కుటుంబం గడవడం కూడా కష్టంగా ఉండేదని, ఈ విషయం ప్రతి వైసీపీ కార్యకర్తకు తెలుసన్నారు. ఒకానొక దశలో రఘురాం ఇంటికి అద్దె కూడా కట్టలేని స్థితిలో ఉంటే తానే స్వయంగా యజమానితో మాట్లాడి అద్దె కట్టే వాడినని వెల్లడించారు. అలాంటి తననే రఘురాం వేధింపులకు గురి చేశారని విమర్శించారు. ఐదేళ్లపాటు ఆర్థికంగా.. మానసికంగా వేధింపులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రఘురాం వందల కోట్ల ఆస్తులు కబ్జా చేశారని, ఆయన అరాచకాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన టీడీపీ అధినేత చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు గుండారపు హరిబాబు, చందన సురేశ్ పాల్గొన్నారు.

అవినీతి జలగ!

» ప్రాసిక్యూటర్స్‌ను పట్టి పీడిస్తోన్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ అక్రమాలపై చర్యలు తీసుకోండి

» రాష్ట్ర క్యాడర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లాం అజయ్ ప్రేమ్‌కుమార్ వినతి

విజయవాడ లీగల్ : డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా విధులు నిర్వహిస్తోన్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీఓపీ) జల్లా సుదర్శనరెడ్డి అవినీతి, అధికార, నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీ, డీజీపీలకు రాష్ట్ర క్యాడర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లాం అజయ్ ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని అంశాలు ఈ విధంగా వున్నాయి.. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వైసీపీ కార్యకర్త జల్లా సుదర్శనరెడ్డిని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా వైసీపీ ప్రభుత్వం మే 2023న నియమించింది. ఈ నియామకం చట్టవిరుద్ధమని అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ హైకోర్టులో సవాల్ చేయగా, సుదర్శనరెడ్డి నియామకాన్ని రద్దు చేసి మెరిట్ ఆధారంగా నాలుగు నెలల్లోగా వేరొకరిని నియమించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆ నాలుగు నెలలు 'జల్లా'ను తాత్కాలిక డీఓపీగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు తీర్పు తరువాత కూడా సుదర్శనరెడ్డి ప్రభుత్వ అనుమతి లేకుండా రూ.50 లక్షల వరకు జీతభత్యాలుగా తీసుకున్నారు. హైకోర్టు ఆదేశాలు ప్రకారం, ప్రభుత్వం నుంచి ఇంటీరియం డైరెక్టర్‌గా ఎటువంటి ఉత్తర్వులు పొందకుండా, తానే డైరెక్టర్‌గా చెలామణి అయి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అజయ్‌కుమార్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సుదర్శనరెడ్డి హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేయగా సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థించింది. సుదర్శనరెడ్డి డీఓపీగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని ప్రాసిక్యూటర్స్‌ని బలవంతం పెట్టి సన్మానాలు చేయించుకోవడం కోసం ఒక్కొక్కరి నుంచి రూ.3 నుంచి 5 వేల వరకు చందాలు వసూలు చేయించినట్టు ఆరోపణలున్నాయని అజయ్‌కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. 1992లో ప్రాసిక్యూషన్స్ డిపార్ట్‌మెంట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు నలుగురు ప్రాసిక్యూటర్స్‌ను వివిధ కారణాలతో సస్పెండ్ చేయగా సుదర్శనరెడ్డి ఏడాదిలో ఆరుగురు ప్రాసిక్యూటర్స్‌ను చిన్న చిన్న కారణాలతో సస్పెండ్ చేశారని అజయ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాసిక్యూటర్లను జలగల్లా పీల్చుకుతింటున్న డీఓపీ 'జల్లా' ఆగడాలపై సమగ్ర విచారణ జరపాలని, ప్రాసిక్యూటర్లను అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన సుదర్శనరెడ్డిపై క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుంచి జీతం కింద తీసుకొన్న రూ.50 లక్షలను రికవరీ చేయాలని లాం అజయ్ ప్రేమ్‌కుమార్ తన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

నేడు డ్రైవింగ్ టెస్ట్‌లకు రీ షెడ్యూల్ చేసుకోండి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం నేపథ్యంలో, జూన్ 12వ తేదీన బుధవారం ఆన్‌లైన్‌లో డ్రైవింగ్ టెస్ట్ స్లాట్ బుక్ చేసుకున్న వారికి గన్నవరంలోని ఆర్టీఏ డ్రైవింగ్ టెస్ట్‌సెంటర్‌కు రావటానికి వీలుపడని పరిస్థితి ఏర్పడింది. దీంతో రవాణా శాఖ అధికారులు స్లాట్ టైమింగ్‌ను రీ షెడ్యూల్ చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)పై ట్రాఫిక్ స్తంభించిపోయే అవకాశం ఉండటంతోపాటు, అతి సమీపంలో సభావేదిక ఉండటం వల్ల జామర్స్ కారణంగా.. వైఫై ఆధారిత సర్వ్యాట్ వ్యవస్థలో అవాంతరాలు వచ్చే అవకాశం ఉండటంతో స్లాట్ రీ షెడ్యూల్ చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలి రండి



కాట్రగడ్డ మోహన్

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 11 : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్నారని, ఆ కార్యక్రమానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని ప్రతిభ ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత కాట్రగడ్డ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గన్నవరం మండలం కేసరపల్లి మేధ టవర్స్ వద్ద చంద్రబాబు ప్రమాణస్వీకారానికి వచ్చే వారి కోసం తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో విగిసిపోయిన ప్రజలకు చంద్రబాబు ప్రమాణస్వీకార వేడుక పండుగ వాతావరణాన్ని తలపిస్తుందని పేర్కొన్నారు.

చంద్రబాబుకు గ్రామసచివాలయ సంఘం శుభాకాంక్షలు

భవానీపురం : ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రబాబుకు గ్రామ సచివాలయం సంక్షేమ, విద్యా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. సుధాకర్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌యూబీ పెండింగ్ పనులను

మూడు వారాల్లో పూర్తి చేయండి

● ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశం



కార్పొరేషన్ ఈఈ ప్రసాద్‌క సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మధురానగర్, జూన్ 11: మధురానగర్ ఆర్‌యూబీ నిర్మాణ పనుల్లో పెండింగ్ పనులను మూడు వారాల్లో పూర్తి చేయాలని కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన ఆర్‌యూబీని సందర్శించారు. ఈ సందర్భంగా ఈఈ నుంచి వివరాలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో 2019లో డబుల్ లైన్ ఆర్‌యూబీకి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు సగానికి పైగా పూర్తి చేసి ఇచ్చినా ఐదేళ్లలో వైసీపీ పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. ట్రయల్ రన్ నడుస్తోందని అన్ని పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తామని ఆయన చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు పీవీఆర్, కార్పొరేటర్ వీరమాచనేని లలిత, అర్బన్ నాయకులు సింగం వెంకన్న, అడపా కోటేశ్వరరావు, బర్మా శ్రీను, అంగిరేకుల రాంబాబు, రాబిల్లి సూర్తి, జనసేన నాయకులు లఖనం శ్యాంప్రసాద్, డివిజన్ జనసేన అధ్యక్షుడు కెంబూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంతో

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు

వన్‌టౌన్, జూన్ 11: ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చినందుకు టీడీపీ నాయకులు సారిపల్లి వినయ్, దేవర కల్యాణ్‌లు మంగళవారం కనకదుర్గమ్మకు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడి తీర్చుకున్నారు. 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, ఈగల సాంబ, సుకాశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారిపల్లి వినయ్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావాలని, పశ్చిమ నుంచి సుజనా చౌదరి భారీ మెజారిటీతో గెలవాలని ఎన్నికల ముందు అమ్మవారికి మొక్కుకున్నామని అమ్మవారి ఆశీస్సులతోనే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిందని, సుజనా చౌదరి కూడా భారీ మెజారిటీతో గెలిచారని చెప్పారు. బండారు బాబురావు, గోలి శ్రీనివాసరావు, నాగోతి వెంకటేష్, కామాంధుల సాయి, బోను నరేంద్ర, రమణ, రాఘవ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకున్న సారిపల్లి వినయ్, దేవర కల్యాణ్

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు

● రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



నార్సింగ్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో ఆయన చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నదని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం చాలా సంతోషంగా ఉందని, ఆయన శిష్యులమని చెప్పుకునేందుకు గర్వంగా ఫీల్ అవుతున్నాం అని అన్నారు. ఐటీ రంగం ఇంతగా అభివృద్ధి చెందిందంటే అది చంద్రబాబు చలవేనని, పేదలకు సంక్షేమ పథకాలను అందించడంలో ఆయనది పెద్దన్న పాత్ర అన్నారు. విద్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో ఆయన ఉపాధ్యాయుడిలాంటి వారు, ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం మా అందరికీ గర్వకారణం అని ప్రకాష్‌గౌడ్ అన్నారు. చంద్రబాబు ప్రజలకు మేలు చేస్తాడు కాబట్టి ఆయనను విజయం వరించిందన్నారు. గత ఐదేళ్లు ఆయన పేదల పక్షాన పోరాడారు కాబట్టే అంత మెజార్టీతో గెలుపొందారన్నారు. ఇక తిరుమలలో కూడా భక్తులకు ఇబ్బంది లేకుండా ఆయన చూసుకుంటాడనే నమ్మకం ఉందని ప్రకాష్‌గౌడ్ తెలిపారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఇన్‌ఛార్జ్ ఈవోగా మోహనరావు

వన్‌టౌన్, జూన్ 11: స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఇన్‌చార్జ్ ఈవోగా ఎం.మోహనరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ దేవస్థాన ఈవోగా విధులు నిర్వహిస్తున్న ఘంటసాల శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యారు. దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు వన్‌టౌన్‌లోని శ్రీరామానగర్ రూపాబాయమ్మ ట్రస్ట్ ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న మోహనరావును వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఇన్‌చార్జ్ ఈవోగా నియమించారు. మోహనరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

కాళీమాతకు కోటి విరజాజులతో పూజ



కృష్ణలంక, జూన్ 11 : త్రిశక్తి పీఠంలోని శ్రీ కాళీమాత అమ్మవారికి మంగళవారం కనకదుర్గ లలితా పారాయణ బృందం వారిచే 130 మంది సుహాసినులతో కోటి విరజా జులతో పుష్పార్చన నిర్వహిం చారు. ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్ కిరణ్, జి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ మధుసూదనరావు పాల్గొన్నారు.

చెత్త పన్ను వసూలును ఉపసంహరించుకోవాలి

● కార్పొరేటర్ బోయి సత్యబాబు

చిట్టినగర్, జూన్ 11: చెత్త పన్ను వసూలు విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు.

మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం సీపీఎం ఫ్లోర్‌లీడర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర ప్రజల నుంచి, వాణిజ్య సంస్థల నుంచి వసూలు చేస్తున్న చెత్త పన్ను విధానాన్ని రద్దు చేసేలా కౌన్సిల్ సమావేశంలో తీర్మానం పెట్టి ఆమోదించాలన్నారు. అనంతరం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మిని ఆమె చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేశారు.

కేంద్ర ప్రభుత్వమే పోలవరం నిర్మాణం చేపట్టాలి

● పేరం శివనాగేశ్వరరావు

ధర్నాచౌక్, జూన్ 11: ప్రత్యేక నిధుల ద్వారా పోలవరం ప్రాజెక్టుతో పాటు ఇతర సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని కేంద్రప్రభుత్వమే పూర్తి చేసే బాధ్యతను చేపట్టాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కృష్ణా బ్యారేజీ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలో ప్రతీ ఏటా కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు వృధా కాకుండా యుద్ధ ప్రాతిపదికన చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలన్నారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు ఫణీంద్రకుమార్, సత్య వరప్రకాష్, వెంకట కృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం కోసం విద్య

● ఐపీఈ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎన్‌ఎల్ సాయికుమార్

మొగల్రాజపురం, జూన్ 11: విద్యార్థులు



మాట్లాడుతున్న సాయికుమార్

మార్కుల కోసం కాకుండా మార్పుకోసం చదవాలని, పరీక్షల కోసం విద్య కాకుండా విజ్ఞానం కోసం ఉపయోగపడాలని ఐపీఈ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎన్‌ఎల్ సాయికుమార్ అన్నారు. పీబీ సిద్ధార్థ ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గ్రూమింగ్ ఫర్ హైరింగ్ అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ నిర్ణయాలకు తామే బాధ్యత వహించాలన్నారు. ప్రతి విద్యార్థి డ్రీమ్ ఎంప్లాయిగా, డ్రీమ్ ఎంట్రప్రెన్యూర్‌గా ఎదగాలని చెప్పారు. డీన్ రాజేష్ అధ్యక్షత వహించగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించాలి

● ఏపీ నాన్ పొలిటికల్ జేఏసీ

ధర్నాచౌక్, జూన్ 11: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడనున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు సాధించేందుకు కృషి చేస్తుందని ఏపీ నాన్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పికట్ల శ్రీహరి నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. విశాఖ రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు హామీని అమలు చేయాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలన్నారు. విభజన చట్టంలో పొందుపరచిన హామీలన్నింటిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాని కోరారు. జేఏసీ ఉపాధ్యక్షుడు వీవీ.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి వీసం వెంకటేశ్వరరావు, కోశాధికారి సురేష్ పాల్గొన్నారు.

14న అండర్-16 బాలుర క్రికెట్ ఎంపికలు

విజయవాడస్పోర్ట్సు, జూన్ 11 : కేడీసీఏ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఉదయం 7 గంటలకు ఉమ్మడి కృష్ణా అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలను స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 2008 సెప్టెంబరు ఒకటవ తేదీ తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, ఆసక్తి కలిగిన వారు తమ స్పోర్ట్సు డ్రెస్,కిట్, పుట్టిన తేదీ జిరాక్సులతో రావాలని ఆయన కోరారు.

సెంట్రల్ జోన్ వన్డే టోర్నీలో ప్రకాశం బోణీ

● డబుల్ సెంచరీతో సత్తా చాటిన రోహిత్

విజయవాడస్పోర్ట్సు, జూన్ 11 : మూలపాడు ఏసీఏ స్టేడియం వేదికగా మంగళవారం ప్రారంభమైన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ పురుషుల అండర్-23 వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో ప్రకాశం జిల్లా బోణీ చేసింది. కృష్ణా జట్టుపై 155 భారీ పరుగుల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. తొలుత బ్యాట్ పట్టిన ప్రకాశం 50 ఓవర్లలో కేవలం 3 వికెట్లను కోల్పోయి 404 పరుగుల భారీ స్కోర్‌ను సాధించింది. ఓపెనర్ జి. రోహిత్ కళ్లు చెదిరే షాట్లతో 162 బంతుల్లో 23 ఫోర్లు, 19 సిక్స్‌లతో 267 పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేసి ఔరా అనిపించాడు. ఎం. అభినవ్ 82 పరుగులతో రాణించాడు. అనంతరం 405 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన కృష్ణా జట్టు 40.5 ఓవర్లలో లక్ష్యచేధనలో 249కే కుప్పకూలింది. ఎస్‌కే.ఖాజా మొహీద్దీన్(51) అర్ధసెంచరీ చేశాడు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

కృష్ణలంక, జూన్ 11: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. శ్రీకాకుళం జిల్లా లుక్‌లా పేటకు చెందిన జొన్నాడ నీలయ్య (50) గత 20 ఏళ్లుగా విజయవాడలోని భానునగర్‌లో నివసిస్తూ భవన నిర్మాణాల్లో కబ్ బోర్డుల పని చేస్తుంటాడు. కృష్ణలంక శంకరమఠం వీధిలో నిర్మాణంలో వున్న ఓ భవంతిలో కప్ బోర్డులు నిర్మించేందుకు మంగళవారం వచ్చిన నీలయ్య ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురికావడంతో వెంటనే భవనంలో వున్న సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

రాజకీయ దాడులు వద్దంటూ ఒక రోజు నిరసన

భవానీపురం: గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.గాంధీ నాగరాజన్ మంగళవారం ఊర్మిళానగర్ కార్యాలయంలో రాజకీయ దాడుల వద్దంటూ ఒకరోజు నిరసన చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త కూర్పు

నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. కొత్త మంత్రివర్గం 71 మందిలో ముప్పైమందికి కేబినెట్ హోదా లభించింది. ఐదుగురు స్వతంత్ర, ముప్పై ఆరుగురు సహాయ మంత్రులు ఉన్నారు. మిత్రపక్షాల కరుణాకటాక్షాల ఆధారంగా దేశాన్ని ఏలాల్సిన స్థితిలో ఉన్నప్పటికీ, నరేంద్రమోదీ ఈ మంత్రివర్గ కూర్పులో తనదే పైచేయి అనిపించుకున్నారని, ఊతమిస్తున్నవారి ఒత్తిళ్ళకు పెద్దగా లొంగలేదని కొందరి విశ్లేషణ. కొందరు పాతవారు పోయి, శాఖల్లోనూ మార్పుచేర్పులు ఉన్నా, అధికంగా గత మంత్రులే ఉన్నందున మార్పు ప్రభావవంతంగా అగుపించడం లేదు. సొంతబలం లేకున్నా కూడా, గతకాలపు కొనసాగింపుగానే కనిపించాలన్న ప్రత్యేక ప్రయత్నం ఈ మంత్రివర్గం కూర్పులో అత్యధికులకు కనిపిస్తున్నది.

ఆర్థికం, హోం, రక్షణ, విదేశీవ్యవహారాలు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, రైల్వేల వంటి కీలకమైన శాఖల్లో ఏ మార్పూలేదు. ఈ మారు కూడా మంత్రుల్లో ముస్లింలు లేరు. ఏడుగురు ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, ఏడుగురు మహిళలకు మోదీ టీంలో చోటుదక్కింది. యూపీ నేర్పిన గుణపాఠం వల్ల కాబోలు, ఓబీసీల ప్రాతినిధ్యం కూడా గట్టిగానే ఉంది. పంజాబ్‌లో బలంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీతోనూ, కేరళలో ఎల్‌డీఎఫ్‌తోనూ యుద్ధం కొనసాగించాలి కనుక, తమిళనాడులో ఎదురుదెబ్బ తిన్నా విస్తరణయత్నాలు ఆగకూడదు కనుక ఆ రాష్ట్రాలనుంచి ఓడినవారికి కూడా ప్రాతినిధ్యం లభించింది. ఖలిస్తానీ ఉగ్రవాదుల చేతిలో హతమైన కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనుమడు రవ్‌నీత్‌సింగ్ బిట్టూ ద్వారా పంజాబ్‌లో ఎదగాలన్నది బీజేపీ ప్రయత్నం. ఒక్కసీటూ గెలవకపోయినా ఆప్, కాంగ్రెస్ తరువాత ఓట్లవాటాలో మూడోస్థానంలో ఉన్నందున బీజేపీ ఆశని కాదనలేం. కేరళలో ఒక్కసీటు గెలిచి ఖాతా తెరిచిన సంతోషంలో ఆ రాష్ట్రానికి రెండు పదవులు ఇచ్చినా, నటుడు సురేష్ గోపి అలగడం, రాజీ పడటం తప్పలేదు. కేరళలో ఈ ఎన్నికల్లో బీజేపీ ఓట్లవాటా 17శాతం తాకి, 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి బలాన్ని ప్రదర్శించిన నేపథ్యంలో, జార్జి కురియన్ ఎంపిక క్రైస్తవులకు సానుకూల సంకేతం పంపేందుకు ఉపకరిస్తుంది. తమిళనాట వీరోచిత పోరాటం చేసిన ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు అన్నామలై కాక, గతకాలపు నేత లోగనాథన్ మురుగన్‌ను మంత్రిగా తీసుకోవడం వెనుక దళిత ఉపకుల రాజకీయం ఉన్నదని అంటారు. ఇప్పుడు అంతగా ఆదరించనప్పటికీ, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రాల ప్రజల మనసులను గెలుచుకోవడానికి ఈ పందేరం ఉపకరిస్తుంది.

కొత్త మంత్రివర్గాన్ని యువతరం, అనుభవజ్ఞులతో ఎంతో చక్కగా గుదిగుచ్చామని ప్రధానమంత్రి చెప్పుకున్నారు. ఐదుగురు తెలుగువారికి కేంద్రంలో చోటు దక్కడం అటుంచితే, మిత్రపక్షాలకు మొత్తంగా పదకొండు, ఐదుపార్టీలకు ఒక్కటి చొప్పున పదవులు దక్కాయి. బిహార్‌లో ముగ్గురు మిత్రులకు నాలుగు పదవులు ఇచ్చినా, మహారాష్ట్రలో ఎన్సీపీని చీల్చి, అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్యేలను తెచ్చిన అజిత్‌పవార్‌తో ఇక అవసరం తీరిపోయిందని బీజేపీ భావిస్తున్నట్టుగా చర్చ జరుగుతోంది. ఎన్సీపీ మినహా అన్ని మిత్రపక్షాలకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. ఇక, ఈ ఏడాది ఎన్నికలు ఉన్నందున మహారాష్ట్ర, హర్యానాలకు తగిన ప్రాతినిధ్యమే దక్కింది. ఖట్టర్‌ను తీసుకోవడం, మూడు పదవులు ఇవ్వడంలో హర్యానాను జారవిడుచుకోకూడదన్న ప్రయత్నం బలంగా కనిపిస్తున్నది. మహారాష్ట్ర కంటే, ఢిల్లీ పొరుగున ఉన్న హర్యానాలో ఓడిపోతే ఆ ప్రభావం నైతికంగా కేంద్రప్రభుత్వం మీద పనిచేస్తుంది.

గత ప్రభుత్వంలోని కీలకమైన మంత్రులను అదేశాఖలో కొనసాగించడం, నడ్డావంటివారిని కొత్తగా తేవడం వంటివి గమనించినప్పుడు మంత్రివర్గ కూర్పులో బీజేపీ ముద్ర విశేషంగా కనిపిస్తుంది. మిత్రపక్షాల అవసరం ఎంత ఉన్నప్పటికీ, వారిని కొంతమేరకే సంతృప్తిపరచి తనదే పైచేయి అనిపించుకుంది. కేబినెట్ మంత్రుల్లో పాతికమంది బీజేపీవారే అయినప్పటికీ, మిత్రపక్షాల ప్రాతినిధ్యం ఈ దేశ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. దేశంలోని వేర్వేరు ప్రాంతాలనుంచి వచ్చినవారు మంత్రివర్గం పనితీరు మరింత మెరుగుపడేందుకు ఉపకరిస్తారు. భవిష్యత్తులో మంత్రివర్గాన్ని విస్తరించుకొనే వెసులుబాటు ఇంకా మిగిలివున్నందున, రాజకీయంగానో, సామాజిక కారణాలరీత్యానో స్వపక్షంనుంచో, మిత్రపక్షాలనుంచో మరికొందరికి చోటుకల్పించే అవకాశాలైతే లేకపోలేదు. అప్పుడు మరిన్ని వింతలూ విశేషాలు చూడవచ్చు.

నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు.

రాష్ట్రాన్ని గ్లోబల్ ఎకానమీలో నిలిపిన నిపుణుడు


విశ్వసనీయత, అంకితభావంతో పాటు దార్శనికత కలిగిన నాయకులు ప్రజా జీవన ప్రమాణాలలో పరివర్తన తీసుకురాగలుగుతారు కానీ వర్తమాన భారతవనిలో ఈ తరహా నాయకులు అరుదు. స్థానికాంశాలలో మాత్రమే నిమగ్నమై ఉండే రాష్ట్ర స్థాయి నాయకులే తప్ప దూరదృష్టితో, అంతర్జాతీయ దృక్పథంతో, విదేశాల సౌజన్యంతో తమ రాష్ట్రాల అభివృద్ధి గూర్చి అలోచించేవారు బహు అరుదు.

నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు.

1990లో శస్త్రచికిత్స కోసం 59 రోజులపాటు అమెరికాకు వెళ్ళిన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రపంచ బ్యాంకు నుంచి వరదల పునరావాస చర్యల కొరకు రూ.2800కోట్ల రుణాన్ని తీసుకురావడం గురించి, న్యూయార్క్ నుండి ఫాక్స్ ద్వారా జీవోలు జారీ చేయడాన్ని గురించి అప్పట్లో గొప్పగా చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ తర్వాత, కొన్నాళ్ళకు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు దేశ విదేశాంగ విధాన తీరులో సమూల మార్పును తీసుకోవచ్చారు. అప్పటి వరకు రాష్ట్రాలతో సంబంధం లేకుండా నడిచిన విదేశాంగ విధానంలో రాష్ట్రాలకు కూడా పాత్ర ఉండాలంటూ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన వాదనకు జాతి ప్రయోజనాల దృష్ట్యా అందరి నుంచి ఆమోదం లభించింది. ఇప్పుడు 25ఏళ్ళ తర్వాత ఆయన తనయుడు లోకేశ్ కూడా బలమైన రాష్ట్రాలు లేకుండా భారత వికాసం ఎలా అంటూ అడుగుతుండడం ముదావహం.

గల్ఫ్ లేఖ

చంద్రబాబు దార్శనికత గూర్చి ఇక్కడ ప్రస్తావించాలి. ఇప్పుడు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు నిత్య జీవితంలో ఒక భాగమే, కానీ రెండు దశాబ్దాల క్రితం అనేక వర్ధమాన దేశాలలో సైతం ఈ-కామర్స్ గురించి పెద్దగా తెలియని కాలంలో చంద్రబాబు నాయుడు దుబాయిలో ఈ-కామర్స్ కేంద్రంగా పురుడు పోసుకుంటున్న ఇంటర్నెట్ సిటీని పర్యటిస్తానని ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. అప్పట్లో దీనిపై ఇటు భారతీయ దౌత్యవేత్తలతో పాటు, అప్పటి దుబాయి యువరాజు, ప్రస్తుత రాజు అయిన షేక్ మోహమ్మద్ రాషేద్ అల్ మొఖ్తుం ఆశ్చర్యపోయారు. భవిష్యత్తు పట్ల ఇంత దార్శనికత కలిగిన ఈ భారతీయ నాయకుడు ఎవరా అని అరబ్బులు ఆసక్తిగా గమనించారు. అప్పటికి ఇంకా బాలుడిగా ఉన్న నారా లోకేశ్‌తో కలిసి ఆయన దుబాయిలోని ఇంటర్నెట్ సిటీని పర్యటించి దాని తీరుతెన్నులను పరిశీలించి సైబరాబాద్‌లోని హైటెక్ టవర్ల నిర్మాణంలో దానికి అనుగుణంగా కొన్ని సూచనలు చేసారు.



పెరుగుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విమానయాన రాకపోకలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని గ్రహించిన చంద్రబాబు నాయుడు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీకారం చుట్టడమే గాక అందులో విమానాలను నడపడానికి ఎయిర్ లైన్స్ చుట్టు తిరిగారు. సంప్రదాయకంగా ఇరుదేశాల మధ్య జనవరిలో జరిగే ద్వైపాక్షిక విమానాల రాకపోకల ఒప్పందాలకు భిన్నంగా చంద్రబాబు నాయుడు ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు హైదరాబాద్‌లో ప్రత్యేక అనుమతి ఇప్పించారు. దాంతో 2001 జూలై 2న ప్రప్రథమ ఏమిరేట్స్ విమానం హైదరాబాద్‌లో దిగింది. అందులో దుబాయి నుంచి వచ్చిన ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అత్యున్నత అధికారి ఘయిత్ అల్ ఘయిత్ ఈ విమానం హైదరాబాద్‌కు రావడానికి కేవలం చంద్రబాబు నాయుడు కారణమని ప్రశంసించారు. ఈ విమానం ద్వారా దుబాయి మీదుగా అమెరికా, ఐరోపాలతో సహా ప్రపంచానికి హైదరాబాద్‌కు విమాన సౌకర్యం విరివిగా అందుబాటులో వచ్చింది.

ఆ తర్వాత వ్యూహాత్మకంగా హైదరాబాద్‌లో అమెరికన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలను ఆకర్షించిన చంద్రబాబు నగరంలో అమెరికా కాన్సులేటు నెలకొల్పడానికి నిర్విరామంగా చేసిన ప్రయత్నాలు చూసి సాక్షాత్తూ అమెరికా విదేశాంగ శాఖ సైతం నివ్వెరపోయింది. స్వాతంత్ర భారత చరిత్రలో అమెరికా ప్రప్రథమంగా నెలకొల్పిన కాన్సులేటు ఇదేనని అని చాలమందికి తెలియదు.

దశాబ్దకాలంగా కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైన విదేశాంగ శాఖలోని 'లుక్ ఈస్ట్' విధానాన్ని చంద్రబాబు తన చేతల ద్వారా దేశానికి చూపించారు. చైనా, సింగపూర్, దక్షిణా కొరియాలతో వ్యూహాత్మక ఆర్థిక ప్రయోజనాలు సాధించారు.

2014లో జపాన్‌లో ఎన్నికలలో నిమగ్నమై ఉన్న ప్రధాని షింజో అబే, విశ్వఖ్యాత ఎలక్ట్రానిక్స్ సంస్థ పానసోనిక్ యాజమాన్యంతో సమావేశమవడానికి సందర్శిస్తానని చంద్రబాబు విజ్ఞప్తి చేయడంతో దౌత్యవేత్తలు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసారు. కానీ అవతలి వైపు నుండి వచ్చిన సానుకూలతతో వారిద్దరితో చంద్రబాబు నాయుడు మాట్లాడిన తీరు జపాన్‌లోని భారత రాయబారి దీపా వాధ్వాతో పాటు జపానీ పారిశ్రామికవేత్తలను అబ్బురపర్చింది. మైక్రోసాఫ్ట్ మొదలు కియా మోటర్స్ వరకు అనేక బహుళజాతి బ్రాండ్లను రాష్ట్రానికి తెచ్చిన తీరు దౌత్యవేత్తలకు సైతం మార్గదర్శకంగా నిలించింది.

అదే విధంగా, సాధారణంగా రాష్ట్రాల స్థాయి నాయకులను కలవని యూఏఈ అధ్యక్షుడు, అబుధాబి రాజు శేఖ్ మోహమ్మద్ బిన్ జాయద్ కూడ 2018లో చంద్రబాబుతో సమావేశమై తాను నవ్యాంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతానని చెప్పినా ఆ తర్వాత ప్రభుత్వ మార్పిడితో అడుగు ముందుకు పడలేదు.

ఆర్థిక ప్రయోజనాలే కాకుండ సగటు ప్రవాసీయుల సమస్యలపై కూడా ఆయన స్పందించారు. గల్ఫ్‌లో మృతదేహాల పెండింగ్ గూర్చి ఈ ప్రతినిధి 1995లో వ్రాసిన ఒక వ్యాసంపై అప్పుడే అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు సౌత్ బ్లాక్‌లో కదలిక తీసుకువచ్చింది. ఈ రకమైన దార్శనికత, అంకితభావం కలిగిన చంద్రబాబు నాయుడి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్ళీ అభివృద్ధిబాటపై పయనిస్తుందని ఆశించవచ్చు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ మార్పు ప్రజలు ఆశించిందేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఒక అమ్మాయి తన తల్లిదండ్రుల వద్ద ఉన్నంత కాలం స్వేచ్ఛగా, పెద్దగా బరువు బాధ్యతలు లేకుండా ఉంటుంది. అయితే వివాహం చేసుకుని మరో ఇంట్లో అడుగు పెట్టాక అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఉండవలసి వస్తుంది. అన్నింటినీ ఆకళింపు చేసుకుని తన బాధ్యతలేమిటో అర్థం చేసుకోవల్సి ఉంటుంది. మన వెంకయ్యనాయుడు కూడా ఇప్పటి వరకూ పార్లమెంట్ సభ్యుడుగా, కేంద్రమంత్రిగా అనేక పదవులు నిర్వహించారు. ఉభయ సభల్లోనూ, ఇతర సమావేశాల్లోనూ అనర్గళంగా మాట్లాడారు. కాని ఇప్పుడు ఆయన ఉపరాష్ట్రపతి. అది ఒక రాజ్యాంగ హోదా. రాజ్యసభ చైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. కనుక ఆయన కూడా పుట్టింటి నుంచి మెట్టినింటికి వచ్చినట్లు కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారవలసి ఉంటుంది. అది ఆయనకు తెలుసు' అని 2017 ఆగస్టు మొదటి వారంలో ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడును పార్టీ ఎంపీల సమావేశంలో అభినందిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నప్పుడు హాజరైనవారందరూ నవ్వుల వర్షం కురిపించారు. 'మోదీ ఎంత సహజమైన ఉదాహరణనిచ్చారు' అని ఒకరిద్దరు వ్యాఖ్యానించారు.

2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 2014 నుంచి ఇప్పటి వరకూ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నరేంద్రమోదీ కూడా ఇప్పుడు ఒక కొత్త వాతావరణంలోకి అడుగుపెట్టారు. ఇప్పటి వరకూ ఆయన సారథ్యంలో బీజేపీ ఎన్నిసార్లు పోటీ చేసినా అన్నిసార్లు అత్యధిక మెజారిటీ సాధించింది. 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నా, 10 సంవత్సరాలు దేశ ప్రధానమంత్రిగా ఉన్నా ఎప్పుడూ ఇతర పార్టీల బలంపై ఆధారపడవలసిన అవసరం ఆయనకు రాలేదు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏకు పూర్తి మెజారిటీ వచ్చినా, ఆయన స్వంత పార్టీ బీజేపీకి పూర్తి సంఖ్యాబలం రాలేదు. ఎన్నికలకు ముందే ఒక కూటమిగా ఏర్పడిన ఎన్డీఏకు సారథిగా కూడా మోదీయే ఉన్నందువల్ల ఆయన నాయకత్వానికి వచ్చిన ఢోకా ఏమీ లేదు కాని ఒక రకంగా గత 23 సంవత్సరాల ఆయన అనుభవంతో పోలిస్తే ఇప్పుడు ఆయన నిర్వహించేది కొత్త సంసారమే అని చెప్పక తప్పదు. ఎందుకంటే గతంలో మోదీ ఎప్పుడూ సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించలేదు.

అయితే 1999–2004 మధ్య అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలో బీజేపీ ఏర్పర్చిన సంకీర్ణ ప్రభుత్వానికీ, ఇప్పుడు మోదీ నాయకత్వంలో ఏర్పాటు చేసిన సంకీర్ణ ప్రభుత్వానికీ కొన్ని పోలికలు ఉన్నాయి. నిజానికి అప్పుడు ఎన్డీఏ ఇప్పటి ఎన్డీఏ కంటే ఆరు సీట్లు ఎక్కువ సాధించింది. కాంగ్రెస్ ప్రధానుల తర్వాత అయిదేళ్లు పాలించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా గుర్తింపు పొందిన వాజపేయి సారథ్యంలో నాడు ఎన్డీఏకు 299 సీట్లు రాగా ఇప్పుడు మోదీ సారథ్యంలోని ఎన్డీఏకు 293 సీట్లు లభించాయి. నాడు కూడా కాంగ్రెస్ కేవలం 112 సీట్లతో చాలా బలహీనంగా ఉండేది. 1999లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల సంఖ్యాబలం 134 మాత్రమే. ఇప్పుడు 232 సీట్లు సాధించిన ఇండియా కూటమి కంటే ఈ బలం ఎంతో తక్కువ. బీజేపీకి రెండుసార్లు మెజారిటీ సాధించి పెట్టి పదేళ్ల ప్రభుత్వాన్ని తిరుగులేకుండా నిర్వహించిన మోదీ ఇప్పటికే చరిత్రలో నిలిచిపోయారు. అయితే ఒక సంకీర్ణ ప్రభుత్వానికి సారథిగా అయిదేళ్ల పాలనను నిర్వహించిన పీవీ, వాజపేయి, పదేళ్ల పాటు యూపీఏ ప్రభుత్వాన్ని నిర్వహించిన మన్మోహన్ సింగ్ కూడా చరిత్రలో నిలిచిపోయిన నాయకులే. జాతీయ స్థాయిలో మెజారిటీ సంఖ్యాబలంతో ప్రభుత్వాన్ని పదేళ్లు నిర్వహించిన వ్యక్తే సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించవలసి వచ్చిన ఉదంతాలు భారతదేశంలో లేవు. అయినప్పటికీ మోదీ ఈ బాధ్యతను అవలీలగా నిర్వహిస్తారన్న విషయంలో అనుమానాలు అక్కరలేదు. అందుకు అనేక కారణాలున్నాయి.

ఒకటి, ఎన్డీఏలో బీజేపీ ఇప్పుడు 240 సీట్లు సాధించిన బలమైన పక్షం. కేవలం 32 సీట్లు అదనంగా ఉంటే చాలు ఆయన మెజారిటీకీ ఢోకా ఉండదు. పైపెచ్చు వాజపేయి లాగా ఆయనకు ఎన్డీఏలో బలమైన మద్దతు ఉన్నది. అప్పుడు 29 సీట్లతో మెజారిటీ మిత్రపక్షంగా తెలుగుదేశం, ఆ తర్వాత 20 సీట్లతో జేడీ (యు), డీఎంకే వంటి ఇతర పార్టీలు మద్దతునిచ్చినందువల్ల వాజపేయి అయిదేళ్లు తనదైన శైలిలో పాలనను నిర్వహించారు. ఇప్పుడు కూడా తెలుగుదేశం, జనతాదళ్ (యు)తో పాటు ఇతర పార్టీలు మోదీకి ఎన్నికల ముందే మద్దతు ప్రకటించి, బీజేపీతో పాటు మెజారిటీ సీట్లు గెలుచుకున్నాయి. అంతేకాక, ఇండియా కూటమికి 232 సీట్లు లభించినప్పటికీ అది పలు పార్టీల సముదాయం. అది ఏ కోశానా ఈ అయిదేళ్లలో మోదీ ప్రభుత్వానికి ఢోకా కల్పించే అవకాశాలు లేవు. ఒకసారి 145, రెండోసారి 206 సీట్లు సాధించిన కాంగ్రెసే పదేళ్ల పరిపాలన నిర్వహించగలిగినప్పుడు 240 సీట్లు సాధించిన మోదీ ఎందుకు సమర్థంగా పరిపాలన నిర్వహించలేరు?

అతి కష్టమ్మీద వంద సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ మరో 30, 40 సీట్లను అదనంగా సాధించి ఉంటే పరిస్థితులు వేరుగా ఉండేవి. కాని ప్రజలు భిన్నంగా తీర్పునిచ్చారు. ప్రతిపక్షాలను బలంగా ఏకం చేయగలిగిన జయప్రకాశ్ నారాయణ్, సూర్జిత్ వంటి నేతలు లేనందువల్ల అది కలిసికట్టుగా పోటీ చేయలేకపోయింది. నాయకత్వ లోపం స్పష్టంగా కనిపించినప్పటికీ కాంగ్రెస్, ఇతర పక్షాలు సామాజిక సమీకరణలు తమకు అనుకూలంగా మారేందుకు గట్టిగానే కృషి చేశాయని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వందకు పైగా ఎంపీల్లో 37 మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు కావడం గమనార్హం. వీరిలో అత్యధికులు 50 శాతం పైగా ఓట్లను సాధించారు. ఆశ్చర్యకరమేమంటే 5 జనరల్ సీట్లలో ఈ వర్గాలు గెలిచాయి. క్రమంగా కాంగ్రెస్ తన మూలాల్లోకి ప్రవేశిస్తున్నదనడానికి ఇది ఉదాహరణ. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో కేవలం అయిదు సీట్లు సాధించిన సమాజ్‌వాదీ పార్టీ ఈ సారి 37 సీట్లు సాధించడానికి ప్రధాన కారణం పెద్ద సంఖ్యలో దళితులు కూడా బీఎస్పీని వదిలి ఎస్పీ వైపు మొగ్గుచూపడం. యూపీలో ఇండియా కూటమికి యాదవ, ముస్లిం ఓట్లు సంఘటితం కావడం మాత్రమే కాక దళితులు కూడా అధిక సంఖ్యలో మద్దతునీయడం బీజేపీ విస్మరించదగిన పరిణామం కాదు. బీజేపీ గతంలో 224 సీట్లలో 50 శాతం పైగా ఓట్లను సాధిస్తే ఈ సారి కేవలం 156 సీట్లలోనే 50 శాతం పైగా ఓట్లు సాధించడం కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన విషయమే.



ఎన్డీయే భారతీయ ఆత్మ అని ప్రకటించిన మోదీ, జాతీయ ప్రయోజనాలతో ప్రాంతీయ ఆకాంక్షలు ముఖ్యమని చెప్పిన చంద్రబాబు అభివృద్ధి ఎజెండాలు పరస్పరం భిన్నమైనవి కావు. వారిద్దరి ఎజెండా ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఎజెండాకు భిన్నంగా ఏమీ లేదు. అందుకు ప్రత్యామ్నాయ ఎజెండా ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ప్రజల తీర్పుకు అనుగుణంగా వ్యవహరించడం మంచిదని గ్రహించినందువల్లనేమో ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత చాలా సహజంగా కనిపిస్తోంది.

బిహార్‌లో నితీశ్, చిరాగ్ పశ్వాన్, జితన్ రాంమాంఝీ వంటి సామాజిక శక్తులు లేకపోతే ఇవాళ ఆ రాష్ట్రంలో ఎన్డీఏ మెజారిటీ సీట్లు సాధించగలిగేది కాదనేది స్పష్టం. బహుశా ఈ విషయం గమనించినందువల్లే మోదీ యూపీ, బిహార్‌కు కేంద్ర కేబినెట్‌లో అత్యధిక మంత్రి పదవులు కల్పించి ఉండవచ్చు.

అయితే కాంగ్రెస్ విజయంతో ఆ పార్టీ నేతలు ఉబ్బితబ్బిబ్బు కానక్కర్లేదు. 2019లో కంటే అది కేవలం రెండున్నరశాతం ఓట్లను అధికంగా సాధిస్తే, బీజేపీ ఒక శాతం కంటే తక్కువ ఓట్లను కోల్పోయింది. సామాజిక న్యాయ ఎజెండాతో ఎన్నికల్లో ప్రవేశించిన ఇండియా కూటమి ఈ ఎజెండాను అన్ని చోట్లా ప్రజల్లోకి తీసుకువెళ్లలేకపోయినందువల్ల అనుకున్న ఫలితాలను సాధించలేకపోయింది. తెలంగాణలాంటి చోట్ల బీజేపీ ఉధృతిని అరికట్టలేకపోయింది. దాదాపు 40 శాతం మేరకు దళితులు, ఆదివాసీలు ఉన్న ఒడిషాలో బిజూజనతాదళ్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆదరిస్తున్న విషయం తెలిసినప్పటికీ కాంగ్రెస్ ప్రేక్షక పాత్ర పోషించింది. 35 శాతం దళితులు, ఆదివాసీలు ఉన్న మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతున్నా, ఆపగలిగే నేతలు ఆ పార్టీలో లేరు. ఛింద్వారా వంటి కాంగ్రెస్ కంచుకోటలో కూడా బీజేపీ విజయం సాధించింది.

సామాజిక పరిస్థితులు పూర్తిగా పరిపక్వం కాకుండా సమాజంలో ఏ మార్పూ సంభవం కాదని. మార్పుకు దోహదం చేసే శక్తులు ఇంకా బలహీనంగా ఉన్నాయని ఈ ఎన్నికలు నిరూపించాయి. అందువల్లే బహుశా భారత ప్రజలు మోదీని పూర్తిగా తిరస్కరించాలని అనుకోలేదని రుజువయింది. మోదీ ఆకర్షణ, ఆయన భావజాలం, ఆయన హావభావాలు, విన్యాసాలు ఆయన పట్ల ప్రజల్లో పూర్తిగా వికర్షణ కల్పించలేకపోయాయి. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆయనకు కూడా ఒక సందేశాన్ని ఇచ్చాయనడంలో అతిశయోక్తి లేదు. ఈ ప్రజాస్వామిక పోరు పూర్తిగా మోదీ పేరుపైనే జరిగినందువల్ల ఎన్నికల ఫలితాలు కూడా ప్రజలు మోదీని దృష్టిలో ఉంచుకున్నవే అని చెప్పక తప్పదు. ఆ విషయం గ్రహించినందువల్లే మోదీ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచీ పూర్తిగా మారిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయడానికి బదులు నేరుగా ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి తన నివాసంలోనూ, సెంట్రల్ హాలులోను చంద్రబాబు పక్కన కూర్చుని చెణుకులు విసురుతూ, నవ్వుతూ వ్యవహరించిన తీరు, మిత్రపక్షాల పట్ల ప్రదర్శించిన స్నేహశీలత విస్మరించదగిన దృశ్యాలు కావు. ఎన్డీయే భారతీయ ఆత్మ అని ప్రకటించిన మోదీ, జాతీయ ప్రయోజనాలతో ప్రాంతీయ ఆకాంక్షలు ముఖ్యమని చెప్పిన చంద్రబాబు అభివృద్ధి ఎజెండాలు పరస్పరం భిన్నమైనవి కావు. వారిద్దరి ఎజెండా ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఎజెండాకు భిన్నంగా ఏమీ లేదు. అందుకు ప్రత్యామ్నాయ ఎజెండా ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ప్రజల తీర్పుకు అనుగుణంగా వ్యవహరించడం మంచిదని గ్రహించినందువల్లనేమో ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత చాలా సహజంగా కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)

తీర్పు 2024 2

బీజేపీ ఎలా ఓడిపోయింది?



■ యోగేంద్ర యాదవ్

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పాలక పక్షం భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పుగా అర్థం చేసుకోవడం సబబేనా? సబబేనని మాలో ఒకరు (యోగేంద్ర యాదవ్) గట్టిగా వాదించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సంఖ్యా బలం ఎన్డీఏకు సమకూరింది. అయితే బీజేపీ తన మెజారిటీని కోల్పోవడమే కాదు, ప్రజామోదాన్ని పొందడంలో కూడా విఫలమయింది. ప్రత్యర్థి పక్షం ఏదీ తన దరి దాపుల్లోకి రాని రీతిలో ఏకైక పెద్ద పక్షంగా బీజేపీ ఆవిర్భవించింది. అయితే 400కి పైగా సీట్లను గెలవాలని, 50 శాతానికి పైగా ఓట్లను కైవసం చేసుకోవాలని స్వయంగా నిర్దేశించుకున్న లక్ష్యాల వెలుగులో బీజేపీ సంఖ్యా బలాన్ని పరిశీలించవలసి వున్నది. అంతకంటే ముఖ్యంగా ఎన్నికల ఫలితాలను వాటి రాజకీయ సందర్భంలో చూడవలసి ఉంది. ఈ సార్వత్రిక ఎన్నికలలో ధన బలం, మీడియా మద్దతు, ప్రభుత్వ యంత్రాంగం, మరీ ముఖ్యంగా ఎన్నికల సంఘం మొదలైనవన్నీ ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ఉన్నాయన్న కఠోర వాస్తవం నేపథ్యంలో బీజేపీ జయాపజయాలను అంచనా వేయవలసి ఉంది.

ఈ అవగాహనకు ఒక సంభావ్య వ్యతిరేక వాదన బీజేపీ ఓట్ల వాటా కథ. పాలక పక్షం ఓట్ల వాటా 37.4 శాతం నుంచి 36.6 శాతానికి మాత్రమే పడిపోయింది. నిజానికి ఇది ఉపేక్షణీయమైనది. ఒడిషాలో బీజేపీ ఆశ్చర్యకరంగా జయపతాక నెగురవేసింది. కేరళలో పలు అవరోధాలను అధిగమించి తన ఉనికిని నెలకొల్పుకున్నది. ఆంధ్ర, పంజాబ్‌లలో తన ఉనికిని మెరుగుపరచుకున్నది. మొత్తం మీద దేశవ్యాప్తంగా తన ఉనికిని సుస్థిరపరచుకోవడంలో బీజేపీ పూర్తిగా సఫలమయింది అన్ని రాష్ట్రాలలోను రెండంకెల శాతంలో ఓట్ల వాటాను సాధించుకున్నది. ఈ వాస్తవాల ప్రాతిపదికన సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ విజయం సాధంచిందని ఆ పార్టీ మద్దతుదారులు వాదిస్తున్నారు. స్వతంత్ర పరిశీలకులు వారితో ఏకీభవించడం లేదు.

రాష్ట్ర స్థాయి ఓట్ల వాటాలను నిశితంగా పరిశీలిస్తే పాలక పక్షాలు కొన్ని ప్రాంతాలలో ఓడిపోయి, మిగతా ప్రాంతాలలో లబ్ధి పొందిన కథ కాదని అర్థమవుతుంది. నిజానికి బీజేపీ పాలక పక్షంగా లేని ప్రతి చోటా ఓటర్లు అక్కడి పాలకపక్షానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో రెండు విభిన్న బీజేపీలు పోటీ చేశాయి. ఒకటి పాలకపక్ష బీజేపీ; రెండు ప్రతిపక్ష బీజేపీ. పాలకపక్ష బీజేపీ ఈ ఎన్నికలలో తీవ్రంగా నష్టపోగా సవాల్‌దార్ బీజేపీ గణనీయంగా లబ్ధి పొందింది. పాలకపక్షాలు, రాజకీయ ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా వేసిన ఓటుతో కొన్ని రాష్ట్రాలలో బీజేపీ బాగా లబ్ధి పొందింది. అయితే బీజేపీకి దక్కిన ఈ లబ్ధి జాతీయ స్థాయిలో ప్రజా తీర్పు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉందన్న వాస్తవాన్ని పాక్షికంగా కప్పిపుచ్చింది దీని వల్ల బీజేపీ దీర్ఘకాలిక లబ్ధి పొందే అవకాశం లేదు.

దేశ వ్యాప్తంగా మూడింట రెండు వంతుల నియోజకవర్గాలలో (కచ్చితంగా చెప్పాలంటే 356 సీట్లు) బీజేపీ ప్రాబల్య రాజకీయ పక్షంగా ఉన్నది. రాష్ట్ర పాలక పక్షంగా లేని చోట్ల కూడా అది ఆధిపత్య పార్టీగా ఉన్నది. బీజేపీ ప్రాబల్య నియోజకవర్గాలు పశ్చిమాన మహారాష్ట్ర, గుజరాత్ నుంచి తూర్పున బిహార్, జార్ఖండ్ దాకా విస్తరించి వున్నాయి. బీజేపీ ప్రస్తుతం పాలకపక్షంగా లేని కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లు కూడా ఈ పరిధిలోకి వస్తాయి. ఈ రాష్ట్రాలలో తీవ్ర నష్టాలను చవిచూసింది. దాని రాజకీయ గుత్తాధిపత్యానికి తీవ్ర విఘాతమేర్పడింది. గత సార్వత్రిక ఎన్నికలలో గెలుచుకున్న 271 నియోజకవర్గాలలో 75ను ఈ సారి కోల్పోయింది అయితే మిగతా రాష్ట్రాలు, ప్రాంతాలలో (187 సీట్లు) బీజేపీ పాలక పక్షాల, రాజకీయ ఆధిపత్య వర్గాల వ్యతిరేక శక్తిగా ఎన్నికల గోదాలోకి దిగింది. అధికారంలో ఉన్న లేదా ప్రాబల్య రాజకీయ పక్షాలను సవాల్ చేసింది. ఒడిషాలో బిజూ జనతాదళ్, ఆంధ్రలో వైసీపీ, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని బీజేపీ సవాల్ చేసింది. ఇలా ఆయా రాష్ట్రాలలోని పాలక పక్షాలను సవాల్ చేయడం ద్వారా బీజేపీ లబ్ధి పొందింది. ఈ 187 సీట్లలో గతంలో గెలుచుకున్న వాటి కంటే ఈ సారి 12 సీట్లను అదనంగా కైవసం చేసుకున్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే బీజేపీకి 6 శాతం ఓట్లు పెరిగాయి. ఈ మొగ్గు జాతీయ స్థాయిలో ఓట్ల వాటా తగ్గుదలను 1 శాతం మేరకు నివారించింది.

బీజేపీ ఓట్ల వాటా పైకి కనిపించిన దాని కంటే అధ్వాన్నంగా ఉన్నది. 2019లోను, 2024లోను పోటీ చేసిన నియోజకవర్గాలు 399 ఉన్నాయి. వీటిలో 274 నియోజకవర్గాలలో ఓట్ల శాతం బాగా పడిపోయింది. మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్, జార్ఖండ్, హర్యానా, హిమాచల్, పంజాబ్, జమ్ము–కశ్మీర్‌లలో బీజేపీ పోటీ చేసిన అన్ని నియోజకవర్గాలలోను ఆ పార్టీ ఓట్ల వాటా తగ్గిపోయింది. యూపీలో రెండు స్థానాలలో మినహా మిగతా నియోజకవర్గాలు అన్నిటిలోను బీజేపీ ఓట్ల వాటా గణనీయంగా తగ్గింది 20 శాతానికి పైగా ఓట్లతో గెలిచిన స్థానాల సంఖ్య 151 నుంచి 77కి తగ్గిపోయింది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖీ పోటీ జరిగిన 215 స్థానాలలో బీజేపీకి పడిన ఓట్ల పెరుగుదలను చూద్దాం. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ నియోజకవర్గాలలో 90 శాతానికి పైగా కైవసం చేసుకున్నది. ఈ సారి బీజేపీ 153 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. 62 స్థానాలను కాంగ్రెస్‌కు కోల్పోయింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఈ నియోజకవర్గాలలో బీజేపీ వ్యతిరేక ఓట్లు 5.5 శాతం పెరిగాయి. ఇది బీజేపీకి తీవ్ర పరాజయమని చెప్పక తప్పదు.

భారతీయ జనతా పార్టీ ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో, పాలకపక్షంగా ఉన్న రాష్ట్రాలలో తీవ్ర నష్టాలను చవిచూసింది. పాలకపక్షాలుగా ఉన్న ప్రత్యర్థి పార్టీలను సవాల్ చేసిన రాష్ట్రాలలో గణనీయమైన లబ్ధి పొందింది. వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో, కాంగ్రెస్‌కు పట్టిన గతి తనకు పట్టకుండా ఉండేందుకు దోహదం చేసే మార్గాలను బీజేపీ కనుగొనవలసి ఉన్నది. పైగా నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి క్షీణించిపోతున్న తరుణమిది. తిరుగులేని భవిష్యత్తును నిర్మించుకునే విషయంలో బీజేపీకి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు అంతగా నమ్మకాన్ని, భరోసాను ఇవ్వలేవు.



బీజేపీ పాలకపక్షంగా ఉన్న రాష్ట్రాలలో ఆ పార్టీ పోటీ చేసిన స్థానాలలో దానికి వ్యతిరేకంగా పడిన ఓట్ల శాతం గణనీయమైన స్థాయిలో ఉన్నది. ఈ నెగెటివ్ ఓటు రాజస్థాన్‌లో 12 శాతం, హర్యానాలో 12 శాతం, హిమాచల్‌లో 13 శాతం మేరకు ఉన్నది. ఇదే రాష్ట్రాలలో బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుపొందింది. అయితే ప్రస్తుత ఎన్నికలలో రాజస్థాన్, హర్యానాలలోని కొన్ని ప్రాంతాలలో బీజేపీ పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగిపోవడంతో ఆ పార్టీ గణనీయమైన సంఖ్యలో సీట్లను కోల్పోయింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ తీవ్రంగా నష్టపోయింది ఈ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా పడిన ఓట్ల శాతం (6.8శాతం), దాని ఇరుగు పొరుగు రాష్ట్రాలలో నమోదైన బీజేపీ వ్యతిరేక ఓటుతో ఇంచుమించు సమరీతిలో ఉండడం గమనార్హం. బీజేపీ వ్యతిరేక ఓటు బిహార్‌లో 6.9 శాతం మేరకు, జార్ఖండ్‌లో అది 7 శాతం మేరకు ఉన్నది.

బీజేపీ ఓట్ల వాటాలో స్వల్పస్థాయి తగ్గుదల కర్ణాటక, అస్సాం, డిల్లీ, ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకున్నది. ఈ అన్ని రాష్ట్రాలలో (కర్ణాటక మినహా) పాలకపక్షం తన సీట్లను చాలావరకు కాపాడుకోగలిగింది. కర్ణాటకలో బీజేపీ వ్యతిరేక ఓటు కొన్ని ప్రాంతాలలో మాత్రమే కేంద్రీకృతమైనప్పటికీ బీజేపీ చాలా సీట్లను కోల్పోయింది. పాలకపక్ష బీజేపీ నష్టపోని రాష్ట్రాలు గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మాత్రమే. ఈ రాష్ట్రాలలో ప్రతిపక్షం బలహీనంగా ఉండంతో బీజేపీ లబ్ధి పొందింది. బీజేపీ ఓట్లను కొల్లగొట్టడంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమయింది.

బీజేపీ ప్రతిపక్ష పాత్ర నిర్వహించిన రాష్ట్రాలలో పాలకపక్షాల పట్ల వ్యతిరేకత జాతీయ పాలకపక్షానికి సానుకూలంగా పరిణమించింది. తెలంగాణలో బీఆర్ఎస్ పరోక్ష మద్దతు కారణంగా బీజేపీ తన ఓట్ల వాటాను 15.7 శాతం మేరకు అదనంగా పెంచుకున్నది. ఒడిషాలో 7 శాతం అదనపు ఓట్ల పెరుగుదలతో అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంతో పాటు ఆ రాష్ట్రంలో అధికార పీఠాన్ని కూడా కైవసం చేసుకుంది. కేరళలో 3 శాతం అదనపు ఓట్ల పెరుగుదలతో ఆ రాష్ట్రంలో తన మొదటి లోక్‌సభా స్థానాన్ని బీజేపీ గెలుచుకున్నది. తమిళనాడు, పంజాబ్‌లలో ఒక కీలక భాగస్వామ్య పక్షాన్ని కోల్పోయిన కారణంగా ఆ మాజీ మిత్రపక్షానికి అనుకూలంగా ఉండే సామాజికవర్గాల మద్దతును బీజేపీ కోల్పోయింది. ఆ రాష్ట్రాలలో గతంలో కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేసిన కారణంగా బీజేపీ తన ఓట్ల వాటాను మొత్తంగా పెంచుకున్నప్పటికీ విడివిడి నియోజకవర్గాలలో దాని ఓట్ల వాటా స్వల్పంగా తగ్గిపోయింది. ఈ ధోరణికి పశ్చిమ బెంగాల్ ఒక మినహాయింపుగా కనిపిస్తున్నది. ఈ రాష్ట్రంలో పాలక తృణమల్ కాంగ్రెస్‌ను బీజేపీ గట్టిగా ఎదుర్కొన్నది. అయితే ఓట్ల వాటాలో 1.3 శాతాన్ని కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన పరాజయం నుంచి బీజేపీ ఇప్పటికీ కోలుకోలేదని ఆ ఓట్ల వాటా తగ్గుదల స్పష్టం చేసింది.

భారతీయ జనతా పార్టీ ప్రజామోదాన్ని పొందిందా అన్నది ఈ సార్వత్రిక ఎన్నికల అసలు ప్రశ్నగా చెప్పి తీరాలి. 400కు పైగా సీట్లను, 50 శాతానికి పైగా ఓట్లను గెలుచుకోవాలన్న లక్ష్యాన్ని బీజేపీ తనకుతాను నిర్దేశించుకున్నది. ఆ రికార్డు స్థాయి సీట్లు, ఓట్లు సాధిస్తాననే ఆత్మవిశ్వాసాన్ని ఆ పార్టీ పదేపదే వ్యక్తం చేసింది. ఎన్నికల షెడ్యూలును ప్రకటించక ముందే బీజేపీనే మళ్లీ విజేత అని సర్వత్రా భావించడం జరిగింది. ఆ పార్టీ శ్రేణులకైతే ఈ విషయంలో ఇసుమంత సందేహం కూడా లేదు. బీజేపీ ప్రత్యర్థి పక్షాల సంఖ్యా బలం గురించి ఎవరూ పట్టించుకోలేదు. బీజేపీ మిత్రపక్షాల సంఖ్యా బలంపై కూడా ఎవరూ శ్రద్ధ చూపలేదు మోదీ, ఆయన పార్టీ కేంద్రంగా జరిగిన అధికార క్రీడలో ఆ అంశాలన్నీ యాదృచ్ఛికమైనవేనని భావించడం జరిగింది. బీజేపీ భవిష్యత్తుకు సంబంధించిన నిజమైన ప్రశ్న: పాలకపక్ష బీజేపీని ప్రతిపక్ష బీజేపీ ఎలా రక్షించగలుగుతుంది? బీజేపీ ఎదుగుదలకు ఆస్కారమున్న రాష్ట్రాలు ఇప్పుడు ఎన్నో లేవు. వివిధ రాష్ట్రాలలో పాలకపక్షాలను సవాల్ చేసిన రాజకీయ శక్తిగా బీజేపీకి సమకూరిన సానుకూలతలు సుదీర్ఘకాలం పాటు కొనసాగవు. ఇది స్పష్టం. వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో, కాంగ్రెస్‌కు పట్టిన గతి తనకు పట్టకుండా ఉండేందుకు దోహదం చేసే మార్గాలను పాలకపక్ష బీజేపీ కనుగొనవలసి ఉన్నది. పైగా నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి క్షీణించిపోతున్న తరుణమిది. తిరుగులేని భవిష్యత్తును నిర్మించుకునే విషయంలో బీజేపీకి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు అంతగా నమ్మకాన్ని, భరోసాను ఇవ్వలేవు.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది రెండవది)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

ఆంధ్రజ్యోతి
బుధవారం • 12 జూన్ 2024
నవ్య 5
కుటుంబ కదంబం

ఫ్యాషన్

లవ్లీ రెయిన్‌కోట్స్



వర్షాకాలం వేసుకునే రెయిన్ కోట్స్ ఆకర్షణీయమైన రంగుల్లో, అందమైన మోడళ్లలో తయారవుతున్నాయి. వేసుకునే దుస్తులకు తగ్గట్టు రకరకాల మోడల్స్‌లో దొరుకుతున్న రెయిన్ కోట్స్ మీద ఓ లుక్కేద్దామా?

సాధారణంగా రెయిన్ కోట్స్ పాలియెస్టర్, రెయాన్ మెటీరియల్స్‌తో తయారవుతూ ఉంటాయి. నైలాన్‌తో పోలిస్తే పాలియెస్టర్ మెటీరియల్ తడిని సమర్థంగా ఆపుతుంది. అలాగే రెయిన్‌కోట్స్ డిజైన్ ఆధారంగా వాటికి వేర్వేరు పేర్లు కూడా ఉన్నాయి.

పాంచో రెయిన్‌కోట్: ఈ రెయిన్‌కోట్ ప్లాస్టిక్‌తో తయారవుతుంది. తేలికగా ఉండే ఈ రెయిన్‌కోట్‌ను సునాయాసంగా మడత పెట్టేసి, వెంట తీసుకెళ్లిపోవచ్చు.

పాకెట్ రెయిన్‌కోట్: రెయిన్‌కోట్ కోసం ప్రత్యేకమైన సంచిని కేటాయించ లేనివాళ్లు, ఉపయోగించని సమయాల్లో దాన్ని భద్రంగా దాచాలనుకునేవాళ్లకు అనువైన రెయిన్ కోట్ ఇది. లైట్ వెయిట్, రీయూజబుల్ మెటీరియల్‌తో తయారయ్యే ఈ రెయిన్‌కోట్‌ను చిన్నపాటి పాచ్‌లో, లేదా జేబులో దాచేయవచ్చు.


వాటర్ ప్రూఫ్ రెయిన్‌కోట్: వాటర్‌ప్రూఫ్ రెయిన్‌కోట్స్, వాటర్ రిపెల్లెంట్ రెయిన్‌కోట్స్ కంటే మంచివి. వాటర్ రిపెల్లెంట్ రెయిన్ కోట్స్ తయారీలో నీటిని అంటుకోనివ్వకుండా చేసే రసాయనాలను ఉపయోగిస్తారు. కాబట్టి వాటర్ ప్రూఫ్ తరహా రెయిన్‌కోట్స్‌నే ఎంచుకోవాలి.



క్రీ.శ 1200వ శతాబ్దంలో అమేజాన్ ప్రాంతాల్లో మొట్టమొదటిసారిగా రెయిన్‌కోట్స్‌ను ఉపయోగించిన చారిత్రక ఆధారాలున్నాయి. పాలను పోలిన జిగట పదార్థంతో (రబ్బర్ చెట్ల జిగురు) అప్పట్లో రెయిన్‌కోట్లను తయారుచేసేవారు. యూరోపియన్లు, అన్వేషకులు, అమెరికాస్‌కు ప్రయాణించినప్పుడు, వాన నీళ్లకు తడిచిపోకుండా కాపాడే ఈ రెయిన్‌కోట్లను వాళ్లు కనుగొన్నారు. అమేజాన్ ప్రాంత ప్రజలు రబ్బరు పాలతో రెయిన్‌కోట్లను తయారుచేసుకున్న విధానాన్ని, యూరోపియన్లు, 1700 శతాబ్దంలో కనిపెట్టగలిగారు. అలా అప్పటి నుంచి మెరుగైన రెయిన్‌కోట్ల తయారీ పరిశోధనలు మొదలయ్యాయి. 1824లో, స్కాట్‌ల్యాండ్ కెమిస్ట్, మొట్టమొదటి ఆధునిక రెయిన్‌కోట్‌ను తయారుచేశాడు. దాని తయారీకి ఉపయోగించిన టార్పాలిన్ వస్త్రాన్ని, ఇండియన్ రబ్బర్ క్లాత్ అని అతను సంబోధించేవాడు. అలా అప్పటి నుంచి రెయిన్‌కోట్లు ఎన్నో మార్పులకు గురవుతూ, ఫ్యాషన్ ప్రపంచంలో సైతం ఉనికిని చాటుకోగలిగే స్థాయికి ఎదిగాయి.

విన్నర్

మట్టి కోట మహారాణి



రికార్డులు బద్దలు కొట్టడం ఆమెకు కొత్త కాదు.
పంథొమ్మిదేళ్ల వయసులోనే 'రొలాండ్ గారోస్'ను ముద్దాడింది.
దిగ్గజాలు తలపడే గ్రాండ్‌స్లామ్‌ల్లో విజయాలూ తక్కువేం లేవు.
నాలుగేళ్లలో ఐదు టైటిళ్లు సాధించింది.
ఇప్పుడు... వరుసగా మూడోసారి 'ఫ్రెంచ్ ఓపెన్' నెగ్గి...
మట్టి కోట మహారాణిగా పూలాభిషేకం అందుకొంటోంది.
పోలెండ్ టెన్నిస్ సంచలనం... ప్రపంచ నెంబర్ వన్...
23 ఏళ్ల ఇగా స్వియాటెక్ జైత్రయాత్ర ఇది...

రాకెట్ పట్టి.. టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టే ఎవరైనా కనే ఒకే ఒక్క కల.. గ్రాండ్‌స్లామ్ టైటిల్. మహామహులు తలపడే ఈ మహాసంగ్రామంలో ప్రతి గెలుపు వెనుకా స్ఫూర్తి నింపే జీవిత కథలు ఎన్నో ఉంటాయి. అలుపెరుగని కృషి, పట్టుదల ఉంటాయి. అలాంటి ఒక కథే ఇగా స్వియాటెక్‌ది. పోలెండ్ దేశం వార్సాలో పుట్టింది. ఆమె తండ్రి టోమజ్ కూడా క్రీడాకారుడే. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో జాతీయ రోయింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. తల్లి డొరోటా వైద్యురాలు. అక్క అగట డెంటిస్ట్. తన ఇద్దరు కూతుళ్లను క్రీడాకారులుగా చూడాలనేది టోమజ్ ఆకాంక్ష. దానికి తగినట్టుగానే అగట స్విమ్మింగ్ మొదలుపెట్టింది. కొన్ని కారణాలవల్ల కొన్నాళ్లకు టెన్నిస్‌ను ఎంచుకుంది. అక్కను చూసి స్వియాటెక్ టెన్నిస్ రాకెట్ పట్టుకుంది. ఎందుకంటే అక్కను ఓడించాలని. అయితే ఐటీఎఫ్ జూనియర్ సర్క్యూట్ వరకు పోటీపడిన అగట... గాయాల కారణంగా పదిహేనేళ్ల వయసులో ఆట నుంచి తప్పుకుంది. కానీ స్వియాటెక్ మాత్రం ఎన్ని అవరోధాలు ఎదురైనా పట్టిన రాకెట్ వదల్లేదు. దృఢ సంకల్పంతో ముందుకు సాగింది. పదమూడేళ్లకే ప్రొఫెషనల్ టెన్నిస్ అకాడమీకి వెళ్లి... కఠోర సాధన ప్రారంభించింది.

గెలుపు బాట...

2015 నుంచి ఐటీఎఫ్ జూనియర్ స్థాయిలో పోటీపడిన స్వియాటెక్.. ఆ ఏడాది నాలుగు టైటిళ్లు గెలుచుకుంది. ఆ మరుసటి సంవత్సరం జూనియర్ గ్రాండ్‌స్లామ్‌లోకి అడుగుపెట్టి.. 'ఫ్రెంచ్ ఓపెన్' డబుల్స్, సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్ వరకు వెళ్లింది. 2018లో కాటీ మెక్‌నలీతో కలిసి 'ఫ్రెంచ్ ఓపెన్' బాలికల డబుల్స్ టైటిల్ సాధించిన స్వియాటెక్.. అదే ఏడాది 'వింబుల్డన్' గర్ల్స్ సింగిల్స్ విజేతగా నిలిచింది. అప్పటికి ఆమె కెరీర్‌లో అతిపెద్ద విజయం అది. ఇక నాటి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. ఆ విజయాలు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో 'డబ్ల్యూటీఏ' (ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్) టూర్‌లో పాల్గొంది. పద్దెనిమిదేళ్ల వయసులో... గ్రాండ్‌స్లామ్స్‌లోకి ప్రవేశించింది. 'ఆస్ట్రేలియన్ ఓపెన్', 'ఫ్రెంచ్ ఓపెన్'లలో పోటీపడింది.

సంచలనాలకు చిరునామా...

సంచలనాలకు చిరునామా... స్వియాటెక్ కెరీర్. 2016 నుంచి 2018 వరకు రెండేళ్ల కాలంలో ఆడిన ఏడు ఐటీఎఫ్ సర్క్యూట్ ఫైనల్స్‌లో ఓటమి ఎరుగని క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. ఒక టోర్నీ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆమె కొట్టిన క్రాస్ కోర్ట్ ఫోర్‌హ్యాండ్ డ్రాప్ షాట్.. 'డబ్ల్యూటీఏ షాట్ ఆఫ్ ద ఇయర్' (2019)గా ఎంపికైంది. తొలిసారి 'టాప్ 100'లో చోటు సంపాదించింది. అయితే ఆ తరువాత జరిగిన 'వింబుల్డన్', 'యూఎస్ ఓపెన్', కెనడియన్ ఓపెన్'లలో వరుస ఓటములు ఎదురయ్యాయి. కానీ ఆమె నిరాశ చెందలేదు. రెట్టించిన ఉత్సాహంతో.. మరింత కఠోర సాధనతో... తిరిగి పుంజుకుంది. తనకంటే మెరుగైన సీడ్స్‌ను మట్టి కరిపిస్తూ... ప్రపంచ మహిళల ర్యాంకింగ్స్‌లో 'టాప్ 50'లోకి దూసుకుపోయింది. అదే సమయంలో కాలి గాయం ఆమెను కొన్నాళ్లు ఆటకు దూరం చేసింది.



హ్యాట్రిక్ కొట్టి...

పాదానికి శస్త్రచికిత్స తరువాత స్వియాటెక్ మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టింది. 54వ ర్యాంకర్‌గా 2020 'ఫ్రెంచ్ ఓపెన్' బరిలోకి దిగిన ఆమె... సంచలన విజయాలు నమోదు చేసింది. 2019 రన్నరప్, ప్రపంచ 19వ ర్యాంకర్ మార్కెటా వోండ్రొసోవాను తొలి రౌండ్‌లో ఇంటికి పంపించిన స్వియాటెక్... నాలుగో రౌండ్‌లో టాప్‌సీడ్, టైటిల్ ఫేవరెట్ సిమోనా హలెప్‌కు షాకిచ్చింది. తద్వారా సిమోనా 17 వరుస విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది. అంతిమ పోరులో ప్రపంచ ఆరో ర్యాంకర్ సోఫియా కెనిన్‌ను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ గెలిచిన పోలెండ్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. అంతేకాదు... 'ఫ్రెంచ్ ఓపెన్' సింగిల్స్ టైటిల్ సాధించిన పిన్న వయస్కురాలిగా రికార్డును తిరగరాసింది. 2022 ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకం. ఆ ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్) ఆమె ఖాతాలో చేరాయి. మరుసటి సంవత్సరం కూడా 'ఫ్రెంచ్ ఓపెన్' సొంతం చేసుకున్న స్వియాటెక్... ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకుంది. గతవారం ముగిసిన టోర్నీ ఫైనల్‌లో 6-2, 6-1తో పన్నెండో సీడ్ పొలినీని చిత్తు చేసి, మట్టి కోటలో హ్యాట్రిక్ టైటిల్స్ సాధించింది. 'రొలాండ్ గారోస్'లో హెనిన్, మోనికా సెలెస్ తరువాత వరుసగా మూడు టైటిల్స్ గెలిచిన మూడో క్రీడాకారిణి స్వియాటెక్.

అంచనాలు పెరుగుతున్నాయి...

ఇప్పటి వరకు మొత్తం 22 సింగిల్స్ టైటిల్స్ సాధించిన స్వియాటెక్‌పై అంచనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. 'గత ఏడాది దాదాపు ఆడిన అన్ని టోర్నీలు గెలవడంతో... ప్రతిసారీ అదే స్థాయిలో ఆడగలనని ప్రతిఒక్కరూ ఊహిస్తున్నారు. అది సాధ్యం కాదు. ఎందుకంటే ప్రొఫెషనల్ క్రీడాకారులు అందరూ అద్భుతమైన ప్రతిభ గలవారే. అయితే ఎవరైతే ఒత్తిడి పరిస్థితులను తట్టుకొని మానసికంగా దృఢంగా ఉండగలరో వారే చాంపియన్లు అవుతారు' అంటున్న స్వియాటెక్ ఎక్కడికి వెళ్లినా ఒక స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ను వెంట తీసుకువెళుతుంది. మానసిక ఆరోగ్యానికి ఆమె అంతగా ప్రాధాన్యతనిస్తుంది. 'కెరీర్ ఆరంభం రోజులతో పోలిస్తే నా జీవితం సమూలంగా మారిపోయింది. అయినా ఇవాల్టికీ నేను అదే మనిషిని. నాలో ఎలాంటి మార్పూ రాలేదు. కారణం... మానసిక పరివర్తన. చిన్నప్పటి నుంచి నాతో సైకాలజిస్ట్ ఉంటున్నారు. తను నా క్లిష్ట పరిస్థితులు, అలాగే గెలుపు క్షణాలు దగ్గర నుంచి గమనిస్తుంటుంది. నాకేంకావాలో చెబుతుంది' అంటున్న ఈ పోలెండ్ స్టార్... అపజయాన్నే కాదు, విజయాన్ని ఎదుర్కోవడం కూడా అంత సులువు కాదని చెబుతోంది. ఎంత ఎదిగినా... ఇంటికి ఎన్ని గ్రాండ్‌స్లామ్ ట్రోఫీలు తీసుకెళ్లినా... స్వియాటెక్‌లో ఇసుమంతైనా గర్వం కనిపించదు. అదే ఆమె ప్రత్యేకత.

ఆటకు ముందు సంగీతం...

మ్యాచ్‌కు ముందు ఇంపైన సంగీతం ఆస్వాదించడం స్వియాటెక్‌కు అలవాటు మాత్రమే కాదు... సెంటిమెంట్ కూడా. "గన్స్ ఎన్ రోజెస్, లెడ్ జెప్పెలిన్, జానిస్ జోప్లిన్, లెన్నీ క్రావిట్జ్ సంగీతం తరచూ వింటుంటాను. మొదట్లో మ్యాచ్‌లకు ముందు 'వెల్కమ్ టూ జంగిల్' పాప్ సాంగ్స్ వినేదాన్ని. ఎప్పుడూ ఒకే సంగీతం కాకుండా... ఎప్పటికప్పుడు మారుస్తుంటాను. లేకపోతే అది ఒక మూఢనమ్మకంలా మారిపోతుంది" అంటుంది స్వియాటెక్.

పుస్తకాలు అద్భుత నేస్తాలు...

"నేను టెన్నిస్ కోర్టులో హోరాహోరీగా పోరాడతాను. దూకుడుగా ఆడతాను. ప్రతి పాయింట్‌నూ, దానికి ప్రేక్షకులు కొట్టే చప్పట్లను ఆస్వాదిస్తాను. కానీ కోర్టు బయటకు వెళితే నేను పూర్తి భిన్నమైన వ్యక్తిని. ప్రశాంతంగా గడపడానికి ఇష్టపడతాను. రణగొణ ధ్వనులు, జనసమర్థమైన ప్రదేశాలు నచ్చవు. ఒంటరిగా కూర్చొని 'నేషనల్ జియోగ్రఫిక్' చానల్ చూస్తుంటాను. పుస్తకాలు బాగా చదువుతాను. ఇవాళ ప్రతిఒక్కరూ సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడిపి, విలువైన సమయం వృథా చేస్తున్నారు. పుస్తక పఠనం మరిచిపోయారు. సామాజిక మాధ్యమాలే కాదు... ఖాళీ సమయంలో పుస్తకాలు కూడా అద్భుత నేస్తాలు."

చాలామంది జీవితంలో చిన్న పరీక్షలు, ఇబ్బందులు వచ్చినా ఇట్టే డీలా పడిపోతారు. కొందరు మాత్రం ఎన్ని సమస్యలొచ్చినా ముందుకే అడుగులేస్తారు. అలాంటి కోవలోకే అంచల్ భటేజా చెందుతుంది. పదో తరగతి పరీక్షల ముందు కంటిచూపు కోల్పోయిన అంచల్ ఆ తర్వాత అచంచలమైన విశ్వాసంతో లాయరైంది. ఆమె ప్రస్థానమిదే..

స్ఫూర్తిదాయకం.. అంచల్ కథ



ఈ ప్రపంచాన్ని చూడటానికి కళ్లు కావాలి. కళ్లు లేకపోతే ప్రపంచమే లేదు. అంచల్ భటేజాకు కళ్ల జబ్బు ఉందని.. ఎప్పుడైనా కళ్లు కనిపించకుండా పోవచ్చనే విషయం తల్లితండ్రులకు ముందే తెలుసు. కానీ మంచి ఆహారం.. మందులు- ఇలా వీలైనన్ని శ్రద్ధలు తీసుకున్నారు. కానీ 10వ తరగతికి వచ్చేసరికి- అంచల్‌కు దృష్టి మందగించటం మొదలైంది. డాక్టర్ దగ్గరకు వెళ్లే చూపు కోల్పోయే సమయం వచ్చిందని చెప్పారు. 10వ తరగతి పరీక్షల ముందు అంచల్‌కు చూపు పూర్తిగా పోయింది. దానితో తన తరఫున పరీక్షలు రాయటానికి సహాయకులను పెట్టుకొని పదో తరగతి పాస్ అయింది. కాలేజీలో కూడా చేరింది. అంచల్‌కు అసలైన సవాలు అప్పుడు ఎదురయింది. సాధారణంగా విన్న విషయాల కన్నా చదివిన విషయాలను మన మెదడు గుర్తుపెట్టుకుంటుంది. అయితే చూపు లేనివారిలో గ్రహణ శక్తి బాగా పెరుగుతుంది. అంచల్ ఇలా తన సామర్థ్యాన్ని పెంచుకోవాలనుకుంది. చూపు లేని వారి కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలో తయారుచేసిన పుస్తకాలు చదవటం ప్రారంభించింది. ప్రత్యేకమైన రీడింగ్ టూల్స్‌ను నేర్చుకొని ప్రాక్టీసు చేయటం మొదలుపెట్టింది. అందరూ అంచల్ ఏకాగ్రతను చూసి ఆశ్చర్యపోయేవారు. కళ్లు లేవు కాబట్టి పరీక్షలు రాయటానికి ఒక సహాయకుడిని ఇచ్చేవారు. అంచల్ వారి ద్వారా పరీక్షలు రాసేది. ఎంత ఏకాగ్రతతో పరీక్షలు రాసేదంటే- మిగిలిన వారి కన్నా ఆమె అరగంట ముందే సమాధానాలు రాసేది. ఇలాగే పోటీ పరీక్షలు కూడా రాయటం ప్రారంభించింది. కానీ ఆమెకు టెక్నాలజీని ఉపయోగించుకోవటం ద్వారా మరిన్ని మంచి ఫలితాలు ఉంటాయనిపించింది. దీనితో అంధుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన లాప్‌టాప్‌ను ఉపయోగించటం ప్రారంభించింది. ఈ సమయంలోనే అంచల్- కామన్ లా అడ్మిషన్ టెస్ట్(సీలాట్)ను రాసి బెంగుళూరులోని ప్రతిష్టాత్మకమైన నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయూ)లో సీటు సంపాదించింది. ఈ యూనివర్సిటీలో సీటు సంపాదించిన తొలి అంధ విద్యార్థి అంచల్ కావటం ఒక విశేషం!

అదే ప్రారంభం...

లా కాలేజీలో సీటు సంపాదించటంతో అంచల్ ఆగిపోలేదు. ఆమె కథ అక్కడే మొదలయింది. లా చదువుతున్న సమయంలో తొలి ఏడాదే లాప్‌టాప్‌లో పరీక్షలు రాయటం ప్రారంభించింది. సాధారణంగా అంధ విద్యార్థులకు పరీక్షలు రాయటానికి ఒక అరగంట సమయం ఎక్కువగా ఇస్తారు. "కానీ నాకు ఎప్పుడూ ఆ అవసరం రాలేదు. మిగిలిన వారి కన్నా తక్కువ సమయంలోనే పరీక్షలు రాసేదాన్ని. లాప్‌టాప్‌ను సమర్థంగా వినియోగించుకోవటం వల్ల సమయం కలిసివచ్చేది" అంటారు అంచల్. చదువు పూర్తి కాగానే ఆమె ప్రస్తుత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ దగ్గర ఇంటర్న్ చేరింది. "నా ఇంటర్న్‌షిప్ పూర్తయిన వెంటనే చంద్రచూడ్ నాకో ఉత్తరం రాశారు. ఒక ఇంటర్న్‌గా నేను బ్రీఫ్‌లు రాయాల్సి ఉంటుంది. నేను తయారుచేసిన అలాంటి బ్రీఫ్‌లలో తనకు ఎటువంటి సమస్యలు రాలేదని ఆయన పేర్కొన్నారు.. నాకు అంత కన్నా పెద్ద ప్రశంస ఏముంటుంది" అంటారు అంచల్. ఇంటర్న్‌షిప్ తర్వాత అంచల్‌కు దేశంలోనే అత్యున్నత లా సంస్థలో ఉద్యోగమొచ్చింది. ఉద్యోగంలో చేరిన తర్వాత డిజిటల్ ప్రపంచంలో లభించే సమాచారం అంధులకు అందుబాటులో లేదనే విషయం అర్థమయింది. "ప్రతి రోజు కోర్టుకు అనేక పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. వీటి కోసం చాలా పరిశోధన చేయాల్సి ఉంటుంది. ఆ సమాచారమంతా డిజిటల్ ప్రపంచంలో ఉంటుంది. దానిని సేకరించాలంటే మొదట్లో చాలా కష్టంగా ఉండేది. ఎందుకంటే- చాలా వెబ్‌సైట్లు అంధులకు సహకరించే విధంగా ఉండవు..అందువల్ల మొదట్లో నేను ఇతరుల సాయం తీసుకొనేదాన్ని. ఆ తర్వాత నాకు ఆ అవసరం లేకుండా అయిపోయింది" అంటారు అంచల్. దీని కోసం తాను పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆమె గుర్తించింది. దీని కోసం ఆమె తన ప్రయత్నాలు ప్రారంభించింది. అంచల్ కథ- జీవితంలో ఎదురయ్యే కఠిన పరిస్థితులను తట్టుకొని కూడా ఎలా నిలబడవచ్చనటానికి ఒక పెద్ద ఉదాహరణ. మన చుట్టూ ఉన్న సమాజంలో కూడా అనేక మంది అంచల్‌లు ఉన్నారు. వారికి కొద్ది ఊతం ఇస్తే చాలు. తిరుగులేని శక్తిగా ఎదుగుతారు.



వ్యాధి నిరోధక శక్తినిచ్చే...



- విటమిన్లు, మినరల్స్ సపోటాలో పుష్కలం. ఓ రెండు సపోటాలు తింటే జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. దీనివల్ల పొట్ట సమస్యలు దరిచేరవు.
- ఈ పండులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు పొటాషియం ఉండటం వల్ల రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. గుండె సంబంధిత ఇబ్బందులు రాకుండా కాపాడుతుంది.
- ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ సౌందర్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా ఎ- విటమిన్ వల్ల చర్మం మీద మృతకణాలు తొలగిపోయిన వెంటనే కొత్త కణాలు వస్తాయి.
- వంద గ్రాముల సపోటాలను తింటే అందులో 83 కేలరీలు అందుతాయి. ఇందువల్ల కడుపు నిండినట్లు ఉంటుంది. అనారోగ్యానికి గురిచేసే ఇతర ఆహారాన్ని తినాలనుకోరు. అందుకే బరువు తగ్గాలనుకునేవాళ్లకు సపోటా సపోర్టుగా పని చేస్తుంది. వారి మెనూలో సపోటాను చేర్చుకోవాల్సిందే.
- కాల్షియం, ఫాస్ఫరస్ వల్ల ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అంతేనా జుట్టు ఆరోగ్యానికి మంచిది.
- ఇందులో చక్కెరశాతం ఉండటం వల్ల త్వరగా శక్తి వస్తుంది. ఈ చక్కెర శరీరానికి ఎలాంటి హాని చేయదు. ఇకపోతే ఎ, సి విటమిన్స్ వల్ల తెల్లరక్తకణాల వృద్ధికి దోహదపడతాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.
- సపోటాలు తినటం వల్ల నిద్ర పడుతుంది. మెదడు మీద ప్రభావం చూపడటం వల్లనే నిద్రవస్తుంది. దీనివల్ల ఒత్తిడి తగ్గిపోతుంది.
- డయాబెటిక్ బారిన పడినవాళ్లు ఈ సపోటాను ఎంచక్కా తినొచ్చు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



యాంత్రీకరణతో కలిగిన ప్రయోజనాలు ఎన్నో. మానవ నాగరికతలో అది చెప్పుకోదగ్గ మైలురాయి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలియాలంటే మెకానికల్ ఇంజనీరింగ్‌పై అవగాహన ఉండాలి. ఈ డిసిప్లిన్‌పై అవగాహనకు తోడు అధ్యయనంతో వచ్చే ఉద్యోగాలు, కెరీర్ పరంగా ఎదుగుదల ఎలా ఉంటుందో చూద్దాం.

కోర్ బ్రాంచెస్‌లో కీలకం
మెకానికల్ ఇంజనీరింగ్

కౌన్సెలింగ్ గైడెన్స్

కదలిక ఉన్న పరికరాల డిజైన్, అభివృద్ధి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు సహా సమస్తం మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి వస్తాయి. మానవుడి రోజువారి జీవితంతో ఈ సబ్జెక్టుకు విడదీయరాని అనుబంధం ఉంది. నివశిస్తున్న భవనంతో మొదలుకుని డ్రైవ్ చేసే వాహనం వరకు చాలా వాటిని మెకానికల్ ఇంజనీరింగ్ ఉనికికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ప్రాబ్లమ్ సాల్వింగ్ కూడా ఇందులో భాగం. సైన్స్, మేథ్స్ ఉపయోగించి మెకానికల్ ఇంజనీర్లు పలు సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటారు. గతాన్ని ఆధారం చేసుకుని మరింత మెరుగైన యంత్రాలను కూడా సూచిస్తారు. టెక్నాలజీతో వచ్చిన అడ్వాన్స్‌మెంట్ ఫలితంగా వివిధ ప్రక్రియల మెరుగుదలకు తోడు సమస్యలకు మంచి పరిష్కారం చూపగలుగుతారు. అందుకే మెకానికల్ ఇంజనీర్లు బయోమెడికల్, మాన్యుఫాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, ఆటోమేటివ్ రంగాల్లో ఉపాధిని పొందగలుగుతున్నారు. మెడికల్ డివైజ్‌లు, ఎలివేటర్లు, ఇంజన్లు తదితరాలన్నింటిలో మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్ పనులు సక్రమంగా నిర్వహించగలుగుతున్నారు.

వివిధ బ్రాంచ్‌లు

మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి పలు బ్రాంచీలు వస్తాయి. ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమేషన్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఆటోమొబైల్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఆటోమేటివ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్(ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్), మెకానికల్ అండ్ రైల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(ఆటోమొబైల్), మెకానికల్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ ఇంజనీరింగ్(మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్), మెకానికల్ ఇంజనీరింగ్(ప్రొడక్షన్), మెకానికల్ ఇంజనీరింగ్(వెల్డింగ్ టెక్నాలజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమొబైల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిజైన్, మెకట్రానిక్స్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆటోమేటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమొబైల్ సర్వీసింగ్ వంటివన్నీ మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకే వస్తాయి.

కెరీర్ అవకాశాలు

పలు కంపెనీలు వీరికి జాబ్స్ ఇస్తున్నాయి. గోద్రేజ్, మహీంద్రా అండ్ మహీంద్రా, లారెన్స్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి), కిర్లోస్కర్, థెర్మాక్స్, అశోక్ లేలాండ్, బీహెచ్ఈఎల్, ఇస్రో, కోల్ వంటి టాప్ పర్ఫార్మింగ్ కంపెనీలు వీరికి ఇచ్చే జాబ్స్ చాలా ఉపయోగకరంగా, వృత్తిలో ఎదిగేందుకు వీలు కల్పించే విధంగా ఉంటాయి. నిజానికి అకడమిక్ గ్యాప్‌ని పూరించేందుకు బీటెక్ కోర్సు తోడ్పడుతుంది. నైపుణ్యం, జాబ్‌లో ఇంప్రూవ్‌మెంట్‌కు అవసరపడుతుంది. అందుకే చదువుతున్నప్పుడే ఇండస్ట్రియల్ ఎక్స్‌పోజర్ చాలా అవసరం. లోతైన అవగాహన కోసం పీజీ చేస్తే ఇంకా మంచిది. మెకానికల్ ఇంజనీరింగ్‌లో లెక్కలేనన్ని అవకాశాలు ఎదురు చూస్తూ ఉంటాయి. సంబంధిత అవగాహన, నైపుణ్యాలను అనుసరించి విలక్షణమైన జాబ్స్‌ను పొందవచ్చు.

కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్: పెద్ద పెద్ద నిర్మాణాల్లో మరొక భవన నిర్మాణంలోనూ మెకానికల్ ఇంజనీర్ అవసరం ఉంటుంది. వెంటిలేషన్, కూలింగ్, హీటింగ్ వంటి పనులు అక్కడ ఉండేవారికి ఎలాంటి అపాయం కలుగని రీతిలో ఉండేందుకు మెకానికల్ ఇంజనీర్ల సూచనలు, సలహాలు అవసరమవుతాయి.

ఆటోమేటివ్ ఇంజనీర్: ఆటోమోటివ్ ఇండస్ట్రీలో వివిధ వాహనాల ఉత్పత్తి, డిజైనింగ్‌లో వీరి సేవలు అవసరమవుతాయి. ఇందులో మళ్ళీ కస్టమర్, మిలిటరీ వాహనాలంటూ ప్రత్యేకంగానూ ఉంటాయి. సురక్షితంగా కొత్త ఫీచర్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఏరోడైనమిక్స్ తదితరాల్లో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర ఉంటుంది.



రోబోటిక్ ఇంజనీర్: రోబోటిక్స్ నిర్మాణం, ప్లాన్, నిర్వహణలో పాలుపంచుకోవాలి. డిజైన్, టెక్నాలజీకి తోడు హెల్త్‌కేర్, మెడికల్ డివైజ్‌ల కోసం రోబోట్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ప్రాసెస్ ఇంజనీర్: తార్కికంగా ఆలోచించడం, సరికొత్తగా చేయాలన్న ఆలోచన - అమలుపై ఆసక్తి ఉన్న మెకానికల్ ఇంజనీర్లు బీటెక్ తరవాత ప్రాసెస్ ఇంజనీరింగ్‌ను ఎంచుకోవాలి. సంబంధిత విధానాల మెరుగుదలలో ప్రాసెస్ ఇంజనీర్ల పాత్ర ఇతోధికంగా ఉంటుంది. వాటర్ అండ్ పవర్ సప్లయ్, ఫార్మాస్యూటికల్స్, డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో వీరి అవసరం చాలా ఉంటుంది.

మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్: వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మెషీన్ల డిజైనింగ్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్ పరిధిలోకి వస్తుంది. మెషీన్ విభాగాలు వేటినైనా వీరే రూపొందిస్తారు. అప్లయిన్సెస్ నుంచి ఫుడ్ వరకు వాటికి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్ట్ మేనేజర్: వివిధ పనులను ప్రాజెక్టులుగా మలిచి టీమ్‌లను సదరు సంస్థలు నియమిస్తాయి. వారందరితో సక్రమంగా పనిచేయిస్తేనే సదరు ప్రాజెక్ట్ పని పూర్తవుతుంది. ప్రాజెక్టుకు మేనేజర్‌గా అనుభవం బాగా ఉన్న వ్యక్తులను నియమిస్తారు. తమ టీమ్‌లోని సభ్యులతో సమర్థంగా పనిచేయించడమే కాదు, ఫలితాలను రాబట్టే పనిని వీరు చేయాల్సి ఉంటుంది. ఇందులోనూ ఎక్స్‌పీరియెన్స్‌డ్ మెకానికల్ ఇంజనీర్లు నేతృత్వం వహిస్తారు.

సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: కస్టమర్ బిల్డింగ్‌లో వీరుంటారు. యంత్రాలు సమర్థంగా, నిరంతరాయంగా పనిచేసే విషయంలో నిమగ్నమై ఉంటారు. క్లయింట్ విజిట్స్, మెషీన్ల చెకింగ్, పనికిరాని వాటిని తొలగించి కొత్తవాటిని ఉంచడం వంటి పనులు ఉంటాయి.

మెటీరియల్స్ ఇంజనీర్: వివిధ యంత్రాల ఉత్పత్తిలో మెటీరియల్ సేకరణ, పరీక్షించడం, మోడిఫై, ఎవాల్యుయేషన్ పనులు ఉంటాయి.

కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: ఫ్యాక్టరీ లేదంటే పనిచేసే చోట పరిశోధన, డిజైన్, డెవలప్‌మెంట్, సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్ పనులు ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే.

ప్రొఫెసర్స్, లెక్చరర్స్: మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ లేదంటే యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయితే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బోధకులుగా రాణించవచ్చు. అంటే అకడమిక్ వాతావరణంలో ఉండొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు: యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి ఎంపికైతే ఆరంభంలోనే మంచి జీతం, అధికారిక హోదా తద్వారా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థలు మొదలుకుని పలు ఇతర విభాగాల్లో మెకానికల్ ఇంజనీర్లు అవసరమవుతారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్: బాస్‌గా మారడం అన్నమాట. సొంతంగా పైకి ఎదగాలన్న ఆకాంక్ష ఉంటే అందుకు సొంత ఆలోచనలు తోడైతే ఇండిపెండెంట్‌గా యూనిట్ పెట్టుకోవచ్చు. ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. తానే మరికొందరికి ఉపాధి కల్పించవచ్చు.

ప్రయోజనాలు

మనిషి దైనందిన జీవితంతో ముడిపడినది మెకానికల్ ఇంజనీరింగ్. అందులో భాగంగా వివిధ పరిశ్రమల్లో తలెత్తే సమస్యల పరిష్కారంలో మెకానికల్ ఇంజనీర్లు విశిష్ట పాత్రను పోషిస్తారు. మెషీన్స్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్, మెయింటెనెన్స్, అనాల్సిస్ కాన్సెప్టులు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో భాగం. ఈ నాలుగేళ్ళ కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉజ్వల కెరీర్‌కు రహదారిని నిర్మిస్తుంది. మేథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, థియరీ ఆఫ్ మెకానిక్స్, మెషీన్ డ్రాయింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తదితరాలు కోర్సులో ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్, రీసెర్చ్, డిజైన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించి నైపుణ్యాల పెంపునకు పై అంశాల అధ్యయనం ఉపయోగపడుతుంది. సంబంధిత నైపుణ్యాలకు పదునుపెట్టుకోవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది. వివిధ ఉత్పత్తులకు అవసరమైన యంత్రాల నిర్మాణం, మెరుగుదలలోనూ పాత్ర ఉంటుంది. మొత్తమ్మీద యంత్ర పురోగతితో మానవాభివృద్ధి ముడిపడి ఉందన్న అవగాహన ఉంటే సమాజంలో మెకానికల్ ఇంజనీర్ల అవసరం ఎంత అన్నది అర్థమవుతుంది. అవకాశాలకు ఆకాశమే హద్దు అన్న విషయమూ అవగతమవుతుంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

సివిల్స్ ప్రిలిమ్స్

GS Mock Questions

నిన్నటి తరువాయి

40. Consider the following statements:

Statement I: Supreme court of India sometimes exercises executive and legislative functions in specific scenarios ,including issuing guidances and directives to governmental bodies.

Statement II: Article 142 empowers the supreme court in the exercise of its jurisdiction may pass such decree or make such order as is necessary for doing completely justice in any cause or matter pending before it.

Which one of the following is correct in respect of the above statements?

a. Both Statement-I and Statement-II are correct and statement-II is the correct explanation for statement-I
b. Both Statement-I and Statement-II are correct and Statement-II is not the correct explanation for Statement-I
statement _I is correct but Statement-II is incorrect.
statement-I is incorrect but Statement-II is correct.

41. Consider the following:

1. Service voters 2. Absentee voters
3. Electors on election duty

How many of the above are eligible for voting through postal ballots?

a. Only one b. Only two
c. All three d. None

42. Consider the following statements regarding the Electoral bonds scheme which was recently struck down by the supreme court:

1. They are interest-free bonds issued like promissory notes.
2. All registered parties were eligible to get donations through electoral bonds.
3. A non-citizen also could purchase the bond.

How many of the statements given above are correct?

a. Only one b. Only two
c. All three d. None

43. Consider the following:

1. Indra Sawhney & others Vs. Union of India
2. M. Nagaraj Vs. Union of India
3. Janhit Abhiyan Vs. Union of India

How many of the above have bearing on the reservation policy?

a. Only one b. Only two
c. All three d. None

44. Consider the following statements regarding finances of Panchayat Raj institutions (PRIs):

1. Property tax on lands is a source of own tax revenue for PRIs.
2. More than 60 percent of their revenues come from internal sources.

Which of the statements given above is/are correct?

a. only 1 b. only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

45. Consider the following statements regarding the street vendors Act, 2014:

1. As per the act, every street vendor shall have the right to carry on the business of street vending activities.
2. It provides for the establishment of Town vending Committees in each local authority.
3. It also provides for the survey of street vendors once every four years.

How many of the above statements are correct?

a. Only one b. Only two
c. All three d. None

46. Consider the following statements regarding Surrogacy (Regulation) Amendment Rules, 2024:

1. The recent amendment prohibited the use of donor gametes by intending couple for surrogacy.
2. Single woman (widow or divorcee) undergoing surrogacy must use self-eggs and donor sperms to avail surrogacy procedure.

Which of the statements given above is/are correct?

a. Only 1 b. Only 2
c. Both 1 & 2 d. Neither 1 nor 2

47. Consider the following:

1. Not less than 10% reservations in Government or Government aided higher educational institutions for PwDs.
2. Not less than 5% reservation in Government jobs for PwDs.
3. Reservation for PwDs is not applicable to police forces.

How many of the above are provided under the Rights of Persons with Disabilities Act,2016?

a. Only one b. Only two
c. All three d. None

48. Consider the following statements regarding 106th Constitutional Amendment:

1. It provides reservation of 1/3rd seats for women in the parliament.
2. The act applicable to all states and union territories.

Which of the statements given above is/are correct?

a. only 1 b. only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

49. With reference to the simultaneous elections, seen in news, which of the statements given below is correct?

a. Simultaneous elections was implemented in India till now.
b. Simultaneous elections have to happen in a single day.
c. Simultaneous elections is an idea which aims synchronize all elections from panchayats to parliament.
d. Rammath Kovind Committee has been set up to make recommendations regarding simultaneous elections.

50. Consider the following statements regarding disqualification of lawmakers in India:

1. High courts can declare an election to a member of parliament void.
2. The aggrieved person can appeal to the Supreme court against the order of the High Court.
3. A member does not have to vacate the office immediately if the appeal is pending in the Supreme Court.

How many of the statements given above are correct?

a. Only one b. Only two
c. All three d. None

ANSWERS

40. a	43. a	46. b	49. d
41. c	44. a	47. b	50. c
42. a	45. b	48. d	

Prepared by : CSB Academy, Hyderabad

లిటిల్స్




అడగకూడని వరాలు

ఒక ఊరిలో ఒక జంట నివసిస్తూ ఉండేవారు. వారిద్దరికీ అమితమైన కోరికలు, ఆశలు ఉండేవి. "దేవుడు ప్రత్యక్షమై వరాలు ఇస్తే బావుండును" అనుకొనేవారు. వారికి ఒకే సంతానం. భర్త అప్పుడప్పుడు సరదాగా- "మన పిల్లవాడికి మీసాలు వచ్చిన తర్వాత విశ్రాంతి దొరుకుతుంది" అనేవాడు. ఒక రోజు వారింటికి ఒక బాటసారి వచ్చి ఆశ్రయం కోరాడు. అతనికి దంపతులు ఆతిథ్యమిచ్చారు. మాటల్లో తమ కోరికల గురించి చెప్పారు. అప్పుడు ఆ బాటసారి- "నేను మీకు మూడు వరాలు ఇస్తాను.. కోరుకోండి" అన్నాడు. అప్పుడు భర్త - "మా పిల్లవాడికి మీసాలు వస్తే నేను విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నా" అన్నాడు. భార్య - "నేను ఏ వస్తువు తాకినా అది బారెడు బంగారం కడ్డీలా మారిపోవాలి" అని కోరుకుంది. బాటసారి 'తథాస్తు' అన్నాడు. వెంటనే ఉయ్యాలలో ఉన్న పిల్లవాడికి మీసాలు మొలిచాయి. భార్య పొరపాటున ముక్కును తుడుచుకోవటంతో- ముక్కు మూరెడు బంగారంగా మారిపోయింది. ఆ భార్యభర్తలిద్దరికీ ఏం చేయాలో తెలియలేదు. అప్పుడు ఆ బాటసారి- "మీకు ఇంకో వరం ఉంది.. కోరుకోండి" అన్నాడు. అప్పుడు వారిద్దరు - "మాకు ముందు ఇచ్చిన వరాలు వద్దు.. మామూలుగా మార్చండి" అని కోరుకున్నారు. ఆ తర్వాత కాలంలో ఎప్పుడూ వారు అత్యాశకు పోలేదు.


నీతి: అత్యాశ లేనిపోని అనర్థాలు తెచ్చిపెడుతుంది.

సరైన నీడ ఏది?





7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 330

6		3		2				
				8	9	6	3	7
							1	
8		9	1		4			2
1		6	3		8	7		5
3			2		7	9		1
	8							
9	3	2	8	4				
				1		8		3

సుడోకు - 329 సమాధానం

6	8	7	5	2	9	4	3	1
1	9	3	4	8	7	2	6	5
4	5	2	6	1	3	7	8	9
5	1	9	2	7	8	3	4	6
7	6	8	3	4	1	9	5	2
3	2	4	9	5	6	1	7	8
2	7	5	1	6	4	8	9	3
8	3	6	7	9	2	5	1	4
9	4	1	8	3	5	6	2	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.